
ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

మే 2021
సంచిక : 441
వెల : 25/-

## ప్రజాసాహితీ, సాంస్కృతికోద్యమం
## కామ్రేడ్ మధు




జనసాహితి ప్రచురణ

# కా॥ మధు(మరింగంటి శ్రీనివాసాచార్యులు) కు విప్లవ జోహార్లు



వర్తమాన భారత సామాజిక జీవితంలో, ప్రగతిశీల సాంస్కృతిక వికాసానికై సాహిత్యోద్యమ కృషి చేసే విప్లవ రచయితలు, వారి సాహిత్య సంస్థలు అనుస రించాల్సిన సరియైన మార్క్సిస్టు సాంస్కృతిక విప్లవ దృక్పథం ఏది అనే తీవ్రమైన సైద్ధాంతిక, ఆచరణ సంబంధమైన సమస్యకు శాస్త్రీయమైన అవగాహన అందించిన మరింగంటి శ్రీనివాసాచార్యులు (కామ్రేడ్ మధు) 16-4-2021న విజయవాడలోని ఒక ఆసుపత్రిలో మరణించారు. 1960వ దశకం చివరి నుండి దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డిల అనుచరునిగా కమ్యూనిస్టు విప్లవ వర్గాలలో పేరుపొందిన కామ్రేడ్ మధు, కానూసన్యాల్ నాయకత్వాన 2005లో ఏర్పడిన సిపిఐ(ఎం-ఎల్) పార్టీలో కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఉంటూ వచ్చారు. వారి సుదీర్ఘ విప్లవ కార్యకలాపాలలో భాగంగా సాహిత్య సాంస్కృతిక రంగాలలో కూడా ఆయన కృషి చేశారు. వారి కృషి జనసాహితి లాంటి సంస్థలకు ఎంతో తోడ్పడింది. మధుగారి మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతూ ఈ ప్రకటన విడుదల చేస్తున్నాము.

20వ శతాబ్ది ప్రారంభం నుండి భారత దేశంతో పాటు తెలుగు సమాజంపైన, బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేక, నిజాం ఫ్యూడల్ పరిపాలన వ్యతిరేక పోరాటాల ప్రభావం బలీయంగా ఉండేది.

1940-1955 సంవత్సరాల నడుమ తెలుగు సమాజాన్ని కమ్యూనిస్టు ఉద్యమం ఎవరూ విస్మరించలేనంత తీవ్రంగా ప్రభావితం చేసింది. అది నేటి దాకా కొనసాగుతూ ఉంది. ఆనాడు తాత్విక భావజాలరంగంలో భావవాద, భౌతికవాద దృక్పథాలు, కార్యాచరణ రంగంలో విభిన్న సామాజిక ఉద్యమ పంథాలు సంఘర్షిస్తూ ఆకర్షిస్తూ ఉండేవి. మార్క్సిస్టు సిద్ధాంత ప్రభావం రాజకీయంగానే కాక భావజాల రంగంలోనూ, సామాజిక ఉద్యమాలతో సహా ప్రజా జీవితంపైన కూడా తగినంత ఉండేది. అభ్యుదయ రచయితల సంఘం, ప్రజానాట్యమండలి లాంటి సాహిత్య కళారంగ సంస్థలు ఉండేవి. వాటిల్లో కమ్యూనిస్టులు కూడా ఉంటూ కీలకపాత్ర పోషిస్తూ ఉండేవారు. ప్రజాఉద్యమాలపై ఈ సాంస్కృతికోద్యమ ప్రభావం ఉన్నట్లే ఉద్యమాల ఒడుదుడుకుల ప్రభావం కూడా ఈ రంగాలపైన ఉండేది.

భారత కమ్యూనిస్టు పార్టీ వర్గాలలో సరి అయిన విప్లవ కార్యక్రమం పంథా గురించి, వాటి అమలులో వచ్చిన తీవ్రమైన పోరాట సమస్యల గురించి అంతరంగికంగా విభిన్న ధోరణుల, అవగాహనల మధ్య సంఘర్షణ ఉండేది. దాని ప్రభావం సాహిత్య సాంస్కృతిక రంగాలపైన ప్రసరించేది. అయితే 1955 తరవాత కాలంలో కమ్యూనిస్టు ఉద్యమంలో జరిగిన అంతరంగిక సిద్ధాంత రాజకీయ సంఘర్షణ సాగిన తీరుకు, సాహిత్యోద్యమరంగంలో, సరియైన సాహిత్య సామాజిక అవగాహన, ఉద్యమ దృక్కోణం కొరకు జరిగిన సంఘర్షణకు ఒక ముఖ్యమైన తేడా ఉంది. కమ్యూనిస్టు పార్టీలో జరిగిన విధంగా అంతరంగిక సంఘర్షణ సాహిత్యోద్యమరంగంలో 1965 దాకా దాదాపు జరగనేలేదు. ఆ తర్వాత కాలంలో జరిగిన మేరకయినా బాహ్య సంఘర్షణగా మాత్రమే అది సాగింది. అందుకు ముఖ్య కారణం తెలుగునాట అభ్యుదయ రచయితల సంఘం 1955 తర్వాత నిర్మాణ పరమైన నిస్తబ్ధతలో కూరుకుపోవడం. వ్యక్తులుగా తమ తమ సాహిత్య కృషిని సాగించడమే తప్ప, సంస్థాగతంగా సమన్వయ పరచే సమష్టి బాధ్యత వహించగల పరిస్థితి లేకుండాపోవటం. 'అభ్యుదయ' పత్రికను కూడా నిర్వహించలేక పోవటంతో పాటు, పాలకవర్గాలు పెంచి పోషిస్తున్న అభివృద్ధి నిరోధక సాహిత్య సాంస్కృతిక వ్యాప్తికి, మితవాద సంస్కరణవాద ధోరణులకు వ్యతిరేకంగా అరసంలో సంస్థాగత సాహితీ ప్రతిస్పందన కరువైంది. ప్రజలు సాగిస్తున్న అనేక పోరాటాలకు ప్రపంచంలోనూ దేశంలోనూ పెరుగుతున్న ప్రజా జీవన సంఘర్షణకు ఒక సాహిత్యోద్యమ సంస్థగా అరసంలో ప్రతిస్పందన లేని పరిస్థితి. ఎన్నికలే సర్వస్వం అనే భావనలు, సంస్కరణవాద ధోరణులు తెలుగునాట సాహిత్య సామాజిక రాజకీయ రంగాలలో పైచేయి సాధించినా వాటిపై ఒక అవగాహనకు, మితవాద ధోరణులకు వ్యతిరేకంగా అరసంలో నిర్మాణాత్మక కృషికి అవకాశమే లేకుండా పోయింది. సి.వి., సుబ్బారావు పాణిగ్రాహి లాంటి వారు తప్ప సాహిత్య సాంస్కృతిక రంగాల్లో మితవాద ధోరణులకు వ్యతిరేకంగా సూటిగా తలపడినవారు లేకుండాపోయారు. పై ధోరణులకు వ్యతిరేకంగా నాటి యువతరంలో గూడుకట్టుకుని ఉన్న ఆగ్రహం, తదనంతర కాలపు నక్సల్బరీ విప్లవ వెల్లువలో మితవాదానికి ప్రతిగా అతివాదానికి సులువుగా ఆకర్షణ లభించింది. 1970లో ఆవిర్భవించిన విప్లవ రచయితల సంఘంలో ఇలాంటి వివిధ విప్లవ ధోరణుల నడుమ సరైన దృక్పథం కోసం క్రమంగా సంఘర్షణ సాగింది.

అర్ధ వలస, అర్ధ ఫ్యూడల్ స్వభావం గల భారతదేశం నూతన ప్రజాస్వామిక విప్లవ దశలో ఉన్నది కనుక విప్లవంలో పాల్గొనే అవసరం, అవకాశంగల వివిధ పీడిత వర్గాల ప్రజలకు, వారివారి ప్రజాతంత్ర కోర్కెలకు, భావ ధారలకు విరసంలో స్థానం ఉండేలా సంస్థను ఒక విశాల ప్రజా సంస్థగా నిర్వహించు కోవాల్సిన ప్రధాన బాధ్యత మార్క్సిస్టు దృక్పథంగల వారి పైనే ముఖ్యంగా ఉంటుందనే అవగాహనను 1972లో గుంటూరులో జరిగిన మూడవ విరసం మహాసభలో "సాంస్కృతిక విప్లవం - మన కర్తవ్యాలు" అనే విస్పష్టమైన పత్రాన్ని, రూపొందించి గుంటూరు జిల్లా శాఖ ద్వారా విరసం నాయకత్వానికి అందించారు. ఆ విధంగా గుంటూరు జిల్లా విరసం శాఖ తరఫున

(తరువాయి 3వ అట్టలో....)

జనసాహితి ప్రచురణ

44 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంపుటి : 44

సంచిక : 10

మే 2021

441

www.prajaasaahithi.com


## ఈ సంచికలో...


| | | | | |
|---|---|---|---|---|
| ❑ ముఖచిత్రం | : | ప్రజాసాహితీ, సాంస్కృతికోద్యమం – కా॥ మధు | | .....01 |
| ❑ రెండవ అట్ట | : | కా॥ మధుకు విప్లవ జోహార్లు | | .....02 |
| ❑ మూడవ అట్ట | : | కా॥ మధుకు విప్లవ జోహార్లు | | .....35 |
| ❑ నాల్గవ అట్ట | : | చిత్రకారుడు – ఆనంద్ | | .....36 |
| ❑ సంపాదకీయం | : | పాలకుల నిర్లక్ష్య విధానాల వల్లే కరోనా ఉధృతి | | .....05 |
| ❑ కథలు | : | ఆంతర్యం | – బొలుసాని జయప్రభ | .....07 |
| ❑ డాక్యుమెంట్ | : | "ప్రజాసాహితీ, సాంస్కృతికోద్యమం–కమ్యూనిస్టులు" డాక్యుమెంట్ ముగింపు భాగం | – కా॥ మధు | .....10 |
| ❑ పుస్తక సమీక్ష | : | 'మనోధర్మపరాగం' | – డా॥ చంద్రారెడ్డి | .....12 |
| ❑ గల్పిక | : | శ్రీ ఆంజనేయం.. ప్రసన్నాంజనేయం.... | – శంకరం | .....15 |
| ❑ సినిమా సమీక్ష | : | కళ ఎవరికోసమని ప్రశ్నించిన 'మెఫిస్టో' (1981) | – బాలాజీ (కోల్‌కతా) | .....21 |
| ❑ కవితలు | : | సిహెచ్. మధు (**19**); పంకజ్ ప్రసూన్ (**23**) | | |
| ❑ ఈ నెల పుస్తకం | : | 'నా జాతి ప్రజల కోసం నిలబడతా!' | | .....32 |
| ❑ వివిధ | : | యలమంచిలి వెంకటప్పయ్య సంస్మరణ వేదిక (**09**); వీర సాథీదర్ స్మృతి (**14**) 16 ప్రజాసంఘాలపై నిషేధాన్ని ఖండిస్తున్నాం (**17**); అస్సాం రచయిత్రి శిఖాశర్మ అరెస్టు (**18**); ముప్ఫై ఏళ్ళ క్రితం ప్రజాసాహితి (**31**); సీమాసింగ్‌ను విధుల నుండి తొలగించాలి (**32**); చైతన్యవాహిని (**33**); ఈ పుస్తకాలు అందాయి (**34**) | | |
| ❑ శాశ్వతనిధి | : | దీప్తినాథ్ (**20**) | | |
| ❑ సంతాపాలు | : | చంద్ర (**04**), ఎస్. రమాదేవి, ఎ.వి. రెడ్డి శాస్త్రి, బాపూజీ, అయినాల కనకరత్నాచారి, కొక్కిలిగడ్డ శంకర్రావు, యామిని, పి. అనంతరావు, కె. విజయనరసింహారావు, సుమిత్రా భావే, టి. అరుణ (**06**), శాఖమూరు రాంగోపాల్ (**11**), కె.పి. సుబ్బారావు (**17**), సిహెచ్. మధు (**18**) జె.వి. రాఘవేంద్రరావు (**20**), వంగర లక్ష్మీకాంత్ (**30**), శంఖాఘోష్ (**31**), మహమ్మద్ యాకూబ్, ఎం. రామకృష్ణ (**33**) | | |



**ప్రధాన సంపాదకుడు : కొత్తపల్లి రవిబాబు ఫోన్ : 9490196890** E-mail : ravibabujs@yahoo.co.in

*చందాలు పంపవలసిన చిరునామా :*

**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి

జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి

**30-7-6,** అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,

దుర్గాఅగ్రహారం, విజయవాడ – **520002.**

ఫోన్ : **7075957010** prajasahithi1977@gmail.com



ISSN 0971-278X

LCCN 94903393



*రచనలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :*

**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి

ప్లాట్ నెం. **59,** రాధాక్రిష్ణ నగర్ కాలనీ

ఆర్మీ క్యాంటీన్ దగ్గర, డగ్లస్ స్కూల్ ఎదురు వీధి,

శ్రీకాకుళం – **532001**

ఫోన్ : **9441913829** prajasahithi1977@gmail.com

'ప్రజాసాహితి'
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
"అకౌంట్ నెం.
**0680101004936**
**IFSC No. CNRB0000680**
**ఫోన్ : 94901 96890**

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు
1/4 డెమ్మీ పరిమాణం

రెండవ, మూడవ అట్ట మల్టీకలర్ రు. 20,000
లోపలి పూర్తి పేజి రు. 15,000
లోపలి అరపేజి రు. 7,000

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం


## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు మీ పేరు పైన వుంటాయి. దాని ప్రకారం చందా పూర్తికాకమునుపే, చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

# చిత్రకారుడు 'చంద్ర' మరణం






**'చంద్ర'**, 'బాల' పేర్లతో చిత్రకారునిగా, ఇల్లస్ట్రేటర్‌గా, కార్టూనిస్ట్‌గా, డిజైనర్‌గా ప్రసిద్ధి చెందిన మైదం చంద్రశేఖర్ దీర్ఘ అనారోగ్యంతో 28-04-2021న హైదరాబాదులో తన 75వ యేట మరణించారు. ఆయన 28 ఆగస్టు 1946న వరంగల్ జిల్లా గన్నాసరి గ్రామంలో జన్మించారు.

తన చిన్ననాటి నుంచే చిత్రాలు గీయటం ప్రారంభించిన చంద్ర, హైస్కూలు విద్యార్థిగా ఎం.ఎఫ్. హుస్సేన్, కొండపల్లి శేషగిరిరావుల చిత్రాల ప్రతికృతులను చిత్రించారు. బాపుకు ఏకలవ్య శిష్యునిగా చెప్పుకున్న చంద్ర త్వరలోనే తనదైన సొంత గీత, రాత ఏర్పరచుకున్నారు. 13 ఏళ్ళకే కార్టూన్లు గీశారు. కేవలం స్వయంకృషితో చిత్రకారునిగా ఎదిగిన ఆయన ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చదివారు. తల్లిదండ్రులను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకుని కష్టనష్టాలను భరించి తన కాళ్ళపై తాను నిలబడ్డారు. 'మయూరి', 'జ్యోత్స్న', 'యువ', 'అపరాధ పరిశోధన', 'జ్యోతి' పత్రికల్లో పనిచేశారు.

ఎన్నో ప్రగతిశీల కవితలకు స్ఫూర్తివంతమైన చిత్రాలు వేశారు. 1970-76 మధ్య విప్లవ రచయితల సంఘంలో సభ్యునిగా కృషి చేశారు. ఖమ్మంలో జరిగిన మొదటి విరసం సభలో తన చిత్రాలను ప్రదర్శించారు. ఎమర్జన్సీలో పలు రచయితలతో పాటు జైలులో వున్నారు. 1977 ఆగస్టులో ప్రారంభించిన 'ప్రజాసాహితి'కి కొన్ని నెలలపాటు ముఖచిత్రాలు వేశారు. 'ప్రజాసాహితి' నూరవ సంచికకు విశిష్టమైన ముఖచిత్రం వేశారు.

చంద్ర కథారచయిత కూడా. దాదాపు 150 కథలు రాశారు. వాటిలో '12 కథలు' శీర్షికతో ఒక కథా సంకలనం వెలువరించారు. మిత్రులతో కలసి న్యూ వేవ్ రైటర్స్ పేరుతో 'పోరు' అనే కథాసంకలనం ప్రచురించారు.

'చిల్లర దేవుళ్ళు', 'ఊరుమ్మడి బ్రతుకులు', 'చలిచీమలు', 'తరం మారింది' లాంటి 20 సినిమాలకు, పలు లఘు చిత్రాలకు కళా దర్శకుడిగా పనిచేశారు. హైదరాబాదు సార్వత్రిక విశ్వవిద్యాలయంలో చిత్రకళా ఉపాధ్యాయునిగా, చిత్రకళపై ఎన్నో ఉపన్యాసాలు ఇచ్చారు. వ్యాసాలు రాశారు. రెండు వేలకు పైగా వ్యంగ్య చిత్రాలు గీశారు. ఎన్నో పుస్తకాలకు ముఖచిత్రాలు వేశారు.

వియత్నాంపై అమెరికా వేసిన బాంబు దాడిపై వీరి చిత్రం క్యూబాలో జరిగిన తొమ్మిదవ అంతర్జాతీయ యువజన ఉత్సవాలకు ఎన్నికైంది.

'చంద్ర' మరణానికి 'ప్రజాసాహితి' సంతాపాన్ని ప్రకటిస్తోంది. వారి కుటుంబ సభ్యుల దుఃఖంలో పాలు పంచుకుంటోంది.

# సంపాదకీయం

# పాలకుల నిర్లక్ష్య విధానాల వల్లే కరోనా ఉధృతి

**ఊపిరి** అందని నిస్సహాయ పరిస్థితుల్లో భారత ప్రజానీకం మరణం అంచున వేలాడుతోంది. ప్రజల చితిమంటల కాగడాని ఎత్తిపట్టి దానినే అభివృద్ధి వెలుగుగా భారత పాలకవర్గం చాటుకుంటోంది. దయనీయ కరమైన పరిస్థితులను, చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడే దుస్థితిని ప్రజలకి కల్పించిన నేరం మాత్రం పాలకులదే. గత సంవత్సర కాలంగా కరోనా వల్ల జరిగిన కల్లోలం తర్వాత సెకెండ్ వేవ్ వల్ల కలిగే విలయం గురించి శాస్త్రవేత్తల, డాక్టర్ల, ప్రజాతంత్రవాదుల హెచ్చరికలను పట్టించు కోకుండా పాలకులు పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలను కాపాడుతూ ప్రజారోగ్య వ్యవస్థనూ, ప్రజల ప్రాణాలను గాలిలో దీపం చేశారు. వందేళ్ళనాడు ప్లేగు, కలరా మొదలగువాటికి బలైనట్లే సైన్సు ఎంతో అభివృద్ధిచెందిన ఈ కాలంలోనూ ప్రజల ప్రాణాలను కాపాడుకోలేకపోతున్నాం. అభివృద్ధిచెందిన శాస్త్ర జ్ఞానాన్ని ధనాఢ్యవర్గాల ప్రయోజనాలకి ఉపయోగిస్తున్న పాలకవర్గాలు – నూకలున్నవాడే బ్రతికే చందంగా ప్రజల్ని మూఢత్వంలోకి, నిస్సహాయతలోకి నెట్టేస్తున్నాయి. వ్యవస్థ విఫలమయిందా, వ్యవస్థను విఫలం చేస్తున్నారా అన్నది ప్రాణాల్ని గుప్పెట్లో పెట్టుకొని పరుగు లెడుతున్న దృశ్యం వల్ల అర్థం అవుతూనే వుంది. ఘనత వహించిన మన 'దేశభక్త' పాలకులు కరోనా నెపంతో అన్ని వ్యవస్థలనూ నిర్వీర్యం చేశారు. కరోనా జాగ్రత్తలు పాటించని ప్రజల వల్లే ఇదంతా జరుగుతున్నట్లుగా చిత్రిస్తున్నారు. ఎక్కడా వైద్యం అందని పరిస్థితులను కల్పించి ఆందోళనాపూరిత వాతావరణాన్ని సృష్టించారు. ఆందోళనలతోనే ఎక్కువమంది చనిపోతున్నట్లుగా ప్రచారమూ చేశారు.

కుటుంబాలు కుటుంబాలే కరోనా బారినపడి చనిపోతున్నాయి. మన ప్రధానమంత్రి పెద్దనోట్ల రద్దుతో ప్రారంభించిన 'క్యూ' లు (చాంతాడంత లైనులు) అన్నింటా కొనసాగుతున్నాయి. టెస్టుల కోసం క్యూ, వైద్యం కోసం క్యూ, వ్యాక్సిన్ కోసం క్యూ, శవదహనానికీ క్యూ.... పాలకులు పన్నిన పలు విధానాల వలలో చిక్కిన ప్రజానీకం – వారి దయా దాక్షిణ్యాలకై, వారి ఆదేశాలను అమలు చేసే మరమనుషులుగా తయారు చేశారు. ఇది నేటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశ అవస్థ. ఎంత విషాదకరమైన పరిస్థితులలో నేదున్నాం! పోషకాహార లోపంతో, కలుష వాతావరణంలో ఎక్కువ పనిగంటలతో విశ్రాంతి లేకుండా నిరంతరం ఏదో ఒక జబ్బుతో బాధపడుతున్న ప్రజలు కరోనా బారిన పడటం సహజమే. కరోనా లక్షణాలేమో అంటేనే ఆదరించేవారూ లేరు. వారిని పరీక్షించటానికి టెస్టింగ్ కిట్లూ లేవు. రిపోర్టు వచ్చినా వైద్యం అందించే సదుపాయాలూ, అవకాశాలూ లేవు. హాస్పిటల్స్ లేవు. బెడ్‌లు లేవు. మందులు లేవు. ఆక్సిజన్ సిలిండర్లూ లేవు. ఇక వెంటిలేటర్ల సంగతి సరేసరి. వేలమందికి ఒకరుగా వున్న ప్రభుత్వ డాక్టర్లు తమ శాయశక్తులా కృషిచేస్తూనే వున్నారు. వాళ్ళు కరోనా బారినపడితే ఆ ఖాళీని భర్తీ చేసేవారు లేరు. ప్రైవేటు హాస్పిటల్స్ దందాకి అడ్డూ అదుపూ లేదు. ఎవరికి ఎవరమూ ఏమీ కాలేని పరిస్థితులు. తల్లీ – తండ్రీ, అక్క – చెల్లి, అన్న – తమ్ముడు, భార్యా – భర్త ఏ బంధాలైనా చనిపోయినవారి కడచూపుకు నోచుకోవటం గగనమౌతుంది. డబ్బులూ, హోదా, సాంఘిక బలం – ఇవి ఏవీ కరోనా మరణాల్ని నిలువరించలేకపోతున్నాయి. మరణించినవారి అంతిమయాత్రలకే కాదు – కుటుంబాలకు తోడుగా, అండగా నిలబడలేకపోతున్నాం. వెలివేత.... ఒంటరిగా, ఒక్కొక్కరంగా సంఘ జీవితాన్నుండి 'వెలివాడ'లకు నెట్టబడుతున్న ఈ జీవన సంస్కృతి విధ్వంసానికి మన పరిపాలనా విధానాలే బాధ్యత వహించాల్సి వుంటుంది.

సామ్రాజ్యవాద అగ్ర రాజ్యానికి మోకరిల్లుతూ మోదీషాలు ట్రంప్‌కు స్వాగతం పలుకుతూ మన దేశంలోకి మొదటి వేవ్ కరోనాను ఆహ్వానించారు. కరోనా నెపంతో ప్రజలకు కావాల్సిన సదుపాయాలేవీ ముందుగా కల్పించకుండా అప్పటికప్పుడు లాక్‌డౌన్‌ను ప్రకటించి అశేష శ్రామిక ప్రజానీకాన్ని కష్టాలపాలు చేశారు. వలస కార్మికుల పాదముద్రల రక్తపు తడిని ఈ దేశపు రోడ్లన్నీ చవిచూశాయి. ఢిల్లీలో ముస్లింల సమావేశానికి అనుమతినిచ్చి – వారి వల్లే కరోనా వ్యాపించిందని ప్రజల్ని మతాల పేరుతో విభజించారు. పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమాన్ని అణచివేశారు. గో కరోనా గో అంటూ చప్పట్లు కొట్టించి, కొవ్వొత్తులు వెలిగించి, ఇంటి దీపాలను ఆర్పేశారు. 'ఆత్మ నిర్భర భారత్' అంటూ అన్ని రంగాలనూ ప్రైవేటీకరించటానికి, గుత్త పెట్టుబడిదారులకు అప్పనంగా దోచి పెట్టటానికి పూనుకున్నారు. నిత్యావసర వస్తువులతో సహా అన్నింటి ధరలను రెట్టింపు చేశారు. ఉపాధి లేక, కుటుంబ పోషణ వత్తిడితో సతమతమవుతున్న ప్రజానీకానికి, మద్యంషాపులు బార్లా తెరిచారు. బాధితులనే నిందితులుగా చిత్రించారు. ప్రజల శ్రమను దోచుకోవటంతోపాటు వారి శ్రమ సంస్కృతినీ, కుటుంబ వ్యవస్థనూ, వ్యక్తిత్వాలనూ విచ్ఛిన్నం చేస్తున్నారు. కరోనా సెకెండ్ వేవ్ చాల ఉధృతంగా ఉంటుందని ప్రపంచం అంతా హెచ్చరించినా పోయేది ప్రజల ప్రాణాలేగా అన్నంత నిర్లక్ష్యంగా ఎన్నికల ర్యాలీలు, సభలు నిర్వహించారు. మాస్కులు లేకుండా ఒకరినొకరు తోసుకుంటూ వున్న పెద్ద పెద్ద గుంపుల సభలను స్వయంగా ప్రధానమంత్రే నిర్వహించటాన్ని ప్రపంచమంతా తప్పు పట్టింది. రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా శాంతియుతంగానూ, నల్ల చట్టాలను ఆమోదించబోమన్న దృఢనిశ్చయంతో సాగుతున్న రైతాంగ ఉద్యమాన్ని, ఆంధ్రుల హక్కు – విశాఖ ఉక్కు అని కార్మికులు చేస్తున్న ఆందోళనలను పట్టించుకోకుండా

ఒంటెద్దు పోకడగా వ్యవహరిస్తున్న మోదీషాలు కోట్ల డబ్బులు ఖర్చుపెట్టి లక్షలమందితో కుంభమేళాలు నిర్వహించారు. క్రికెట్ మ్యాచ్‌ల కోసం స్టేడియంలు నింపేశారు. సినిమా థియేటర్లు, పబ్‌లు, మద్యంషాపుల చుట్టూ ప్రజల్ని పోగేశారు. పాలకులే ప్రయత్నపూర్వకంగా కరోనాని విచ్చలవిడిగా వ్యాపింపచేశారు. మన ఆరోగ్య అవసరాలను పట్టించుకోకుండా మన దగ్గరున్న ఆక్సిజన్‌ను, వ్యాక్సిన్లను ఇతర దేశాలకు ఎగుమతి చేసి – మన దేశంలోని ప్రజారోగ్య వ్యవస్థను కుప్పకూల్చారు. ఊపిరందక కళ్ళముందే కుటుంబ సభ్యులు, స్నేహితులతో సహా ఎందరో మరణిస్తున్న పరిస్థితుల్లో మనల్ని మనమే ఇళ్ళకు బంధించుకునే స్థితిలోకి నెట్టారు.

ఆక్స్‌ఫాం నివేదిక ప్రకారం మార్చి 2020 నుండి జనవరి 2021 వరకూ వందకు పైగా శత సహస్ర కోటీశ్వరులు తమ సంపదను 13 లక్షల కోట్ల రూపాయలు పెంచుకున్నారు. స్వయానా పాలకులే 69 వేల కోట్ల రూపాయలకు పైగా బడా పెట్టుబడిదారుల అప్పులను రద్దు చేశారు. ఈ పాలకులు ఎవరి పక్షమో, ఈ పరిపాలన ఎవరికోసమో తేటతెల్లమవుతుంది. దున్నేవానికే భూమి దక్కాలని భూస్వామ్య వ్యవస్థతో పోరాడుతూ 'బయటపడ్డ పేగులను పై పంచెతో అదిమిపట్టి' రణరంగంలోకి దూకిన పోరాట వారసత్వం మనది. 'మృత్యువుతోనే పాట పాడుతాం! విప్లవమా నీకు లాల్ సలాం!' అని ఆలపిస్తూ ఉద్యమించిన త్యాగపూరిత వీర వారసత్వం మనది. 'పదండిరా! పదండిరా! భూమి, భుక్తి, విముక్తి కోసం అందరమొక్కటై పోరుదాంరా' అనే పిలుపునిచ్చిన తెగువ మనది. నేడు కరోనా పేరుతో పాలకులు అనుసరిస్తున్న నేరస్థ దోపిడీ పాలనా విధానాలకు బలైపోతున్న మనమందరం ఇంకానా, ఇకపై సాగదంటూ కదులుదాం. సాహిత్య, సాంస్కృతికరంగ సైనికులమై ప్రజలకు అండదండగా నిలబడదాం. ఈ దోపిడీపూరిత పాలనావిధానాలపై మన కలాలను ఎక్కుపెడదాం! ✷

## సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవారంగంలో కృషిచేస్తూ ఇటీవల మరణించిన ఈ క్రిందివారికి జోహార్లు

**ఎస్. రమాదేవి** (07-04-2021) (దేవీ సుదర్శన్, రాజమండ్రి) : స్థానిక వారపత్రిక 'ప్రజాపత్రిక' సంపాదకురాలు. 1994లో సుదర్శన్‌తో ఆదర్శ వివాహం. మార్క్సిజాన్నీ, నాస్తికవాదాన్ని ప్రేమించి, అభిమానించి, ఆచరించినవారు. నేత్రాలను గౌతమీ నేత్రాలయానికీ, శరీరాన్ని జి.ఎస్.ఎల్. ఆసుపత్రికి ఇచ్చారు.

**ఎ.వి.రెడ్డి శాస్త్రి** (04-04-2021) : ఉత్తరాంధ్రకు చెందిన కథా రచయిత.

**బాపూజీ :** హైదరాబాదు. జనసాహితి సంస్థాపక సభ్యులు. నవోదయ సంస్థలో పనిచేశారు. 'జనవాహిని కదిలింది' నృత్య, గేయ రూపకంలో ఎం.ఎల్.ఏ. పాత్ర ధరించారు.

**అయినాల కనకరత్నాచారి** (26-04-2021) : కథారచయిత. ప్రకాశంజిల్లా జనసాహితి కార్యవర్గసభ్యుడు.

**కొక్కిలిగడ్డ శంకర్రావు** (02-05-2021) : కొత్తపాలెం (రేపల్లె తాలూకా) డా॥ మిత్రా వద్ద ఆక్యుపంక్చర్ శిక్షణ పొంది తీర ప్రాంతంలో ఆర్.ఎం.పి.గా ప్రజలకు సేవలందించారు. ప్రముఖ నాస్తిక, భౌతికవాది.

**యామిని** (02-05-2021) : ప్రముఖ కవి, జనసాహితి సంస్థాపక రాష్ట్ర కార్యవర్గసభ్యుడు నిఖిలేశ్వర్ సహచరి. కులాంతర వివాహం చేసుకున్నారు.

**పి. అనంతరావు** (29-04-2021) : కవి. అ.ర.సం. విశాఖ నాయకుడు.

**కె. విజయనరసింహారావు** (03-05-2021) : హైదరాబాదు నవోదయ సంస్థ, 'జీవనాడి' పత్రికలో పనిచేశారు. కవి, గేయ రచయిత, కరీంనగర్‌లో శారదానికేతన్ పాఠశాల స్థాపించి నడిపారు. హైదరాబాదులో అడ్వకేట్‌గా స్థిరపడ్డారు. 'విజయ్' పేరుతో గేయాలు రాశారు.

**సుమిత్రా భావే** (19-04-2021) : మరాఠీ సినిమా నిర్మాత, దర్శకురాలు. కళాత్మకమైన, అర్థవంతమైన 14 సినిమాలను సునీల్ సిక్తాంకర్‌తో కలసి నిర్మించారు. వారి 'కాసల్' చిత్రానికి 2016 జాతీయ ఉత్తమ చిత్రంగా అవార్డు అందుకొంది. భారతీయ సమాంతర సినిమారంగానికి వీరు చేసిన కృషి అపారం.

**టి. అరుణ** (30-04-2021) : ప్రజాచిత్రకారుడు టీ.వి. (తిప్పాని వెంకట్రావు) సహచరి. శ్రీకాకుళ ఉద్యమంలో పాల్గొన్నారు. ✷

కథ

# ఆంతర్యం

- బొలుసాని జయప్రభ

**"ఆనంద బాబు!** నీదేకులం అని ఎన్నిమార్లు అడిగినా ఎప్పుడూ సమాధానం చెప్పరు ఎందుకు బాబూ?" అని అడిగాడు రంగయ్య.

"చెప్పాను కదా రంగయ్యా ! నీ ప్రశ్నకు నా దగ్గర సమాధానం లేదు" సమాధానంగా ఆనంద బాబు.

"అదేం సమాధానం బాబూ? మనిషి భూమి మీద పడ్డాక ఏదో కులానికి చెందకుండా ఎలా ఉంటాడు? పోనీ పేరును బట్టి పోల్చుకుందామా అంటే అదీ వీలు కాకుండా ఉంది. రెడ్డి, చౌదరి, రాజు, మూర్తి, చారీ ఇలా పేర్లలోనే కులాన్ని చొప్పించుకుంటున్న ఈ రోజుల్లో, కుల సంఘాలు, కుల సభలు, కుల పార్టీలు లేనిదే మనిషి మనుగడ సాగని ఈ రోజుల్లో ఏ కులమని అడిగితే "నా దగ్గర సమాధానం లేదని చెప్పటమేమిటి? ఆనంద బాబూ."

"ఎంతో గొప్ప విషయాలు తెలిసిన మీరు, గొప్ప, గొప్ప పుస్తకాలు రాసిన మీరు, ఏ విషయం పైనైనా కూలంకషంగా, నిష్కర్షగా, నిజాయితీగా, అభిప్రాయం చెప్పే మీరు మీ కులం గురించి మీకు తెలియకపోవడం ఏమిటి బాబు గారు? నాకంతా అయోమయంగా ఉంది" అంటూ తల గోక్కున్నాడు.

ఆనంద బాబు రంగయ్యని చూసి చిన్నగా నవ్వాడు.

★ ★ ★ ★ ★

ఫోన్ రింగ్ అయింది. రంగయ్య ఫోన్ ఎత్తి "హలో! ఎవరండి?".

"నేను 'అమృతమయి' సెక్రటరీని మాట్లాడుతున్నానండి. ఆనందబాబు గారు వున్నారా? అని అడిగారు.

"ఒక నిముషం. వారిని పిలుస్తాను ఉండండి", అంటూ ఆనందబాబుకి ఫోన్ ఇచ్చాడు.

"హలో! మీ పుస్తకాన్ని మా సంస్థ అవార్డు కోసం ఎంపిక చేసిందండి".

"సారీ! నేను ఎవరికీ అవార్డు కోసం పంపలేదండి, మీరు పొరపాటున నాకు చేశారు, నెంబరు మళ్లీ ఒకసారి సరిచూసుకోండి" అని పెట్టేసాడు.

ఫోన్ మళ్లీ రింగ్ అయింది. ఈ సారి ఫలాన పుస్తకం, ఫలాన సంవత్సరంలో ప్రచురించబడింది, మొదలైన వివరాలు అన్నీ ఖచ్చితంగా చెప్పే పాటికి నమ్మక తప్పలేదు. "ఎవరో అభిమాని పంపించి ఉంటారండి. మమ్మల్ని మన్నించి అవార్డును స్వీకరించ వలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము".

"ఓ అలాగా! "చాలా సంతోషమండి, అవార్డు వివరాలు చెప్తారా?".

"రాష్ట్రం మొత్తం మీద మూడు వందల రచనలు వచ్చాయండి. అందులో నుండి మీ రచనను ఎంపిక చేశామండి".

అవార్డులకు దూరంగా ఉండే ఆనందబాబు తన రచనను ఒక అభిమాని అవార్డు కోసం పంపించాడంటే సంతోషం వేసింది.

అవార్డు ప్రదానోత్సవానికి రావలసిందిగా ఆహ్వానం వచ్చింది. ఫలానా తేదీ, సమయం, స్థలం అన్నీ వివరంగా మళ్లీ ఫోన్ చేసి కూడా చెప్పారు. మంచి సంస్కారం గల సంస్థ అని మనసులో అభినందించకుండా ఉండలేక పోయాడు ఆనంద బాబు.

సమావేశ మందిరానికి వెళ్ళాడు. సందడి సందడిగా ఉంది హాలంతా. ఇంతలో 'ఆనంద బాబుగారంటే మీరేనా?. అంటూ ఆనంద బాబు ప్రక్కన వచ్చి కూర్చున్నారు ఒకరు.

"అవునండీ నేనే" మీ పరిచయం? అన్నట్లు ప్రశ్నార్థకంగా చూసాడు.

"మీ అభిమాని నండి, మీ పుస్తకం అవార్డు కోసం పంపింది నేనేనండి.."

ఆనంద బాబు సంతోషంతో తబ్బిబ్బు అయ్యాడు.

"నా పుస్తకంలో మీకు నచ్చిన కవితాంశాల గురించి చెప్పండి. నా పుస్తకం ఎక్కడ చూసారు? ఎప్పుడు చూసారు?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు ఆనంద బాబు.

బ్లాంక్ ఫేస్‌తో తికమక చూపులు చూసాడు. "ఫరవాలేదు నచ్చని విషయాన్నీ కరాఖండిగా చెప్పండి. నేనేమీ అనుకోను".

"ఆ విషయాలు తరువాత చర్చిద్దాం. ముందు మీ వ్యక్తిగత వివరాలు చెప్పండి" అన్నాడు పరమ లౌక్యంగా చూస్తూ!

బ్లాంక్ ఫేస్ ఇప్పుడు ఆనందబాబుకి ట్రాన్స్ఫర్ అయింది.

"ఏ కులం, ఏ ప్రాంతం వగైరా....?"

ఇంతలో నా అభిమానిని ఎవరో పిలిచారు, అటువైపు వెళ్ళాడు.

ఆరు గంటలకు సభ మొదలవుతుందనగా అవార్డు అందుకునేవారు రావడం ప్రారంభమైంది.

కదిలే నగల అంగడి లాగా ధగ ధగా మెరిసిపోయే ఆభరణాలను ధరించి, మేకప్ ఎక్కడ చెదిరిపోతుందోనని విసనకర్రతో విసురుకుంటూ, పరివారం, మందీ మార్బలం వెంట రాగా ఒక రచయిత్రి ప్రవేశించింది.

ముక్కు మీదకు జారిన సులోచనాలతో, తెల్లని పైజామా, లాల్చీ ధరించి పది సంవత్సరాలుగా ఆ సంస్థ నుండి వరుసగా అవార్డులు అందుకుంటున్నానని చెబుతూ తన గురించి ముద్రించిన సమాచారాన్ని తెలిపే కరపత్రాలను తానే పంచుతూ కులుకుతున్నాడు Mr.కులుక్.

పట్టు చీరల రెపరెపలతో ఆ సభలకు అలవాటైన పేరంటాళ్లుగా అవార్డులు అందుకోవటానికి అతిధులు వచ్చినట్లుగా ఒక గుంపుగా ఆడవాళ్లు వచ్చారు.

రంగయ్య ఉంటే బాగుణ్ణు. రంగయ్య ప్రక్కన కూర్చుని మాట్లాడుతున్నట్టే అనిపించింది.

"ఇంతకీ విషయమేంటి రంగయ్య?"

"ఆ! మీకేదీ పట్టదు. ఎప్పుడో గానీ గది వదిలి బయటకు వెళ్ళరు, మీ పుస్తకాలే మీ ప్రపంచం. బయటి ప్రపంచం చూడండి, చిత్ర విచిత్రంగా జరుగుతున్నాయండీ సంఘటనలు.

"మొన్నటికి మొన్న ఆ కనకారావుగారి సన్మానసభలో వారిని ఆకాశానికెత్తేశారండి. పుస్తకం అద్భుతంగా రాసారని, మహా మేధావి అని ఇంకా ఆయనను మించిన కవులే లేరని, ఏవేవో అద్భుత ప్రయోగాలు చేశారని, ఒకటే పొగడ్తలు. మెడ నిండా పూలదండలు. 'ప్రపంచం కవుల' జాబితాలో చేర్చారట ఆయన్ని."

"ఆహా! సంతోషం."

"అందరూ వచ్చారండి, వీధి, వీధంతా అక్కడే ఉందండి. నేనూ వెళ్ళాను కదా! మీరూ ఆ వేదిక మీద ఉంటే బాగుణ్ణు, ఎంత శ్రమించారు. ఆ పుస్తకంలో మీరు దిద్దని పాదం లేదు కదా! ప్రతీ వరుసలో భాషా దోషాలు, పద్యాలలో ఛందస్సులో దోషాలు, పద ప్రయోగంలో లోపాలు సరిచూడమని అడిగారు కదండీ! మీరేమో ఇవే కాదు, విషయ విశ్లేషణలోనూ లోపాలున్నాయని, ఇది ఇలా ఉండకూడదు, ఇదిలా ఉండవచ్చు అని పుస్తకం అంతా తిరగ రాసినంత పనైంది రంగయ్య! అని అన్నారు."

"అలా తప్పులు సరిదిద్దిన వారిని 'పరిష్కర్త' అని అంటారు."

"మరి మీ నుండి అంత సహాయం పొందినవారు, మీ గురించి ఒక్క మంచి మాటైనా మాట్లాడలేదు.

చూడబోతే "పద్యం రాసిన వాడి కంటే, పందిర్లు వేసిన వాడికి పురస్కారాలు ఎక్కువ అని అనిపిస్తుంది" ఆ సభకు సహకారం అందించినవారిలో చీపురు పట్టి ఊడ్చిన వెంకటలక్ష్మికి కూడా పేరు పేరునా కృతజ్ఞతలు చెప్పి మెమొంటో ఇచ్చారు.

"అవునా రంగయ్యా! అయితే ఇప్పుడేంటి? కనకారావుగారు అడిగిన ప్రతీ విషయాన్ని అంత స్పష్టంగా జ్ఞాపకం చేస్తున్న రంగయ్యని చూస్తుంటే ముచ్చటేసింది".

"నువ్వు కూడా ఏమైనా రాశావా ఏంటి? దిద్ది పెట్టమంటావా ఏమిటి?" అన్నాడు నవ్వుతూ.

"ఆ కనకారావు గారు రాసిన పుస్తకం తిరిగి రాసినంత పనైంది. ఆయనకు పుస్తకం రాయగా లేనిది నీకు ఆ పని చేసిపెట్టనా ఏమిటి? నువ్వు నాకు శ్రేయోభిలాషివి, నువ్వు నా పనులు చేసినందుకు కృతజ్ఞతగా నేను నీకు కొంత సహాయమైనా చేయగలిగే అవకాశం ఇచ్చినందుకు సంతోషంగా నీ పుస్తకం ప్రచురించి ఇవ్వమన్నా ఇస్తాను" అన్నాడు ఆనంద బాబు.

"ఊరుకోండి బాబు ! ఈ మాత్రం అర్థం చేసుకోగలుగుతున్నానంటే అది మీ చలవే కదా! మీ సహచర్యంలో ఉండబట్టే కదా నా భాషా మారిపోయింది, జీవిత తత్త్వం బోధ పడింది. నన్ను ఒక మనిషిగా తీర్చిదిద్దారు. పుస్తకం రాయాలంటే మీ అంత తెలివి తేటలు లేవు కానిండీ "నరకాసురవధ" గురించి పుస్తకం రాసిన ఆ కనకారావుగారి కంటే నాకు కొంచెం ఎక్కువే తెలుసనుకుంటాను మీ దయ వల్ల."

"ఇంతకీ విషయమేంటి రంగయా!?"

"ఆఖరికి మన వీధి చివరన ఉన్న గుడి పూజారి గారిని కూడా సన్మానించారండి.. కనకారావు గారు రాసిన 'నరకాసుర వధ' పద్య కావ్యాన్ని నాటకంగా మలుచుకుని ప్రదర్శించిన శర్మ గారిని, యూనిట్ అందరినీ కూడా సన్మానిస్తూ చివరాఖరున గుడి దగ్గర కొబ్బరికాయల కొట్టు 'శాస్త్రి' గారిని "సూపర్ డైరెక్టర్"గా పరిచయం చేసి (దర్శక పర్యవేక్షణ చేసేవాడు) దర్శకుడికి పెద్ద మెమొంటో, పర్యవేక్షణ చేసినవారికి చిన్న సైజు మెమొంటోనూ.

"నాకు తెలియక అడుగుతున్నాను 'ఆనంద బాబు! 'పర్యవేక్షకుడు' గొప్పా? 'పర్యవేక్షణ చేయబడ్డవాడు 'గొప్పా? ఈ రెండింటి మధ్య తేడా ఏంటి? నాకు అర్థం కాలేదు మరి. వారికెందుకు పెద్ద ముక్కో, వీరికెందుకు చిన్న ముక్కో? అన్నింటి కంటే అర్థంకాని విషయం 'కనకారావు'గారిని ప్రపంచ కవుల జాబితాలో చేర్చారు. ఎందుకని?"

ఇంతలో ఇందాకటి అభిమాని మళ్ళీ వచ్చాడు. ఉలిక్కిపడిన ఆనందబాబు ఈ లోకంలోకి వచ్చి చిన్నగా నవ్వుకున్నాడు.

"మీ వివరాలు చెప్పండి, రాసుకుంటాను." అని పెన్ను పేపర్ రెడీగా పట్టుకున్నాడు.

"అవన్నీ అవసరం లేదండి, పుస్తకం పేరు, మీరు ఎందుకు అవార్డుకు ఎంపిక చేసారో ఆ విశేషాలు చెప్పండి చాలు. ఆఖరున రచయిత పేరు చెప్పండి."

దిక్కులు చూస్తూ, బిక్క మొహం వేసాడు. "పోనీ ఏ సామాజిక వర్గానికి చెందినవారో అదైనా చెప్పండి. ఎక్కడినుండి వచ్చారో అందరికి తెలియాలి కదా!"

ప్రక్కన ఎవరో కూర్చున్నట్లుగా అనిపించి ప్రక్కకు తిరిగి చూస్తే రంగయ్య.

రంగయ్యని మధ్యవర్తిగా చేసుకుని, పక్కకు పిలిచి "ఈ సంస్థకు ఏమైనా సహాయం చేస్తాడేమో అడుగు మీ అయ్యగారిని"

"నా నుండి సహాయం ఆశించడం ఏమిటి?

"చిత్ర విచిత్రంగా ఉన్నాయండి ఈ ప్రపంచపు పోకడలు" అని అన్న రంగయ్య మాటలకు అర్థం ఇప్పుడు తెలుస్తోంది.

ఇలాంటి సంస్థలకు "కవి వాక్కుల కంటే వారిచ్చే చెక్కులే ప్రధానమనుకుంటా!"

ఏమి జరుగుతుందో చూద్దామని వారడిగిన ఎమౌంట్‌కి చెక్ రాసి పంపించాడు రంగయ్య ద్వారా. చెక్ అందిన వెంటనే తన పేరు వినిపించింది స్టేజి మీద నుండి.

ఇంతలో సభ మొదలైంది. అందరికి అవార్డు ప్రధానం చేస్తూ వారి రచనలలోని గొప్పతనం గురించి రెండు వాక్యాలు చెపుతూ అవార్డు ఇస్తున్నారు.

కామన్ ఫాక్టర్‌గా "ఉన్నత కులానికి చెందినప్పటికీ ఎంతో విశాల హృదయం కనపరిచారని, సమసమాజ స్థాపన కోసం పాటు పడటమే తమ లక్ష్యంగా కవిత్వం రచించారని అందుకే అవార్డు కోసం ఎంపిక చేశామని చెప్పారు.

తన పేరు ప్రకటించగానే స్టేజి పైకి వెళ్లి చిరునవ్వుతో అందరి వైపు చూసాడు.

"అధ్యక్షుల వారికి, ముఖ్య అతిధులకు నా నమస్కారాలు! అతిధుల వైపు చూస్తూ ఒక ఆంగ్ల రచయిత అన్నాడు "what does it matter where a man is from? Is it fair to judge a man by his post - office

address? Let a man be a man and don't handicap him with the lable of any section”.

“కులం గడప దాటకుండా సమసమాజ స్థాపన సాధ్యమా?” కవి పరిచయం ఆయన రాసిన కవిత్వంతో జరగాలి, కవి వ్యక్తిగత సమాచారంతో కాదు.

“ఇందాక ఒక కవి సమసమాజ నిర్మాణంలో భాగంగా “వర్షం చినుకుని సమాజ పరం చేస్తానన్నాడు”. ప్రాకృతికాంశాలు సహజంగానే అందరివీ. వాటిని ప్రత్యేకంగా ఎవరూ సమాజ పరం చేయనవసరం లేదు. ‘సూడో వాల్యూస్’ ప్రచారం చేయకండి భావితరాలకు. ఈనాటి యువత ఆశావాదంతో ముందుకు వెళుతున్నారు.

“ప్రపంచంలో ఎక్కడా మనిషి అస్తిత్వాన్ని గుర్తించడంలో, ప్రతిభని గుర్తించడంలో కులం, ప్రాంతం, ప్రమేయం ఉండటం లేదు. “విశ్వ మానవునిగా ఎదగాలని” అంటాను నేను.

“గుణం లేనివాడు కులం గొడుగు పట్టుకుంటాడు, మానవత్వం లేనివాడు మతం ముసుగులోకి చేరతాడు, పస లేనివాడు ప్రాంతం ఊసెత్తుతాడు, జనులంతా ఒక కుటుంబం, జగమంతా ఒక నిలయం” అన్నాడు ఓ మహానుభావుడు.

“నేను ఈ పురస్కారాన్ని తిరస్కరిస్తున్నాను.

“అందరు చైతన్యవంతులు కావాలి.

“సాహిత్యానికి సామాజిక చైతన్య రూపం కావాలి.” ✸

# యలమంచిలి వెంకటప్పయ్య సంస్మరణ వేదిక ‘ప్రజాసాహితి’ శాశ్వతనిధికి విరాళం

**స్వాతంత్ర్య** సమరయోధులు, ప్రముఖ గాంధేయ హేతువాది, యలమంచిలి వెంకటప్పయ్య కృష్ణాజిల్లా కనుమూరులో జన్మించారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని రాజమండ్రి జైలులో (1920) బాబా పృథ్వీసింగ్ వద్ద హిందీ నేర్చుకున్నారు. ఆ తర్వాత నెల్లూరు, కాశీ, అలహాబాద్, బీహార్‌లో జాతీయోద్యమంలో భాగంగా హిందీ అధ్యయనం చేశారు. 1920, 1930, 1932, 1942లలో జైలు శిక్షలనుభవించారు. హిందీ బోధన ఒక కార్యక్రమంగా తీసుకొని కృష్ణాజిల్లా పెనుమచ్చ, చినకళ్ళేపల్లి, గుంటూరుజిల్లా మైనేనివారిపాలెం, తూర్పుపాలెం, బెల్లంవారి పాలెం మొదలగు గ్రామాలలో హిందీ నేర్పారు. 1947 నుండి 1967 వరకు తెనాలిలోని ఐతానగరంలో ఆదర్శ బాలికాపాఠశాల (హాస్టల్‌తో) నడిపి ఎందరో మహిళలతో హిందీ, బెనారస్ మెట్రిక్ చదివించారు. 1968 నుండి 1997 వరకు విజయవాడలో కూతురు వద్ద వుండి, 53 హేతువాద గ్రంథాలు, హిందీ వ్యాకరణ గ్రంథాలు వ్రాసి ప్రచురించారు. తన 99 ఏళ్ళ జీవితంలో 86 ఏళ్ళపాటు క్రియాశీలంగా జీవించిన వీరి కోరిక ప్రకారం, మరణించిన తర్వాత వీరి కన్నులను, శరీరాన్ని వైద్య కళాశాలలకు అప్పగించారు.



వెంకటప్పయ్యగారి రెండవ వర్ధంతి 1-3-1999నాడు తెనాలిలో వారి పేరిట సంస్మరణ వేదిక ఏర్పడింది. ఆయన శిష్యులూ, మిత్రులూ, అభిమానులూ, బంధువులు, హేతువాదులు కలిసి 30 వేల రూపాయల ధర్మనిధిని ఈ వేదిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత సంవత్సరాలలో మరో 40 వేల రూపాయలు ఈ ధర్మనిధికి జమ అయ్యాయి. ప్రతి ఏడాదీ జరిపే కార్యక్రమాలకు ఈ మూలనిధి నుండి వచ్చే వడ్డీని వేదిక ఖర్చు పెట్టింది.

గత నాలుగు సంవత్సరాలుగా, వేదిక కార్యక్రమాల నిర్వహణ సాధ్యం కాకపోవడంతో, హేతువాదులు వారి పుస్తకాలు కావాలని కోరడంతో, వారు రాసిన ముఖ్యమైన 11 పుస్తకాలను డిజిటల్ రూపంలోకి వేదిక నిర్వాహకులు మార్చారు. వీటిని kinige.com అనే webలో ఉచితంగా ఇచ్చే పుస్తకాల జాబితాల్లో వుంచారు. yalamanchili venkatappiah books అనే పేరుతో అంతర్జాలంలో వీటిని తెరచి, కావలసినవారు ప్రింటు తీసుకోవచ్చు. ఆ పుస్తకాల వివరాలు : 1. కులమేది? 2. వేదాలంటే ఇవేనా? 3. బీద బ్రతుకు (స్వీయ చరిత్ర) 4. దేవుళ్ళు ఎవరికొరకు? 5. మతాలు ఎవరికొరకు? 6. పుష్కరాలు ఎవరికోసం? 7. వేమన ఏమన్నాడు? 8. తులసీ రామాయణం అంటే ఇదేనా? 9. ప్రపంచం పుట్టు పూర్వోత్తరాలు 10. వైదిక ఆర్యుల ప్రాచీన సంస్కృతి 11. యలమంచిలి వెంకటప్పయ్య సాహిత్య పరిచయం.

ఈ ఏడాది వేదిక నిర్వహణాబాధ్యులు సమావేశమై వేదిక పేరుతో బ్యాంకులో వున్న మూలనిధి 60,000 (అరవై వేల రూపాయలు)లను జనసాహితి గత 45 సంవత్సరాలుగా నడుపుతున్న సాహిత్య, సాంస్కృతికోద్యమ మాసపత్రిక ‘ప్రజాసాహితి’ మూలనిధికి విరాళంగా ఇచ్చి వేదికను రద్దుచేయాలని తీర్మానించారు. ఆ డబ్బును ‘ప్రజాసాహితి’కి అందచేశారు.

1999 నుండి వేదికలో సభ్యులుగా చేరి, వేదిక కార్యక్రమాలకు తమ అండదండలందించినవారికీ, ప్రత్యేకంగా వెంకటప్పయ్యగారి కుమారుడు ప్రస్తుతం వేదిక కన్వీనర్ మురళీధర్ గారికి ‘ప్రజాసాహితి’ కృతజ్ఞతలను తెలియచేస్తోంది. ✸

# కా॥ మధు రాసిన "ప్రజాసాహితీ, సాంస్కృతికోద్యమం - కమ్యూనిస్టులు" డాక్యుమెంట్ ముగింపు భాగం



**వ్యక్తిగత** ఆస్తులు పుట్టిన కాలం నుండీ ఈనాటివరకు మానవులు నడిచివచ్చిన కాలాన్ని వర్గపోరాటాల చరిత్రగా కమ్యూనిస్టు ప్రణాళికలో మార్క్స్ – ఏంగెల్స్ పేర్కొన్నందువల్ల సమాజంలో వర్గ సంఘర్షణ జరగటంలేదు. వర్గపోరాటం వ్యక్తుల యిష్టాయిష్టాలతో నిమిత్తం లేని వర్గ సమాజపు సత్యం. అది సామాజిక చలనానికి చోదకశక్తి.

సమాజాన్ని వాస్తవికంగా శాస్త్రీయంగా అర్థం చేసుకున్నందువల్ల వర్గసంఘర్షణ – సామాజిక పరిణామాలు – విప్లవాలు – మానవ చైతన్య రూపాలయిన సాహిత్యం – కళలు సామాజిక విప్లవంలో అవి నిర్వహించగలిగిన విశిష్ట పాత్ర మనకు స్పష్టంగా అర్థమవుతున్నాయి. ఈ జీవన చలన రహస్యాలను ఆకళింపు చేసుకోగలిగిన సామాజిక శాస్త్రమే మార్క్సిజం. దీని ప్రకారం మానవ సమాజ పరిణామం ఆదిమ కమ్యూనిజం – బానిస సమాజం – భూస్వామ్య సమాజం – పెట్టుబడిదారీ సమాజం – సోషలిస్టు సమాజం – తదనంతరం వర్గరహితమైన కమ్యూనిస్టు సమాజంగా సాగింది, సాగుతూంది. ప్రపంచమంతా వివిధ దేశాలుగా విభజింపబడి తమవైన ప్రత్యేకతలతో, విశిష్టతలతో కూడి వున్నాయి. వైవిధ్యపూరితమైన సాంస్కృతిక వారసత్వాలను కలిగి వున్నాయి. భారతీయ భూస్వామ్య వ్యవస్థను తన సహజ పరిణామ క్రమంలో పెట్టుబడిదారీ విధానంలోకి విప్లవాత్మక పరిణామం చెందనీయకుండా బ్రిటీషు సామ్రాజ్యవాదం, తదనంతర సామ్రాజ్యవాద శక్తులు ఆటంకంగా అడ్డుగా నిలిచాయి. తమకు దళారీలైన భారత బడాబూర్జువావర్గాన్ని సృష్టించి పెంపొందించాయి, సామ్రాజ్యవాద దురాక్రమణకు గురైన చాలా వెనుకబడిన దేశాలలో వలెనే మనది అర్ధవలస – అర్ధఫ్యూడల్ వ్యవస్థ రూపాన్ని సంతరించుకుంది. కాలం చెల్లిన ఫ్యూడల్ విలువలతో క్షీణ సామ్రాజ్యవాద సంస్కృతి జతకూడినందువల్ల, ప్రజాస్వామిక చిహ్నంగా చెప్పుకునే పార్లమెంటరీ వ్యవస్థలతో సహా సమస్త రంగాలలో వెలువడే భయంకర కాలుష్యాన్నే, మనం ఈనాడు అనుభవిస్తున్నాము. మన సామాజిక వ్యవస్థకున్న అర్ధవలస – అర్ధఫ్యూడల్ లక్షణాలు, ప్రత్యేకతల వల్లే పూర్తి బూర్జువా విప్లవమూ, పూర్తి సోషలిస్టు విప్లవమూ కాని నూతన ప్రజాస్వామిక విప్లవ దశలో మనం వున్నాం. అంటే కార్మికవర్గ నాయకత్వాన కార్మిక – కర్షక ఐక్యత పునాదిగా, దున్నేవానికే భూమి నినాదంతో సాగే వ్యవసాయక విప్లవం యిరుసుగా, ప్రజావిప్లవ పంథా మార్గాన ఇది సాగుతుంది. ఈ దశలో సామ్రాజ్యవాదులూ వారి దళారీలైన బడా బూర్జువావర్గమూ భూస్వామ్య వర్గమూ విప్లవానికి శత్రువర్గాలుగా, ఆధిపత్యం నుండి నెట్టివేయవలసిన వర్గాలుగా వుంటాయి. కార్మిక వర్గమూ, రైతాంగమేకాక పెటీబూర్జువా – జాతీయ బూర్జువావర్గాలు కూడా విప్లవానికి అనుకూలంగానూ, విప్లవాత్మక పాత్ర నిర్వహించే స్వభావంతోనూ వుంటాయి. సామ్రాజ్యవాద యుగపు ఈనాటి నూతన ప్రజాస్వామిక విప్లవ దశలో మనదేశపు వర్గ సంఘర్షణల నిలబడే విరుద్ధ పక్షాలు యివీ.

**ప్రజాపక్షం :** కార్మికులు, రైతాంగం, పెటీబూర్జువా, జాతీయ బూర్జువా వర్గాలు.

**శత్రుపక్షం :** సామ్రాజ్యవాదులు – దళారీ బడా బూర్జువా వర్గమూ – భూస్వామ్యవర్గం.

ఈ వ్యవస్థ యొక్క ఉపరితలాంశాలయిన రాజ్యమూ, మతమూ, విద్య – వ్యవస్థను కాపాడే భౌతిక, సాంస్కృతిక సాధనాలు.

పితృస్వామ్యమూ, కులవ్యవస్థా, మతతత్త్వం – ఇవన్నీ అర్ధవలస అర్ధఫ్యూడల్ వ్యవస్థ యొక్క దేశీయ సాంఘిక, రాజకీయ రూపాలు. ఇవి కూడా దోపిడీ వ్యవస్థను కాపాడే సాధనాలే. వ్యవస్థను కాపాడటంలో సంస్కృతి యొక్క పాత్ర, అందులో సాహిత్యం – కళలకున్న శక్తీ మనకు తెలిసిందే. సామాజిక విప్లవంలో సాహిత్యమూ కళలూ తమవైన విశిష్టతలతో ప్రముఖ పాత్ర నిర్వహించగలుగుతాయి. జీవితాన్ని అతి సన్నిహితంగా, నిశితంగా, వాస్తవికతాదృక్పథంతో పరిశీలించి గ్రహించే ప్రయత్నంలోనే అత్యంత విశిష్ట విలువలున్న సాహితీ సృజన జరుగుతుంది. ప్రజాసంస్కృతి కోసం నిలబడాలంటే ప్రజల జీవితాన్నీ, పోరాటాన్నీ ఆకళింపు చేసుకోవాలి. ప్రజల నుండి ప్రజలకు అన్న సూత్రాన్ని పాటించాలి. ప్రజలు భౌతిక వస్తు సంపదలకే కాదు, భాషా – సాహిత్యం – కళ సంస్కృతులకు కూడా సృష్టికర్తలే. ప్రజాజీవితపు గని నుండి స్వీకరించిన ముడిసరుకును, వాటి స్వభావానికనుగుణమైన రూపాలుగా మలిచి తిరిగి ప్రజలకు అందించటం ప్రజారచయితల కళాకారుల కర్తవ్యం. అలా కాకుండా ముడిసరుకుని తమ వ్యక్తిగత కీర్తి ప్రతిష్టలకో, వ్యాపారానికో వినియోగించుకోవటం, అంతేకాక తామే ఆ సంపదల సృష్టికర్తలమని అహంభావించటం ప్రజాదృక్పథం కాదు.

ప్రజాఉద్యమ వాస్తవికతకు అవసరాలకు అనుగుణంగా ప్రజల జీవన సమరంలో ప్రజల పక్షాన నిలబడే రచయితలూ, కళాకారులూ సంఘటితపడి నిర్మాణాత్మకంగా ప్రజాఉద్యమపు ఆటుపోట్లను

తట్టుకుంటూ కృషి సాగించటం, నిబద్ధ రచయితలుగా రూపొందటం ఒక నిరంతరాయ ప్రక్రియ. ఈ ప్రక్రియలో రాటుదేలటానికి సంసిద్ధులు కావటం ప్రజాసాంస్కృతికోద్యమానికి చైతన్యవంతంగా, చిత్తశుద్ధితో అంకితం కావటం రచయితల సామాజిక బాధ్యత.

సాహిత్య – కళారంగాలలో మార్క్సిస్టులు రూపాన్ని పట్టించుకోరనే విమర్శ వొకటుంది. ఇది అబద్ధం. ఎందుకంటే రూపంలేని వస్తువే లేదు కనుక. వస్తు సారానికి, రూపానికి విడదీయలేని గతితార్కిక సంబంధం వుంది. ఈ విషయంలో జీవితానుభవం చాలా సూటిగా నిరాడంబరంగా వుంటుంది. నకిలీ బంగారానికీ అసలు బంగారానికీ, నకిలీ విత్తనాలకు అసలు విత్తనాలకూ రూపం ఒకటిగానే వుంటుంది. కానీ సారంలోనే తేడా అంతా. ఈ సారమే ప్రాథమికమైనది. ప్రజలకు కావలసినదీ.

సారానికి వన్నె తెచ్చేదీ, సారం యొక్క శక్తిని అర్థవంతంగా ప్రదర్శించేదీ, వ్యక్తీకరించేదే రూపం. అంటే సారం మౌలికమైనది. రూపం దానికి సహకరించేదీనన్నమాట.

సాహిత్య – కళారంగాలలో జీవిత సారానికి తగిన రూపాన్ని ఎంచుకోవటం, రూప వైవిధ్యాల బహుముఖ ప్రక్రియలలో నైపుణ్యాలను అభివృద్ధి పరుచుకోవటం రచయితల, కళాకారుల ముఖ్య విధి. ఒక శిల్పాన్ని చెక్కటానికి ఎంత ఏకాగ్రత, శిక్షణ, నైపుణ్యం, అంకితభావం కావాలో అవన్నీ ప్రజాకళాకారులకు అవసరమే. అయితే "కన్ను పోయేంత కాటుక పెట్టుకోకూడదన్నదే" జీవితానుభవం నేర్పేది. అంటే సారాన్ని రూపం మింగెయ్యటమో, బలహీనపరచటమో, నిర్లక్ష్యపరచటమో చేయకూడదన్నమాట.

తన కుండలకు అవసరమైన మంచి మట్టిని తెచ్చుకున్న తర్వాత ఆ మట్టిని కుండగా రూపొందించటమే కుమ్మరికి ప్రధానమవుతుంది. అదేవిధంగా వస్తువుని నిర్ధారించుకున్న తర్వాత కళాకారుడికి రూపం ప్రధానమవుతుంది.

కళానైపుణ్యాలను మెరుగు పరచుకోవటానికి, వస్తురూప సమన్వయం సాధించటానికి అంతర్జాతీయ – జాతీయ కళావేత్తల సిద్ధాంత – ఆచరణల అనుభవాల నుండి ఇంకా ఎంతో నేర్చుకోవాల్సి వుంది.

సాహిత్య – కళావిమర్శనాపద్ధతులను ఇంకా ఎంతో మెరుగు పరచుకోవాల్సి వుంది. సాహిత్య – సామాజిక జీవన ప్రతిఫలనాల విశ్లేషణ, ప్రజాజీవితానుభవాల నుండీ, ఉద్యమ అవసరాలూ, చారిత్రక పరిమితుల నుండీ, బాహ్యావాస్తవికత నుండీ సాగాలి తప్ప విమర్శకుల స్వీయ రాగ, ద్వేషాలూ, భావోద్వేగాలూ, అంతిమ తీర్పులు ప్రదర్శితం కాకూడదు. సమాజాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోవటానికీ, రచయితా – పాఠకుడూ తమ అవగాహనాస్థాయిని పెంచుకోవటానికీ, కళాత్మక విలువల మెలకువలు గ్రహించటానికీ విమర్శ తోడ్పడాలి.

ఉచ్చారణాయాసలూ, మాండలిక పదాలూ, అభివ్యక్తి రీతులలో వైవిధ్యం భాషాసంపదలే కాని హెచ్చుతగ్గుల అహంభావానికీ, ఆత్మన్యూనతను కలిగించటానికీ వినియోగించటం ప్రజాస్వామిక దృక్పథం కాదు. ఇంకా తెలుగువారు ఒక జాతిగా అభివృద్ధి చెందే క్రమంలోనే వున్నారు. తెలుగుజాతి భాష సర్వతోముఖాభివృద్ధికి, ప్రాంతీయ అసమానతలు తొలగటానికి నేటి అర్థవలస – అర్థఫ్యూడల్ వ్యవస్థా దాని రాజకీయ, సంస్కృతులే ప్రధానమైన అడ్డంకిగా వున్నాయి.

సాహిత్య కళారంగాలతోపాటు వివిధరంగాల సామాజిక శాస్త్రాల పరిశోధనలూ, సైద్ధాంతిక కృషి యొక్క తాత్త్వికసారమంతా మానవీయ చైతన్యాన్ని మరొక అడుగు ముందుకు వేయించేవే. వీటిని ప్రజాసాహితీ సాంస్కృతికోద్యమకారులు పుణికి పుచ్చుకోవాలి.

సంస్కృతీ నిర్మాణానికి శ్రమజీవులు – శాస్త్రవేత్తలూ – కళాకారులు మూలస్తంభాలని గోర్కీ చెప్పాడు. ప్రకృతితో సంఘర్షణ ద్వారానే మానవ సమాజం ఆహార వస్తూత్పత్తులను సృష్టించుకుంది. సామాజిక సంఘర్షణ – వర్గపోరాటం ద్వారానే ప్రజల విప్లవాత్మక పోరాటాల ద్వారానే సమాజ ప్రగతినీ, నూతన సంస్కృతులనూ మానవులు సాధించారు, నిర్మించుకున్నారు. మేధో శ్రమజీవులైన రచయితలు కూడా కళాకారులే. తమ తమ నైపుణ్యాలతో సామాజిక సంఘర్షణలో చైతన్యవంతంగా, క్రియాశీలంగా, నిబద్ధతతో ప్రజాసాంస్కృతికోద్యమ నిర్మాణానికి సంఘటితంగా పూనుకోవాలనీ, పాల్గొనాలనీ, సహకరించాలనీ కమ్యూనిస్టులు వారి నుండి ఆశిస్తున్నారు.

ప్రజాస్వామిక యుగచైతన్యమంటే నిరంతరాయంగా, విస్తృతంగా పీడితప్రజలను వర్గపోరాటంలో పాల్గొనేట్టు చేయటం. అంతేగాని వారి తోక పట్టుకుపోవటం కాదు. అలాగే నేలవిడిచి సాము చేయటమూ కాదు.

ప్రజాసాహిత్యం, ప్రజాకళలు, ప్రజాసంస్కృతి వర్థిల్లాలి.
భూస్వామ్య సామ్రాజ్యవాద సంస్కృతులు నశించాలి.
శ్రమజీవుల, పీడిత ప్రజల ఐక్యత వర్థిల్లాలి.
నూతన ప్రజాస్వామిక విప్లవం వర్థిల్లాలి. ✸

## కన్నడ సాహిత్యాన్ని తెలుగువారికి అందించిన శాఖమూరు రాంగోపాల్ మరణం

**2010** నుంచీ కన్నడ సాహిత్యాన్ని, తెలుగువారికి పరిచయం చేసిన శాఖమూరు రాంగోపాల్ తెనాలిలో 26-02-2021న తన 68వ యేట మరణించారు. ఆయన 10-08-1953న జన్మించారు.

తెనాలి సమీపాన గల బుర్రిపాలెంకు చెందిన రాంగోపాల్ తల్లిదండ్రులు కమల, అంజయ్య కర్నాటకకు వలసపోయి అక్కడ వ్యవసాయదారులుగా స్థిరపడ్డారు. అక్కడే పుట్టి పెరిగిన రాంగోపాల్ తన ఉద్యోగ విరమణ తర్వాత ప్రసిద్ధ కన్నడ రచయితల నవలలు, కథలు తెలుగులోకి శరపరంపరగా అనువదించి వాటిని తానే ప్రచురించారు.

వారు అనువదించి ప్రచురించిన 14 పుస్తకాలలో 1. వాల్మీకి, 2. కృష్ణారెడ్డిగారి ఏనుగు, 3. శ్రేష్ఠ కన్నడ కథలు, 4. కువెంపు, 5. నా డిసౌజాగారి కథలు, 6. ప్రొఫెసర్ కర్నాలో ముఖ్యమైనవి.

ఈ అనువాదాల వల్ల తెలుగువారు పొరుగు రాష్ట్రంలోని సాహిత్యం అర్థం చేసుకోవడానికి అవకాశం లభిస్తోంది.

రాంగోపాల్ మరణానికి 'ప్రజాసాహితి' సంతాపం ప్రకటిస్తోంది. వారి కుటుంబ సభ్యుల దుఃఖంలో పాలు పంచుకుంటోంది. ✸


పుస్తక సమీక్ష

# ఒక పాత్రపై ముప్పై పాత్రల జీవనగానాల కచేరీ ఈ 'మనోధర్మపరాగం'

## దీనికి మొదటి నుంచీ చివరివరకూ శ్రుతి పలికే తంబురా రచయిత నరేంద్ర

– డా॥ చంద్రారెడ్డి

**"నా** జీవితంలో ఒక తీరని కోరికో లేక ఒక లోటో వున్నంత వరకూ నేను జీవించి ఉండటానికి ఒక కారణమంటూ ఉంటుంది. ఏ కోరికా లేక పూర్తిగా సంతృప్తి చెందటమంటె అది మరణంతో సమానం" అంటాడు బెర్నార్డ్ షా. జీవితంలో అతిప్రధానమైనది జీవితమే. అదే సరిపోతుందా అంటే సరిపోదంటుంది చిత్తూరు కుముదవల్లి నాగలక్ష్మి. ఆమెకు కావాల్సింది తను కోరుకున్న, తనుకావాలనుకున్న జీవితం. సంగీతంలేని జీవితం ఆమెకు జీవితమేకాదు. విశ్వనాథన్‌తో పెళ్ళి తరువాత తననితాను బ్రాహ్మణీకరించుకోవడం దానికోసం. కొన్నింటిని త్యాగం చేయడం, కొన్నింటితో రాజీ పడడం, తల్లిద్వారా సంక్రమించిన దేవదాసీ ముద్రను చెరిపివేసుకోవడం, అదీ ఆమె ఎంచుకున్న మార్గం. కానీ సమాజం వెలుగునుగాక ఆ వెనుకనున్న చీకటిని వేలెత్తి చూపుతుంది. నాగలక్ష్మి పూర్తిగా వెలుగులోకి రావడానికి దశాబ్దాల కాలం పడుతుంది. అయితేనేం మనోధర్మ సంగీతాన్ని సాధిస్తుంది. ఈ సాధనతో ముడిపడిన ఆ నాటి చారిత్రక, సామాజిక, రాజకీయ, సినీరంగాలకూ, వాటిలోని ప్రధాన వ్యక్తులకూ, మార్పులకూ, చేర్పులకూ తన కాల్పనికతను జోడించి సజీవంగా ఆవిష్కరించాడు ఈ నవలా రచయిత. ఇది ఒక యుగాన్నే తవ్వి తీయడం లాంటిది. మనిషి సాధారణంగా సాఫల్యాలను పట్టించుకుని వైఫల్యాలను వదిలేస్తాడు. పల్లకీని పట్టించుకున్నంతగా దాన్ని మోసే బోయీలనూ, తాజ్‌మహల్‌ను పట్టించుకున్నంతగా దానికి రాళ్ళెత్తిన కూలీలనూ పట్టించుకోడు. కానీ ఈ నవలలో సామాజికంగా అణగారిన ఆర్తులకు గొంతునిస్తాడు రచయిత.




'చిత్తూరు స్కంద కుముదవల్లి నుండి నాగలక్ష్మీ నటరాజన్ వరకూ' కథను వంద సంవత్సరాలకి పైగా నడిపే ముప్పై పాత్రలు ఈ నవలలో ఉన్నాయి. ఇది చరిత్రలో విస్మరించబడిన దేవదాసీ వ్యవస్థ అనే ఒక సామాజిక చీకటి కోణాన్ని సజీవంగా మనముందుంచడానికి వాళ్ళదైన కాలంలోకి, వాళ్ళదైన సమాజంలోకి మనల్ని తీసుకెళతాయి. ఇవి వాళ్ళ మాండలీకంలో వాళ్ళ నేపథ్యంలో వాళ్ళ భాషలోనే మాట్లాడతాయి. గమనించాల్సిందేమిటంటే, ఈ పాత్రలన్నీ స్త్రీలవే. పజ్జెనిమదిమంది దేవదాసీలు, పదకొండుమంది బ్రాహ్మణ స్త్రీలు, ఒక శూద్ర మహిళ. పైగా వీళ్ళలో అసలు కథానాయకి చిత్తూరు కుముదవల్లి నాగలక్ష్మి లేదు. కానీ వీరందరి జీవనయానాలతోపాటు, వారి కేంద్ర బిందువుగా నాగలక్ష్మి మాత్రమే ఉంటుంది. వీరు నదీపాయలైతే, వీరందరినీ అనుసంధానం చేస్తూ ప్రధానపాయగా ఉంటుంది. వీరందరూ చెప్పినదానితోనే నాగలక్ష్మి తత్త్వాన్నీ, మనస్తత్త్వాన్నీ, ప్రాధాన్యతల్నీ, అనుభవాల్నీ, వ్యక్తిత్వాన్నీ పాఠకుడు తెలుసుకుంటాడు.

ఈ అందరి కలయిక కారణంగానే చరిత్ర, కల్పన ఒకతాటిపైకి వచ్చి 'మనోధర్మ పరాగాన్ని' ఒక భిన్నమైన కాల్పనిక చారిత్రక నవలగా చేస్తాయి. ఇన్ని పాత్రలు తమతమ దృక్కోణాల నుంచీ ప్రధానపాత్రను చూచి మాట్లాడినపుడు, ఆ పాత్రనూ, ఆ నాటి పరిస్థితులనూ మరింత సమగ్రంగా అర్థం చేసుకోవడానికి పాఠకుడికి వీలవుతుంది. ముప్పైసార్లూ కథకుడి జోక్యంతోనే ఈ ముప్పై పాత్రలు రంగంమీదికి వస్తాయి. ఈ ప్రయోగం నూతనమైనదే అయినా కథాగమనంలో ఎక్కడా తొట్రుపాటు గానీ, పాత్రల జోడింపులో అపక్రమము గానీ కనిపించదు.

'మనోధర్మ పరాగం' పాఠకుణ్ణి గబగబా ముందుకు వెళ్ళనివ్వదు, ఒక్కోసారి ఒక పాత్ర గతం గురించో, మనోగతం గురించో, ఒక పాత్ర ద్వారా మరొక పాత్రను తెలుసుకోవడానికో, ఒక సంఘటనను సరిగా అర్థంచేసుకోవడానికో పాఠకుణ్ణి జుట్టు పట్టుకుని వెనక్కి లాక్కొస్తుంది. నవలలో ముడిబడిన ఆధ్యాత్మిక, తాత్త్విక, సాంఘిక విషయాల గురించిన తర్కం, జీవిత సమస్యలపై చేసిన నిర్వచనాలు నవల గాఢతను పెంచాయి. ఇవి కాలానికీ – స్థలానికీ అతీతమైనవి.

"సమాజాల మధ్య ఉన్న ద్వేషాలకీ, వ్యక్తులు ప్రేమించలేకపోవడానికీ ఏదో సంబంధం ఉండి ఉండాలని నా నమ్మకమని" బుచ్చిబాబు అంటాడు. దీన్నే అంబత్తూరు వైరముక్తాంబ ఆర్ముగాంబ ద్వారా "విద్యావతి నాలా

దేవదాసీ కాదు గదా! అందువల్ల ఆమెకు ప్రేమించడానికి కావాల్సిన ప్రాథమిక అర్హత ఉందని మీరూ ఒప్పుకుంటారు. ఎందుకంటే బానిసల వర్గంలో నుంచీ వచ్చిన వాళ్ళకు ప్రేమించడం తెలిసే అవకాశం లేదు" అని రచయిత చెప్పిస్తాడు. పేరుకు పోషకుడే అయిన సోమశేఖర అయ్యంగార్ మీద తనకున్నది ప్రేమ అని కూడా తెలియని మరకతాంబ అమాయకత్వం కదిలించి పారేస్తుంది. ఆయన తన కుటుంబసమస్యల కారణంగా ఆమెకు దూరమైతే, ఆ దిగులుతో చిక్కి శల్యమై ఆమె మరణిస్తుంది. వివాహం కోసం నాగలక్ష్మి భర్తను అంగీకరిస్తుంది. నాగలక్ష్మి కోసం విశ్వనాథన్ వివాహాన్ని అంగీకరిస్తాడు. ఇలా పెళ్ళి విషయములో ఎవరి ఆశలు – ఆశయాలు వాళ్ళకున్నా, పెళ్ళి తరువాత వాళ్ళిద్దరూ ఒకరికొకరు కట్టుబడే ఉంటారు. మణివణ్ణన్ అభిరామ సుందరి ద్వారా కంచి పరమాచార్య ఒక పాదాన్ని కులం బురదలోనే ఉంచుకున్నాడని తెలిసినప్పుడు ఆలోచనాపరులు విస్మయులవుతారు. "అత్తను మొదటిసారి తీసుకెళ్ళినప్పుడు పరమాచార్య ఆవిడ బ్రాహ్మణ స్త్రీ కాదని దూరం నుంచే పంపేశారట." అంటుందావిడ.

ప్రవాహ దిశలో ఈదుకుపోవడం సులభమే కానీ ఆ ప్రవాహానికి ఎదురీదడంలోనే మనిషికుండే సర్వశక్తులూ గోచరమౌతాయి. నలుగురు నడచినదారిలో నడవడం సులభమే, కానీ కొత్తదారి ఏర్పరచుకుంటూ నడవడం హిమాలయాన్ని అధిరోహించడం లాంటిది. ఎలాగైనా బ్రతకొచ్చులే అనుకుంటే, పెద్ద ఇబ్బందులేమీ ఉండకపోవచ్చేమోగానీ, ఇలాగే బ్రతకాలి అనుకుంటే మాత్రం రకరకాల సంకటాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. సి.కె. నాగలక్ష్మి ఎంచుకున్నది ఈ రెండో మార్గాన్ని. ఆ మార్గాన సాగడానికి కొన్ని విషయాలలో రాజీపడినా, ప్రధాన విషయాలైన 'సంగీతం మరియు బ్రాహ్మణీకాల' నుండీ వైదొలగలేదు. ఆ రెండింటికోసం తల్లికీ, సోదరునికీ, సోదరికీ దూరమౌతుంది.

కథ ముందుకు జరిగేకొద్దీ నాగలక్ష్మి మనోధర్మం సంగీతానికి దగ్గరవుతుంది, కానీ సంగీతానికి మజిలీలే కానీ గమ్యం లేదని తెలుసుకుంటుంది... "మార్గం చూపడం వరకే గురువు చేసేపని. ఆ తర్వాత యెంతదూరం వెళ్తావన్నది నీ సాధనపై ఆధారపడి ఉంటుంది" అంటుంది సంగీత విద్వాంసురాలు జ్ఞానేశ్వరీదేవి. నాగలక్ష్మి ప్రాధాన్యతాక్రమం కూడా మారాల్సినంతగా మారుతుంది. ఈ మార్పు లేకపోతే తాను కావాలనుకున్నదానిని అందుకోలేకపోయి ఉండేదేమో! తల్లికే ఎదురుతిరిగి, పోషకుడి సంకెళ్ళ నుండీ తప్పించుకుని, విశ్వనాథన్‌కు భార్య అవుతుంది, అదీ అతని భార్య చనిపోయిన వెంటనే. ఆ తరువాత విశ్వనాథన్ మాట ఆమెకు వేదమౌతుంది, ఆయన ఉనికే ఆమె కచేరీలకు ప్రేరణ అవుతుంది, ఆయన కాలధర్మం చెందిన తరువాత ఆమె తన కచేరీలకు శాశ్వతంగా దూరమౌతుంది. తన భర్త నుండి తన సంగీతాన్ని వేరుచేయలేననే ఆమె నమ్మకం.

ఒక్కోపాత్ర పరిచయానికి ముందూ, తరువాతా, ఒక్కోసారి మధ్యలో, పాత్రల ద్వారా రచయిత తాత్విక, సాంఘిక, సామాజిక, మానసిక, ఆధ్యాత్మిక, శృంగార, చారిత్రక, జీవన చింతన, సత్యశోధన, శాశ్వత – అశాశ్వతాలకు సంబంధించిన వ్యాఖ్యానాలను, కొత్త ఆలోచనలు రేకెత్తించే విషయాలను పాఠకుడి ముందుంచుతాడు. కొన్నిసార్లు ఐచ్చికాలనిచ్చి ఎంపిక పాఠకుడికి ఇచ్చేస్తాడు. ఇంకొన్నిసార్లు ప్రశ్నలు సంధించి ఆలోచించుకోమంటాడు. ఉదాహరణకు...., "భర్త పోషించడా? పోషకుడు భరించడా? ఆలుమగల మధ్య ఎవరెంత బాధ్యతాయుతంగా వుండాలనేది వాళ్ళ బంధానికి పెట్టిన పేరుమీద ఆధారపడి ఉంటుందా? మరి మానవజీవనానికి తల్లివేరులాంటి ప్రేమ, అభిమానం, ఆప్యాయతల అస్థిత్వానికి చోటెక్కడ?'...' సంగీతం మజిలీ అయితే, ఆ తరువాత మజిలీలుండవా? గమ్యముండదా?' '....' జరిగిన ఏ విషయాన్నయినా సవ్యంగానూ, అపసవ్యంగానూ చూడవచ్చు. నాకెందుకో అపసవ్యమైనదే వాస్తవమనిపిస్తుందెప్పుడూ! తప్పు నా దృష్టిలోనా? లేకపోతే సృష్టిలోనా?" ఇంకోచోట, మతము మరణమనే బీజము నుంచీ మొలకెత్తిందని సూక్ష్మీకరిస్తాడు రచయిత. 'దృష్టి, సృష్టి' రెండూ చాలా మామూలు పదాలుగా కనిపించినా, ఆలోచించేకొద్దీ అవి రెండూ క్లిష్టంగా తయారవుతాయి.

చిత్తూరు స్కంద కుముదవల్లి నుండీ నాగలక్ష్మి నటరాజన్ వరకూ ఎన్ని పాత్రలు, ఎన్ని ఊళ్ళు, ఎన్ని అనుభవాలు, ఎన్ని ఉత్థాన పతనాలు, ఎన్ని స్వార్థాలు, ఎన్ని త్యాగాలు, ఎన్ని రాగాలు, ఎన్ని తారలు.... వీటన్నిటినీ కలిపే ఆ 'మనోధర్మపరాగం' రచయిత తన జ్ఞానాన్నీ, వివేకాన్నీ, ప్రాపంచిక అనుభవాల్నీ తనదైన శైలిలో ఉపయోగించి, ఆ పాత్రలలో తాను పరకాయ ప్రవేశం చేసి జీవించి ఉంటే తప్ప ఈ 'మనోధర్మపరాగం' ఈ స్థాయిలో ఉండేది కాదు.

"పేరుకు ప్రజలది రాజ్యం – పెత్తందార్లదే భోజ్యం" అని ఆరుద్ర అన్నట్లు, పాపం వీళ్ళు పేరుకు మాత్రమే దేవదాసీలు, నిత్యసుమంగళులు. నిజానికి వీళ్ళు సాటిమనషులైన ఉన్నత ధనికవర్గ పురుషులకు లైంగిక వాంఛలు తీర్చే దాసీలు. ఈ విభిన్నమైన పాత్రలు తమ సామాజిక, కుటుంబ నేపథ్యంతో పాటు తమ సాధక బాధకాలను కూడా తెలుపు కుంటాయి. ఈ నవలకు చారిత్రక నేపథ్యమున్నప్పటికీ ఇందులో రాజులూ, రాణులూ, జమీందారులూ, రాజ్యాలూ, యుద్ధాలూ, జయాలూ, అపజయాలూ, అంగరంగ వైభోగాలూ ఉండవు. ప్రధానంగా ఉన్నది తరతరాల దేవదాసీలు, వాళ్ళపోషకులు, వాళ్ళకు సంబంధించినవాళ్ళు, సినిమాలనే పాకుడురాళ్ళూ. ఆ పాకుడురాళ్ళని పరమపద సోపానాలని భ్రమసి, మనషుల్ని గొప్పగా అంచనావేసి మోసపోయిన కథానాయికలు.

చిత్తూరు సరళకుమారి పాత్రను చదివినప్పుడు మహానటి సావిత్రి గుర్తుకు వస్తుంది. అసలు ఆ పాత్రను ప్రత్యేక ఇష్టంతో నవలలో రచయిత చేర్చాడేమోననిపిస్తుంది. ఆమెను సి.కె. నాగలక్ష్మి తన భర్తతో పాటు కలిసిందా లేదా అనేది రచయిత చెప్పకుండా, కలిసిందో లేదో తేల్చుకోమని పాఠకులకే వదిలేస్తాడు. సరళకుమారి భర్తను ఎంపిక చేసుకునే విషయంలో చేసిన పొరపాటు వల్ల తనతోపాటు తన పిల్లల జీవితాలనూ ఊబిలోకి దించేసింది. ఆమె ఆఖరు మాటలు... "నా

పిల్లలూ... నేనూ... నే... నూ...” పాఠకుడి మనసును దుఃఖానికి గురిచేస్తాయి. ఆవిధమైనటువంటి స్పందన పాత్రతో పాఠకుడు మమేకమైతేనే జరుగుతుంది. అటువంటి బాధే సి.కె. నాగలక్ష్మి, చనిపోయిన తన తల్లిని చూచి విలపించినప్పుడు కూడా కలుగుతుంది. కుముదవల్లి కూతుర్లకోసం ఎన్ని ప్రార్థనలు చేసిందీ, ఎంత తపించిందీ, ఆ కూతుర్ల సుఖంకోసం ఎంత తాపత్రయపడిందీ అన్నీ ఒక్కసారి కళ్ళముందు కదలాడి, ఇంతేనా ఎవరికైనా చివరకు మిగిలేది? అనిపిస్తుంది.

అంతర్గత ఉద్రేకానికీ బాహ్య వాతావరణానికీ సమతౌల్యం కుదిరినప్పుడే రసానుభూతి జనిస్తుందని అంటారు. రచయిత వాడిన ఉపమాన, ఉపమేయాలు, వర్ణనలూ పాఠకుడిని వాక్యాల మధ్యలోకి లాక్కుని పాత్రనూ పాఠకుడిని ఒక్కటి చేస్తాయి. “మనోధర్మ సంగీతం అనేది శరీరానికి పూసే మనస్సు అనే పువ్వుకుండే పరాగం మాత్రమే. అది ఏ ఇద్దరిలోనూ ఒకలా ఉండదు” అని సరళీకరిస్తాడు రచయిత. మనం జేసుదాసునీ, పండిట్ భీంసేన్ జోషీనీ, చంబై వైద్యనాథ భాగవతార్‌ని కొంచెం మనసుబెట్టి వింటే ఇది సత్యమని తెలిసిపోతుంది.

“చరిత్రతో ఇటుకలు తయారుచేసి, ఇతివృత్తానికనుగుణంగా ఇష్టమొచ్చిన రీతిలో వాటిని తీసుకుని, కల్పన అనే సిమెంటుతో గోడలూ, పైకప్పు కట్టి, పైన జీవన చలన సూత్రాలనే రంగులు పూసి నిర్మించిన కల్పనా చారిత్రక భవనమీ నవల” అంటాడు రచయిత. ఈ ప్రయత్నమేమీ వెన్నలో వెంట్రుక తీసినంత సులభంకాదు. ఇటుకలు వంచితే వంగవు, ఒత్తిడిచేస్తే విరిగిపోతాయి, అంటే ఆకృతులకోసం రచయిత సిమెంటు మీదనే ఆధారపడాలి. అలాగని వట్టి సిమెంటుతోనే సరిపెట్టడానికి కుదరదు. రంగులు కూడా పకడ్బందీగా ఎన్నుకుని వేయాలి లేకుంటే అవి అంటుకోవు. ఇటుకలనూ, సిమెంటునూ, రంగులనూ జాగ్రత్తగా వాడి చక్కని భవనాన్ని నిర్మించాడు రచయిత. ఇది ఒకసారి చదివి ప్రక్కనపడేసే నవల కాదు. సమయం దొరికినప్పుడల్లా ఏ పాత్రను చదివినా, ఇంతకుముందు మనకు కనిపించని కొత్త విషయాలు కొన్ని మనకు కనిపిస్తూనే వుంటాయి. జీవితపు సంక్లిష్టతల్ని ఒడిసి పట్టుకున్నప్పుడే అది సాధ్యమౌతుంది. వొక ప్రత్యేక సంస్కృతినీ కాలాన్నీ చిత్రించిన ఈ నవల అందుకే సార్వ కాలికమూ, సార్వజనీనమూ అయింది. ఈ నవలకు బహుమతినిచ్చిన ఆటా వాళ్ళకు అభినందనలు.

**‘మనోధర్మ పరాగం’ - నవల**

**ఆటా బహుమతి (2020)**

**రచన : మధురాంతకం నరేంద్ర.**


**1/8 డెమ్మీలో 442 పుటలు. వెల : రూ. 375/-**

**ప్రతులకు : అన్వీక్షికి, అగ్రహౌస్, 54/సి/డి, ఎం.ఎన్.ఏ. కాలనీ, బంజారాహిల్స్, హైదరాబాద్. ఫోన్ : 97059 72222**

# ప్రజాగాయకుడు, ప్రజా కార్యకర్త వీర సాథీదర్ స్మృతి!

**సాంస్కృతిక** కార్యకర్త, గాయకుడు, పత్రికా సంపాదకుడు, ‘కోర్ట్’ సినిమా ద్వారా సుప్రసిద్ధుడైన వీర సాథీదర్ 2021 ఏప్రిల్ 13న కోవిడ్-19 కారణంగా తన 61వ యేట తుదిశ్వాస విడిచారు. అతడి అసలు పేరు విజయ్ రామ్‌దాస్ వైరగడే. దళిత, ట్రేడ్ యూనియన్ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటున్న నూనూగు మీసాల కాలంలో - అంటే డెబ్బయ్యో దశకంలో - ‘వీర సాథీదర్’ (విజయవంతమైన స్నేహితుడు) అని పేరు పెట్టుకున్నాడు. నాగ్‌పూర్‌కు దగ్గర్లోని ఒక గ్రామంలో పుట్టిన సాథీదర్ చదువు అంతంత మాత్రంగానే ముగిసింది. పదో తరగతి ఫెయిలైన తర్వాత పశువుల కాపరిగా పనిచేశాడు. ఆ తర్వాత నాగ్‌పూర్‌కు వచ్చి ఒక కర్మాగారంలో రోజంతా పనిచేస్తూ ఆ ఫ్యాక్టరీ బట్టలతోనే సాయంత్రం పూట 11వ తరగతి క్లాసులకు వెళ్లేవాడు. సెకెండ్ హ్యాండ్ షాపులో అర్ధ రూపాయి పెట్టి గోర్కీ ‘అమ్మ’ నవల కొనుక్కుని చదివినపుడు, పావెల్ కథలో తన కథే రాశారా అని అతడి కనిపించింది. ఆ తర్వాత మార్క్స్, లెనిన్, కాస్ట్రో తదితరుల పుస్తకాలు చదివాడు. 19 సంవత్సరాల చిన్న వయసులోనే నాగ్పూర్ మాగ్నెట్ వైర్స్ లిమిటెడ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అనే రిజిస్టర్డ్ యూనియన్ స్థాపించాడు. అతడిపై అంబేద్కర్, దళిత పాంథర్స్ ఉద్యమ ప్రభావం కూడా బలంగా వుండేది.

1985 వరకూ నాగ్‌పూర్ ఫ్యాక్టరీలో పనిచేస్తూ, మిల్లులో జరిగిన ప్రమాదంలో ఒక చేతి బొటనవేలు పోగొట్టుకున్నాక, పత్రికారంగంలో పనిచేయడం మొదలు పెట్టాడు. నాగ్‌పూర్ నుండి వెలువడే మరాఠీ పత్రిక ‘దైనిక్ మహాసాగర్’కు విలేకరిగా పనిచేశాడు. ‘బహుజన సంఘర్ష్’ పత్రికకు రాజకీయ వ్యాసాలు రాశాడు. అనేక ప్రగతిశీల రచయితల సంఘాలలో పనిచేశాడు. ఖైర్లాంజి సంఘటన తర్వాత కవులారా మీరెటువైపు అంటూ సాహిత్య పెద్దలను నిలదీశాడు. ఎల్గార్ పరిషత్ నిర్వాహకుడిగా కూడా కొనసాగాడు. ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ లేదా ఇప్టా నాగ్‌పూర్ శాఖకు బాధ్యుడిగా పనిచేశాడు. ‘విద్రోహి’ పత్రికను కూడా నిర్వహించాడు.



‘కోర్టు’ సినిమాలో పోలీసుల అరెస్టులు, వేధింపులను ఎదుర్కునే ప్రజాగాయకుడి పాత్ర వేయాల్సి వచ్చినపుడు అతడికి పెద్దగా కష్టమని పించలేదు. అది అతడి నిజ జీవిత కథేనని పించింది. ఈ సినిమా 71వ వెనీస్ చలనచిత్రోత్సవంలోనూ, 2015లో 62వ జాతీయ చలనచిత్ర ఉత్సవంలోనూ అవార్డులు అందుకుంది. విడుదల కాకముందే 18 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకుంది.

గల్పిక

# శ్రీ ఆంజనేయం.... ప్రసన్నాంజనేయం....

– శంకరం

"**మాది** తెనాలే.... మీది తెనాలే.... అహ మాది తెనాలే...."

"యేట్రా బామ్మర్దీ వడదెబ్బ తగిలిందేటి అలా ఊగిపోతన్నావ్?"

"ఊగిపోడం కాదురా.... ఆనందం.... ఆవేశం.... ఉచ్ఛాహం...."

"దేనికిరో అంతుత్సాహం!"

"దేనికేట్రా పిచ్చిమొకమా? ఆంజినేయుడు తిరప్తిలోనే పుట్నాడట..... పై పెచ్చు మన్తెలుగోడట.... ఆనందంగాకింకేట్రా!"

"వారినీ! దేవుళ్ళకి కూడా భాష, ప్రాంతం లాంటివన్నీ అంటగడ తన్నార్రా.... ఇంతకీ ఆంజినేయుడు తెలుగు మాట్టాడినట్టు మనోల్లకెలా తెలిసిందో?"

"వారి మాలోకం, తిరప్తిలో పుట్టినోడు తెలుగు మాట్టాడకపోతే మరేటి మాట్టాడతాడ్రా?"

"అదేరా నానూ అంటన్నాను.... ఆంజనేయుడు తిరపతిలోనే పుట్టినాడని ఈల్లెట్టా కనిపెట్నారని.....?"

"అదేట్రా బావా, అట్టాగంటావ్.... శాస్త్రరాలు తిరగేసి, పురానాలు మరగేసి.... నాలుగు సమ్చరాలు కిందా మీదా అడితే తెలిసొచ్చినాట కదా.... నీకేవీ తెలవనట్లు నన్నడుగుతావేట్రా?"

"అసలికీ.... అనుమంతుడు సంగతి మనకి దేన్నిబట్టి తెలిసిందిరా?"

"దేన్ని బట్టేటి.... రామాయనం బట్టి!"

"కదా! రామాయణం ఎప్పుడు జరిగిందీ, రాముడు ఎప్పుడు రాజ్జెం సేసినాడో నీకు దెల్సురా?"

"అబ్బో! అదెప్పటి మాట.... అదేదో దాపరుగంలోనో, ఇంకెప్పుడో కదా...."

"ద్వాపర యుగం కాదురా.... త్రేతాయుగంలో! త్రేతాయుగవంటే ఎప్పుడో దెల్సా? పది లక్షల సవచ్చరాల క్రితం...."

"అబ్బా! అసలప్పటికి భూమ్మీద మదుసులున్నారంతావా?"

"నాకు దెల్సి మనుసుల గురించి తెల్సి మహా అయితే పది, పదిహేనువేల ఏల్లవుద్దిరా...."

"అట్టైతే రావులోరు అయోజ్జలో పుట్నారని ఎట్టా సెప్పేరంటావ్?"

"యెట్టా సెప్పేరో ఓ పక్కనెడదాం. అయోద్యే రాముడు పుట్టిన భూవని సెప్పి, హిందూ జనాల్ని రెచ్చగొట్టి అక్కడున్న మసీదుని నేలమట్టం చేసేసి దేశాన్ని రావణకాష్టం చేస్సేరు.... గ్నాపకవుందా నీకు?"

"అవున్రా బావా, అప్పుడే అనుకుంతాను ఆల్తాలూకా ఓ ముసిలాయన రదయాత్ర కూడా సేసినట్టున్నాడు...."

"దేశవంతా గగ్గోలైపోయింది గదా.... మత ఘర్షణలు కూడా జరిగాయి"

"సివరాకరికేటయింద్రా.... కోరుటు కూడా జెజ్జిమెంటిచ్చేసింది గదా, గదే రావుడు పుట్టిన భూవనీ, అక్కడే గుడి కట్టుకొండని.... మరి దానికేతంతావ్?"

"అలగివ్వకేటిసేత్తార్రా? దేశం మొత్తం నూటికెనభైమంది హిందువులైనప్పుడు. అలగివ్వకుండా ఇంకోలాగిస్తే దేశం మళ్ళీ మంటల్లో మాడిపోయుండేది...."

"వురేయ్ బావా నువ్వొక ఇందువుడయ్యుండీ ఇట్టా మాట్టాడ్డం బానేదురా...."

"అలగొచ్చినావా.... మొన్న పరిదేశమ్మ పండగ మర్నాడు మా సెల్లికి పేనాలమీదికొత్తే అర్ధరాత్రప్పుడు నీకు ఆటో ఎవుడు కట్టేడ్రా...?"

"ఏసుగాడూ...."

"కదా, ఏసుగాడెవడు? కిరస్తానపోడు."

"మరి పండగనాడు గరికోల్ల కల్లాల్లో తారాజువ్వడి గడ్డికుప్పలు తగలడుతుంటే ఆర్పనీకొచ్చిందెవుల్రా?"

"ఎదుటి వాసలో వున్న పీరు సాయిబు, ఆల్ల పిల్లలూనూ...."

"ఆల్లెవుర్రా? సాయిబులన్నువ్వే అన్నావ్...."

"ఇప్పుడియ్యన్నీ ఎందుకురా? నానేటడిగేను? నువ్వేటి సెప్తున్నావ్?"

"నువ్వడిగిన కాడికే వత్తన్నాన్రా.... ఈ దేశంల హిందువులొక్కరూ ఆల్లమ్మటాల్లు బతికీడం నేదు. సాయిబులూ, కిరస్తానపోల్లు, మనం అందరం కలిసిమెలిసి అన్నదమ్ముల్లా బతుకుతున్నాం రా...."

"ఇప్పుడు కాదన్నదెవర్రా, బావూ?"

"నువ్వు హిందువ్వి కాదా అంటే.... హిందువుల పని రాముడెక్కడ పుట్టేడు? సీతనెప్పుడు పెల్లి సేసుకుందు? లక్ష్మణాస్వామి నిజంగా పద్నాలుగేళ్ళు తొంగోకుండా ఉన్నాడా? రాముడిదేకులం? అనుమంతుడి తోక ఎంత పొడుగుండేది? అతగాడు తెలుగోడా, మెద్రాసోడా? ఇయ్యట్రా మనవాలోసించాల్సింది....?"

"మొన్ననే గదట్రా శీరావనవమి సేసి ఆంజినేయుడిక్కూడా దండాలెట్టాం. మనూల్లో కూడా గుడి కట్నాం.... నువ్వు కూడా డబ్బులిచ్చినావ్?"

"బామ్మర్దీ, నానూ ఈ ఊరోడ్నేగా.... నలుగురితో పాటే నానూను. దేవుడ్నెట్టుకునీది ఆపదొచ్చినప్పుడు కాపాడతాడని మొక్కుకునీకి, మంచి మదుసులుగా ఉంచమనీకి...."

"అంతే అనుకో, గానీ...."

"వురే, నేనో ప్రశ్నడుగతాన్సెప్పరా? కరెట్టుగా శీరామనవమి పండగనాటికే అనుమంతుడెక్కడ పుట్టేడు? అనుమంతుడిదేబాష? అని సడెన్‌గా ఇప్పుడే పెకటించడవెందుకురా, సెప్పు సూద్దాం?"

"ఇది మరీ బావుంది.... ఇన్ని సవచ్చరాల్నుండీ నానా అగసాట్లూ పడి కనిపెట్టి, రావులోరి పండగరోజే రాంబంటు గురించి ఇవరాలు బయటెట్టేరు.... దానిక్కూడా పీక్కుంటావేట్రా?"

"మగనెమలి కన్నీళ్ళు తాగితే ఆడనెమలికి గర్భం వస్తాదట, నమ్ముతావా? మనిషి సెమట సుక్కల్ని సేపలు మింగితే దానికి గర్భం వచ్చి మనుషులు పుడతారట. సముద్రం ఒడ్డున నిలబడి సూర్యుడికి దణ్ణవెట్టి, కొన్ని మంత్రాలు సదివితే గర్భం రాకుండానే పిల్లలు పుట్టెస్తారట. ఇంటన్నావా?"

"ఇంటన్నాను గానీ ఇయ్యన్నీ ఇండానికి ఆచ్చెర్యంగానే వున్నాయి. కాకపోతే...."

"నీ బోటోల్లే దేశం నిండా వుండబట్టి గద్దెమీదున్నోల్ల ఆటలన్నీ సాగుతున్నై."

"ఎకసెక్కాలకేంగానీ బావా, అరదమయ్యేనాగ సెప్పరాదూ?"

"నానిందాకట చెప్పాను సూడు, అయోధ్యలో మసీదుని కూలగొట్టే సారని. దాన్నిరగ్గొట్టింది హిందూమతాన్నుద్దరిత్తావని ఓట్లు దండుకునే ఇప్పుడున్న ప్రధానమంత్రిగారి పార్టీ. ఆ టయానికి దేశాన్ని పరిపాలిస్తంది మన తెలుగోడు నరసింహారావు. ఆయన్ది కాంగ్రెస్ పార్టీ...."

"ఆగాగు.... ఇందూ పార్టీవోడు సాయిబుల మసీదుని ఇరగ్గొట్టెత్తుంటే తెలుగోడు, ఎగస్పార్టీవోడు సూత్తా ఎందుకూరుకున్నాడంటావ్? ఆయనగారు కూడా ఇందువే గాబట్టి. అదిగదిరా కోపరేసనంటే అట్టుండాల!"

"పూర్తిగా వినకుండా మధ్యలో ఆపితే ఇలాంటి అర్థాలే వస్తాయి. ఇందాకట్నుండి అనుమంతుడు మన తెలుగోడు.... తెలుగోడు అని గెంతుతున్నావు కదా! ఆ తెలుగోడైన నరసింహారావుగారి టైమ్‌లోనే ఇప్పుడు మన తెలుగోళ్ళంతా నెత్తీ నోరూ మొత్తుకుంటా రోడ్లమ్మట ధర్నాలు సేసుకుంటా, ఎర్రని ఎండల్లో కూడా తిరుగుతున్నారు కదా – అదేరా స్టీల్ ప్లాంటు ప్రైవేటు చేసెస్తున్నారని – ఆ ప్రైవేటీకరణ ఆయనగారి టైమ్‌లోనే మొదలయ్యింది. అప్పట్నుండే దేశంలోకి చైనా, జపాను, కొరియా, అమెరికా దేశాల్నుండి సరుకులు మన దేశంలోకి వరదలా వచ్చి పడ్డం మొదలయ్యింది. ప్రైవేటు బ్యాంకులు, విదేశీ కంపినీలు వందలు, వేలు మన్దేశంలో యాపారాలెట్టుకొని లక్షల కోట్ల లాభాలు అట్టుకెళ్ళిపోడం మొదలైంది. ఇయ్యన్నీ సామాన్య పెజానీకం కళ్ళల్లో పడకుండా, ఈటికి అల్లెవరూ అడ్డుపడకుండా ఉండాలంటే ఏం సెయ్యాల? దేశవంతా అట్టుడికిపోయేలా ఏదో ఒకటి జరగాల. అదే మసీదుని కూలగొట్టడం – దానికంటే ముందు రథయాత్ర ఇవన్నీ దేశ ప్రజల్లో మతపరంగా చిచ్చు పెట్టడానికే. జనం కొట్టుకు ఛస్తుంటే వాళ్ళకి నచ్చిన పనులు వాళ్ళు చేసుకుపోతారన్నమాట. హిందువుల కోపరేషన్ కాదు – దేశాన్ని పీక్కుతినేవాళ్ళ మధ్య కోపరేషన్ – అర్థమయ్యిందా?"

"రావులోరికి గుడి కడతావన్జెప్పి ఇంతింత గోరాలు సేసినారా? బిటీసోడు సేసిందే ఈల్లూ సేత్తన్నమాట – ఇడగొట్టేసి పాలించడం – అమ్మ దొంగనాయాల్లారా, ఎంత గుండిల్దీసిన మొనగాల్రా మీరు! అద్సరేగాని బా.... మరిప్పుడు ఆంజినేయుడి సంగతి ఎందుకు దీస్కొచ్చారంటావ్?"

"అలగడిగేవ్ బాగుంది!

మన్లాగ ఇద్దరు, ముగ్గురు కూకోని మాట్టాడుకోనీకి కూడా ఇప్పుడు బయపడతన్నాం.... దేనికి?"

"ఇంకేటి, కరోనా అమ్మోరు.... పెపంచకాన్నే సుట్టబెట్టేత్తంది.... టివీలో శవాల్ని కుప్పలుగా తగలెయ్యడం సూత్తుంటే ఎన్నుబావులోంచి సలి పుట్టుకొత్తుందిరా...."

"ఇప్పుడిదే దేశాన్ని పట్టి పీడిస్తున్న భయంకరమైన సమిస్య. కిందటేడు వచ్చిన కరోనా అన్ని రకాల పెజల్నీ ఎంతలా కిందా మీదా సేసిందో సేసేం. లక్షల కొద్దీ పయ్యార్లు పోయి పన్లు సేసుకునీవోల్లు మగోల్లు, ఆడోల్లు, సిన్నపిల్లల్తో సహా మైళ్ళు మైళ్ళు నడిసి నడిసి మధ్యలోనే సనిపోయినోల్లు.... ఏరోజు పేపరు తీసినా, టీవీ చూసినా ఇదే కనబడేది. దానికి తోడు ఆసుపత్రుల్లో మందులు నేకపోడం, బెడ్లు సాలకపోడం, వెంటిలేటర్లు దొరక్కపోడం, ప్రైవేటు ఆస్పత్రుల్లో లక్షలకి లక్షలు వసూలు సెయ్యడం సూసేం. రెండోసారి వత్తాదని పెద్ది పెద్దోల్లు సెప్పారు, మనోల్లకీ తెలుసు. మరి ఏవైనా నిరుడికీ, ఇప్పటికీ ఈ ఆస్పత్రులు, మందులు, బెడ్లు, టీకాలు సరిపోతన్నాయా? అప్పటికంటే ఇప్పుడు కేసులు విపరీతంగా పెరిగిపోతన్నై. రోజుకి 3 లక్షల కేసులంటే.... నాకు తెలిసి ప్రపంచంలో మనమే ఫస్టు. కనీసం శవాల్ని తగలెట్టనీకి కూడా క్యూలో గంటలు గంటలు నిలబడాల్సొస్తంది. ఇక టీకాల కోసం, ఆస్పత్రుల్లో సేర్చుకోడం కోసం పాపం జబ్బుపడ్డోల్లు, ఆల్ల బందుగులూ ఎన్ని పాట్లు పడతన్నో...."

"నిజవేన్రా బా.... బెమ్మంగార్సెప్పినట్టు సూత్తుంటే కలియుగం ముగిసిపోయినాగుంది. మాయదారి జీవం పెజల్ని సంపుక తినేత్తుంటే పాపం గవుర్మెంటు మట్టుకు ఏటి సేత్తాదిరా?"

"ఏటి సేత్తాదా? వేల కోట్లు కర్సెట్టి విగ్రహాలు కట్టిత్తాది, లక్షకోట్లు పెట్టి బులెట్ ట్రైను ఏయిత్తాది. దేశానికెంత పేరు! పెపంచంలో అతి ఎత్తైన విగ్రహం మా దేశింలోనే వుందంటే మిగిలిందేశాల్లో మనకెంత గౌరువం?"

"పెపంచకంలో లేనియ్యి మందేశింల వున్నాయంతే మనకి గౌరువం కాదేట్రా, అలగంతావేటి?"

"అవున్రా.... పెపంచకం మొత్తం మీద మా దేశంలో కరోనా కేసులెక్కువ, మా దేశంలోనే కరోనా చావులెక్కువ. మేం గొప్పలకి పోయి ఇతర దేశాలకి టీకాలు, మందులు అంపిత్తాం, మా దేశం జనాభాని సంపిత్తాం. ఇదేనా గొప్ప? ఇదేనా గౌరువం? సెప్పరా.... సెప్పు!"

"నిజవేన్రా బా.... నేనంత దూరం ఆలోసించనేకపోయేన్రా.... పెజల పేనాల కంటే ఏదీ ఎక్కువ కాదు కదరా!"

"నీ నోటమ్మట ఈ మాట రావాలనేరా నానిందాకట్నుండీ సూత్తన్నాను. ఏ దేశవైనా ముందు ప్రెజల ఆరోగ్యం సూడాల్రా. అంటే పెజలందరికీ కడుపునిండా తిండి దొరుకుతుందా, శుభ్రమైన నీరు తాగుతున్నారా, ఇళ్ళు, వీధులు అన్నీ శుభ్రంగా వుంటన్నాయా, తగినన్ని

ఆసుపత్తుర్లు, డాక్టర్లు, మందులు ఉన్నాయా.... ఇయ్యి కదరా ముఖ్యం. యవుసాయం గిట్టుబాటుగాక లక్షలమంది మన రైతులు సచ్చిపోతున్నార్రా. మన్నిప్పుడు రైతులు బలవంతపు సావులు ఎప్పుడైనా సూసేంరా?"

"కరెస్టుగా సెప్పేవురా! సొమ్ములున్నోల్లూ, లేనోల్లూ అందరూ పైవేటాస్పత్తుర్లికే పోతన్నార్రా. పొలాలు తాకట్టెట్టుకోని, పుస్తులు తాకట్టెట్టుకోని వయిద్యం సేయించుకుంతన్నారు. ఇంకోపక్క పప్పులు, కూరలూ, గేసూ, పిట్రోలూ అన్ని దరలూ పాపం పెరిగిపోతన్నట్టు పెరిగిపోతన్నై. నువు సెప్పిందాన్ని బట్టి సూత్తే విప్పుడు ఆంజినేయ దండకం మొదలెడతారేవోన్రా."

"మనకంటే చిన్న చిన్న దేశాలు సరైన సమయంలో ముందు జాగ్రత్తలు తీసుకున్న కారణంగా అక్కడ కేసులు, మరణాలు బహు తక్కువగా ఉన్నాయి. మహమ్మారి బారి నుండి తేలికగా బయటపడ్డాయి. ఇక్కడ టీకాలకు మూడు రకాల రేట్లు పెట్టారు. ఒకపక్క టీకాలు, మందులు చాలడంలేదు. మరోపక్క ప్రైవేటు ఆస్పత్రుల్లో రేట్లు పెంచుకోమంటున్నారు - ఇదీ మన దేశం పరిస్థితి."

"బావా! అద్సరేగానీ ఈ మందుషాపులూ, బార్లూ, సినిమాహాల్లూ, గుళ్ళూ, గోపురాలూ అప్పుడు మూస్సేరు గదా మరిప్పుడు ముయ్యనేదేం? ఏటంతావ్?"

"కేసులు పెరిగితేనే కదరా ప్రైవేటు కంపినీలు తయారుచేసే టీకాలు, మందులు ఎక్కువగా అమ్ముడుపోయేది. ఆ పెద్ద పెద్ద కంపినీలే ఈరోజు దేశాల్ని నడుపుతున్నాయి. కిందటేడు డిల్లీలో ఓ ఐదారువేల మంది సాయిబులు ఒకచోట సమావేశాలు పెట్టుకున్నారు. దాని వలన దేశంలో చాలామందికి కరోనా సోకిందని దేశ నాయకులు, హిందూ మత సంస్థలూ గగ్గోలు పెట్టేసారు. ఇప్పుడేమో రెండవ విడత కరోనా పరిస్థితి ఘోరంగా ఉంటుందని తెలిసి కూడా ఈ పెద్దలు హరిద్వార్‌లో లక్షలాదిమంది చేరడానికీ, వేలల్లో కేసులు రావడానికి తగిన ఏర్పాట్లు చేసారు. బాగుంది కదూ?"

"అయితే బావా, ఇవన్నీ పెద్దలందరికీ తెలిసే జరుగుతున్నాయి కదా! మరి మన్లాటోల్లకి దిక్కెవర్రా?"

"అందుకే కదరా ఈ మేళాలు, ఆంజనేయుళ్ళూ, దండకాలునూ!!!"

## 16 ప్రజా సంఘాలపై తెలంగాణ ప్రభుత్వం విధించిన నిషేధాన్ని ఖండిస్తున్నాం

**తెలంగాణలో** పనిచేస్తున్న పదహారు ప్రజాసంఘాలను తెలంగాణ పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్ క్రింద నిషేధిస్తున్నట్లు మార్చి 30న తెలంగాణ ప్రభుత్వం జి.వో. విడుదల చేసింది. అది పత్రికలకు ఏప్రిల్ 23న అందింది. తానే మావోయిస్టు ఎజెండా అమలు చేస్తున్నానని గొప్పలు చెప్పుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి - పై పదహారు సంఘాలు మావోయిస్టు పార్టీ రాజకీయాలను ప్రజల్లో ప్రచారం చేస్తూ వారిని తప్పుదారి పట్టిస్తున్నందుకు నిషేధిస్తున్నట్లు ప్రకటించారు.

ఇది నిర్బంధ వ్యతిరేక ప్రచారాన్ని అణచివేయడమే. భావస్వాతంత్ర్య ప్రకటనకు అడ్డుపడటమే. వాక్స్వాతంత్ర్యాన్ని నిషేధించడమే ప్రభుత్వ విధానాలలో వున్న ప్రజావ్యతిరేక స్వభావాన్ని బట్టబయలు చేసే ప్రగతిశీల ప్రజాసంఘాలను నిషేధించడం ఫాసిస్టు ధోరణిగా పరిగణిస్తున్నాం.

కేంద్ర ప్రభుత్వం రెండేళ్ళుగా విచారణ చేయకుండా 16 మంది ప్రజాస్వామికవాదులను తప్పుడు ఆరోపణలతో నిర్బంధంలో వుంచి వేధిస్తోంది. వెంటనే ఆ 16 మందినీ విడుదల చేయాలనీ లేదా విచారణ క్రమం ప్రారంభించాలనీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సరికొత్తగా నిషేధించిన 16 ప్రజాసంఘాలపై నిషేధం ఎత్తివేయాలనీ జనసాహితి డిమాండ్ చేస్తోంది.

## ప్రగతిశీల అధ్యాపకుడు, పౌరహక్కుల సంఘ నాయకుడు కె.పి. సుబ్బారావు మరణం

**ఆంధ్ర** విశ్వ కళాపరిషత్తులోని విద్యాశాఖలో ఆచార్యులుగా పనిచేసిన కె.పి. సుబ్బారావు తన 69వ ఏట విశాఖలో 23-4-2021న మరణించారు.

ఆయన గాయకుడు, జననాట్యమండలి కళాకారుడు, సుదీర్ఘకాలం పౌరహక్కుల సంఘం ఉపాధ్యక్షులుగా వున్నారు. ప్రగతిశీల సంస్థల కార్యక్రమాలకు తన సహకారాన్ని అందచేసేవారు. విద్యాపరిరక్షణ కమిటీలో బాధ్యులుగా నేటి విద్యారంగంలో రావాల్సిన మార్పుల గురించి కృషిచేశారు. పలు ప్రజాకళారూపాలను ప్రోత్సహించారు.

ప్రగతిశీలురైన పాతతరంవారు ఒక్కొక్కరు నిష్క్రమిస్తున్నారు. వారి నుండి స్ఫూర్తి పొంది కొత్తతరంవారు ప్రజాఉద్యమాలకు ఊతమిచ్చి నూతన ప్రజాతంత్ర విప్లవం విజయవంతం చేసే కర్తవ్యంలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఈ మరణాలు గుర్తు చేస్తున్నాయి.

కె.పి. సుబ్బారావు మరణానికి జనసాహితి సంతాపాన్ని ప్రకటిస్తోంది.

# మూగబోయిన అలుపెరగని ధిక్కార కలం యోధుడు సిహెచ్. మధు!

**సుమారు** ఒక సంవత్సరం పైగా క్యాన్సర్ వ్యాధితో కింద మీదలవుతున్న కలం యోధుడు సిహెచ్ మధు, 24 ఏప్రిల్ 2021 శనివారం శాశ్వతంగా మనల్ని వీడి వెళ్లిపోయారు.

రచన ఆయనకు ఆరో ప్రాణం. ధిక్కారం ఆయన అలుపెరగకుండా ఎత్తిపట్టిన జెండా. ప్రజాస్వామిక సమాజం నిర్మాణమే ఆయన నమ్ముకున్న ఎజెండా. తన 76 ఏళ్ల జీవితంలో 55 ఏళ్లుగా రచనలు సాగిస్తూనే ఉన్నారు. నమ్మిన ఆశయ సాధన కోసం 50 ఏళ్లకు పైగా ప్రత్యక్షంగా అనేక ప్రజా ఉద్యమాలలో పాల్గొని, ఉద్యమ సంస్థలతో కలిసి పనిచేస్తూ వచ్చారు. గడచిన రెండు దశాబ్దాలుగా 'ప్రజాసాహితి' పత్రికతో జనసాహితి సంస్థతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ వచ్చారు.



'ప్రజాసాహితి' మొట్టమొదటి సంచిక (1977 ఆగస్టు)లోనే ఆయన కథ వెలువడటమేకాక దానిపై అందులో చర్చ కూడా నడిచింది.

1978 మే నెలలో మంగళగిరి చార్వాక ఆశ్రమంలో జనసాహితి తొలి మహాసభ నిర్వహణకై జరిగిన రాష్ట్రస్థాయి సన్నాహక సమావేశానికి నిజామాబాద్ నుండి సిహెచ్ మధు కూడా హాజరయ్యారు. తన కొన ఊపిరిదాకా 'ప్రజాసాహితి' పత్రికతో జనసాహితి సంస్థతో సజీవ సంబంధాలు కొనసాగిస్తూనే వచ్చారు.

రైతుకూలీ ఉద్యమాలతో, కార్మిక పోరాటాలతో, పౌర హక్కుల ఉద్యమంతో, విప్లవ రచయితల సంఘంతో ప్రత్యక్షంగా పరోక్షంగా పాల్గొంటూ బాధ్యతలు నెరవేరుస్తూ తన వ్యక్తిగత జీవితం ఎన్ని కష్ట నష్టాలతో తలమునకలైనా, నమ్మిన ఆశయాన్ని, ఎత్తిపట్టిన కలాన్ని, తలవంచని ధిక్కార స్వరాన్ని విడిచిపెట్టకుండా నిరంతరాయంగా రాస్తూ వినిపిస్తూ తన ఆశయ బలాన్ని చాటుకుంటూ వచ్చారు.

మెదక్ జిల్లా రామాయంపేటలో ఒక నిరుపేద కుటుంబంలో పుట్టి పెరిగిన చందుపట్ల విఠల్ బతుకు తెరువుకై నిజామాబాద్ వచ్చి బట్టల షాపులో గుమస్తాగా, ఊర్లవెంట తిరిగి బట్టలు అమ్మకాలుచేసే చిరు వ్యాపారస్తునిగా, చాలా కొద్ది కాలం చిన్న ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకునిగా పని చేశారు. సిహెచ్ మధు పేరుతో కథలు, నవలలు, కవిత్వం, వ్యాసాలు, సాహిత్య విమర్శ తదితర ప్రక్రియలలో అనేక పత్రికలలో విస్తృతంగా రచనలు చేశారు. ఆయన వివిధ పత్రికల్లో 120కు పైగా కథలు రాశారు. 'స్వాతి' పత్రిక 1979లో నిర్వహించిన పోటీలో ఆయన రాసిన 'తూర్పు ఎరుపులో మహిళ' అనే నవల ప్రథమ బహుమతి అందుకుంది. ఆయన 15 ఏళ్ళపాటు 'జలపాతం' అనే పత్రిక నడిపారు. దానికి, దినపత్రిక 'అమృత కిరణ్'కు సంపాదకులుగా పనిచేశారు.

శ్రమ జీవులపట్ల, పీడిత ప్రజలపట్ల తనకు గల అచంచల పక్షపాతాన్ని, దోపిడీవర్గాల పట్ల, వారికి కావలికాస్తున్న నిరంకుశ పాలక ప్రభువుల పట్ల తనకున్న ఆగ్రహాన్ని ఏనాడు ఆయన దాచుకోలేదు. ఆయనను సజీవంగా నిలబెట్టిన శక్తిమంతమైన తాత్విక భావనాశక్తి అదే.

పుస్తకరూపాన్ని పొందని వందలాది రచనలు చేసిన సాహిత్యకారుడు ఆయన!

అసమానతలతో కూడిన భారత సామాజిక వ్యవస్థలో మౌలిక మార్పులు రావాలనే ప్రగాఢ ఆకాంక్షతో ఆయన సాహిత్య సామాజిక కార్యక్రమాలు సాగాయి. కామ్రేడ్ మధుది పీడితప్రజల ధిక్కారస్వరం. పాలకుల మెరమెచ్చులకు, లాలింపులకూ లొంగని కలం! ప్రజా ఉద్యమాలనే నమ్ముకున్న నిబద్ధజీవనం!

ఆయన మరణం తెలుగు సాహిత్యానికి, ప్రగతిశీల ఉద్యమాలకు, సామాజికమార్పును ఆశించే సమస్త విప్లవ శక్తులకు తీరనిలోటు. 'ప్రజాసాహితి' పత్రికకు, జనసాహితి సంస్థకు ఆయనతో గల సుదీర్ఘ అనుబంధం వల్ల గొప్ప ఉద్యమమిత్రుని కోల్పోయిన ఆవేదన.

బహుముఖ సాహితీ ప్రక్రియలతో వందలాది రచనలు చేసిన, ధిక్కారమే ఊపిరిగా జీవించిన సిహెచ్ మధు మరణం పట్ల జనసాహితి తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తూ నివాళులర్పిస్తోంది. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటిస్తూ వారితో తన బాధను పంచుకుంటోంది. ✸

## దేశద్రోహం పేరుతో అస్సాం రచయిత్రి శిఖాశర్మ అరెస్టు

**"జీతాలు** తీసుకుంటున్న ఉద్యోగులు తమ విధి నిర్వహణలో చనిపోతే వారిని మృతవీరులుగా పేర్కొనడం తగదు. విద్యుత్‌శాఖ ఉద్యోగి విద్యుద్ఘాతంతో చనిపోతే అతనూ మృతవీరుడే అవుతాడా? ప్రసార మాధ్యమాలు ప్రజల్ని భావోద్వేగాలకు గురిచేయకూడదు" అని అస్సాం రచయిత్రి శిఖాశర్మ ఫేస్‌బుక్‌లో మావోయిస్టు కాల్పుల్లో చత్తీస్‌గడ్‌లో చనిపోయిన జవాన్లపై చేసిన వాఖ్యగానూ ఆమెను అరెస్టు చేశారు. భావప్రకటనా స్వేచ్ఛపై జరుగుతున్న దాడుల్ని ఖండిద్దాం! ✸

కవిత

# జీవన ప్రయాణం

– సిహెచ్. మధు

**జీవన** చరమాంకం ప్రారంభమయ్యింది
సూర్యుడు పశ్చిమాన పరుగును
అరచేతితో ఆపేసాను
ఆపన్నుల హస్తం, అభిమాన సూర్యుల వెలుగు
నాకు అమృతం పోస్తున్నాయి
అస్తమయం సహజాతి సహజం
కానీ తాత్కాలికంగా ఓడిపోతుంది
పర్వతాల అడ్డు తొలగిపోతుంది

డెబ్బది సంవత్సరాల చెట్టు
శిశిరంలోకి ప్రవేశించింది
ఆకులు రాలిపోతున్నాయి
కొమ్మలు బలంగానే వున్నాయి
మళ్లీ ఆకులు చిగురిస్తాయి
గాలి, నీరు నేనేగా
నేల బలం నాలో నిక్షిప్తమయివుంది

నా మనసులో ముళ్లు – రాళ్లు వున్నాయి
నా మనసులో ఘర్షణ –
ముళ్లు – రాళ్లు ఎవరిని గాయం చేయకుండా
జాగ్రత్తపడ్డాను
నా మనసులో మల్లెలు, ఎర్రమందారాలున్నాయి
వికసించాలని,
ఆకాశం అందుకోవాలని ఆరాటపడ్డాను
పోరాటం పోరాటం అని అరిచాను

వెలుగు చీకటి సమానం కావచ్చు
చీకటి కనిపిస్తున్నా –
నిరాశ నిప్పురవ్వ కాకుండా
నక్షత్రాలను పరిచాను
వెన్నెల అందించాను

జీవితం సాగరం అందాలు చూడవచ్చు
సామాజిక పరిణామం ప్రపంచీకరణ
అరణ్యంలో చిక్కుకుపోయాను
నేను ఓడిపోయానని చెప్పటంలేదు
పోరాటం ఓడిపోతుందా?
జనం నీడలో

ప్రజల కొరకు జీవించటం
ప్రజల కొరకు మరణించటం
సూర్యునిలాగా
జనం కొరకు పోరాటం
జనం కొరకు వీర మరణం
సూర్యుడు లాగానే

కాలం అన్ని రకాల వుండదు
రంగు రంగుల ప్రపంచం
ఒక దోపిడి ప్రపంచం
దోపిడి ప్రపంచంలో
తెలుగు రాష్ట్రం ఒక భాగం

శ్రమ – ఉత్పత్తి – సంపద
ఎవరూ గుర్తించటంలేదు
వెలుగు లేకపోతే జీవితమెక్కడ?
వెన్నెల లేకపోతే ఆనందమెక్కడ
జీవితం – ఆనందం మరిపించటానికి
ప్రపంచీకరణ విషం

దోపిడిలేని ప్రపంచం కావాలని
చీకటి లేని లోకం కావాలని
జనమంతా పోరాడారు
జనం ముందు వెనుక నేను
అందరమూ ఓడిపోయాం

రాజీపడటం, రాజ్యమేలటం
మేధావుల లక్షణం
సూర్యుడు రాజీపడ్డాడా?
చంద్రుడు లొంగిపోయాడా?

కవులు ప్రజాగానం మర్చిపోయారు
పాలకులు ఇంద్రుడు చంద్రుడు దేవేంద్రుడు
అని పొగడుతున్నారు
జనం శ్రమ చెమట కనిపించదు

దోపిడి ప్రపంచంలో
జనం ఆకలి చావుల మధ్య

సంపద సృష్టించే హస్తాలు
నీరసపడిపోయాయి
నీరసం నిస్తేజం నిర్వీర్యం
జనం బ్రతుకు

నా భారత్‌కు కాదు
నా రైతు కాదు
నా బ్రతుకే కాదు
ప్రపంచ దోపిడీలో –
శ్రమ – సంపద గద్దలపాలు
శ్రమైక్య జీవన సౌందర్యం ఓడిపోయింది

పంట పండించే రైతు ఆకలి తీరదు
శ్రమ చేతులకు అన్నం కరువు
కష్టం సొమ్ము ఎటుపోయింది?
సంపద ఎవరి పాలయ్యింది?

ఆకాశం నిర్మలంగా లేదు
మేఘావృతమయి చీకటిగా వుంది
చుక్కలు తళ తళ మెరవటంలేదు
భయంతో వణికిపోతున్నాయి
సూర్యుడు ఎక్కడ వున్నాడో జాడలేదు

గాలి, నీరు వణుకుతున్న
నియంతృత్వ రాజ్యంలో
ప్రజాస్వామ్యం గద్దలపాలు
నా కవిత ఆకాశం ఎత్తు ఎగిరినా
ఆయుధం కావటం లేదు
నా పాట గాలి మోసిన
పోరాటం కావటం లేదు
ప్రజల పిడికిలి ప్రశ్నకావటం లేదు

ఇది చరమాంక గీతం కాదు
ఉదయగీతం

# సమాజ శాస్త్ర ఆచార్యుడు జె.వి. రాఘవేంద్రరావు మరణం

**ఉస్మానియా** విశ్వవిద్యాలయంలో సోషియాలజీ విభాగంలో ఆచార్యులు జె.వి. రాఘవేంద్రరావు తన 82వ యేట 16-3-2021న హైదరాబాదులో మరణించారు. ఆయన జూన్ 1, 1939న హనుమకొండలో జన్మించారు.

ఆయన విద్యార్థి దశ నుండే పలు ఉద్యమాలలో పాల్గొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల విద్యార్థి యూనియన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. నాగపూర్ యూనివర్శిటీలో ఎం.ఏ, సోషియాలజీ, లక్నో యూనివర్శిటీలో ఎం.ఎ. పొలిటికల్ సైన్స్ చదివారు. ప్రొఫెసర్ లక్ష్మన్న మార్గదర్శకత్వంలో ఉస్మానియా యూనివర్శిటీ నుంచి డాక్టరేటు పొందారు. విద్యార్థి దశలోనే లోహియా సిద్ధాంతాలతో ప్రభావితులయ్యారు. సోషలిస్టు భావజాల వ్యాప్తికి కృషిచేశారు.

ఆయనను 'ప్రజాసాహితి'కి జ్వాలాముఖి పరిచయం చేశారు. ఆయన 'ప్రజాసాహితి'కి అప్పుడు, ఆయన అనేక పుస్తకాలు రాయడమేగాక, లోహియా, గాంధీ, అంబేద్కర్, మార్క్స్ మొదలగువారిపై ఉపన్యసించేవారు. వారి మరణానికి సంతాపం ప్రకటిస్తున్నాం.

# దీప్తినాథ్ 25వ వర్ధంతి



**26-3-1983 25-5-1996**

**దీప్తినాథ్** 26-3-1983న జన్మించాడు. చల్లపల్లి రాజా హైస్కూలులో 8వ తరగతి పూర్తిచేసాడు. తన వయసుకు తగ్గ ప్రజాఉద్యమ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనేవాడు.

మెదడులో **మెనింజైటిస్** వ్యాధితో- 1996 మే 25న దీప్తినాథ్ తన 14వ ఏటనే మరణించాడు.

అతని తల్లి గుత్తా నిర్మలాదేవి, తండ్రి ముప్పాళ్ళ భార్గవశ్రీ. వీరు **'ప్రజాసాహితి' శాశ్వతనిధికి** 25 వేల రూపాయలు విరాళం 2012లో అందజేశారు. వారికి కృతజ్ఞతలు. దీప్తినాథ్‌ను 25వ వర్ధంతి సందర్భంగా జ్ఞాపకం చేసుకుంటున్నాం. ప్రజాసాహితి

# కళ ఎవరికోసమని ప్రశ్నించిన 'మెఫిస్టో' (1981)





– బాలాజీ (కోల్‌కతా)

**సుప్రసిద్ధ** హంగేరియన్ దర్శకుడు ఈస్త్వాన్ జాబో 1981లో నిర్మించిన సినిమా 'మెఫిస్టో'. జాబో పేరు చెప్పగానే గుర్తొచ్చే సినిమా ఇది. సినిమాకు మూలం జర్మన్ రచయిత క్లాస్ మాన్ ఇదే పేరుతో రాసిన నవల. ఈ నవలకు నాటక రూపాలు కూడా చాలా వచ్చాయి. ఫాసిస్టు జర్మనీలో హెండ్రిక్ హాఫ్గెన్ అనే రంగస్థల నటుడి అంచెలంచెల ఎదుగుదలను చెబుతుంది ఈ కథ. నిజజీవిత నటుడు గుస్తఫ్ గ్రుంజెన్స్ జీవితం ఆధారంగా రచయిత ఈ నవలను రాశాడు. ప్రభుత్వాధినేతలకూ, నటులకూ మధ్య ఉండే గమ్మత్తైన సంబంధాన్ని వివరిస్తుంది ఈ కథ. దేశాన్ని నియంతృత్వం కబళిస్తున్నప్పుడు 'కళాకారుడా! నీవెటువైపు?' అని ప్రశ్నిస్తుంది.

**సినిమా కథ :**

అది 1920ల నాటి జర్మనీ. చిన్న ఓడరేవు పట్టణం హంబుర్గ్. హంబుర్గ్ ఆర్టిస్ట్స్ థియేటర్లో నటుడు, దర్శకుడు హెండ్రిక్ హాఫ్గెన్. అతడితో పాటు ఒట్టో ఉల్రిచ్స్, హన్స్ మిక్లాస్ తదితరులు ఆ థియేటర్ను నమ్ముకుని స్ట్రగుల్ చేస్తున్నారు. ప్రజల్ని చైతన్యపరచడానికి "రివల్యూషనరీ థియేటర్" అవసరమని భావిస్తారు ఆ మిత్రబృందం. హెండ్రిక్ అహంభావి. అందర్నీ మించినవాడిలా ప్రవర్తిస్తూ వుంటాడు. బెర్లిన్ నటి డోరా మార్టిన్ ప్రదర్శన చూడకుండానే 'మీ నటన అద్భుతం' అని అభినందించి దొరికిపోతాడు. హన్స్ మిక్లాస్ నాజీ పార్టీ సమర్థకుడు. తోటి యూదు నటుల్ని అవమానపరుస్తుంటాడు. అందుకే అతడ్ని హెండ్రిక్ నాటక కంపెనీ నుండి బహిష్కరిస్తాడు.




హెండ్రిక్‌కి డాన్సు నేర్పే అమ్మాయి జూలియెట్. ఆమె తల్లి ఆఫ్రికన్ కావడం వల్ల ఆమె నల్లగా వుంటుంది. అయినా ఆమెను ప్రేయసిగా భావిస్తాడు. సినిమా ఆరంభంలో అతడు సోషలిస్టు. కానీ సినిమా ఆఖరయ్యేసరికి నాజీల సాంస్కృతిక బానిస. ఈ పరిణామ క్రమానికి కారణం వేగంగా పైకెదగాలన్న అతడి బలమైన ఆకాంక్షే.

చిన్న వూరి నటుడిగా మిగిలాననీ, తగినంత గుర్తింపు రావడంలేదనీ అతడి బెంగ. మహానగరంలో పెద్ద స్టేజిపై 'మెఫిస్టో' లాంటి పాత్ర వేసి వేలాది మందిని ఏకకాలంలో మెప్పించాలన్నది అతడి కల. ఆర్థికంగానూ ఎదగాలి. ఆ కల సాధించడానికై అధికార పార్టీ పెద్దాయన కుమార్తె బార్బరాను అర్జెంటుగా ప్రేమలో పడేసి పెళ్లిచేసుకుంటాడు. మామయ్య, యూదు నటి డోరా మార్టిన్ రికమండేషన్లతో బెర్లిన్ స్టేట్ థియేటర్లో ఉద్యోగం సంపాదిస్తాడు. అతడి సంపాదన మూడు రెట్లు పెరుగుతుంది. భర్త అవకాశవాదాన్ని గ్రహించిన బార్బరా అతడికి దూరంగా వుంటుంది. హెండ్రిక్ జూలియెట్ కోసం బెర్లిన్‌లో ఒక ఇల్లు అద్దెకు తీసుకుంటాడు. వారాంతాల్లో ఆమె వద్దకు వెళ్తుంటాడు. అవకాశాల్ని పసిగట్టి వినియోగించుకోవడం తెలిసిన హెండ్రిక్ చివరికి 'ఫౌస్ట్' నాటకంలో తను కోరుకున్న 'మెఫిస్టో' పాత్రను కైవశం చేసుకుంటాడు. సినిమాల్లోనూ అవకాశాలు సంపాదిస్తాడు.

హెండ్రిక్ స్పెయిన్‌లో ఒక సినిమా షూటింగులో వుండగా జర్మనీలో నాజీలు అధికారంలోకి వస్తారు. అందుకే నాజీల బ్లాక్‌లిస్టులో తన పేరు ఉన్నందున షూటింగు తర్వాత జర్మనీకి కాకుండా పారిస్‌కు వెళతాడు హెండ్రిక్. పారిస్‌లో అతడి భార్య సెటిలై వుంది. పారిస్‌లో ఉండగా హంబర్గ్ థియేటర్లోని పాత స్నేహితురాలి నుండి అతడికో ఉత్తరం వస్తుంది. "నాజీ ప్రైమ్ మినిస్టర్‌కి కాబోయో భార్య లొట్టే మీ నటనాభిమాని. ఆమె వేస్తున్న తొలినాటికలో ఆమె సరసన నటించడానికి అంగీకరిస్తే, సురక్షితంగా జర్మనీకి రావచ్చు. ప్రైమ్ మినిస్టర్ సంరక్షణలోనే బెర్లిన్‌లో వుండొచ్చు. బెర్లిన్ నీ కోసం ఎదురుచూస్తోంది" – అని ఆ ఉత్తరంలో సూచిస్తుంది ఆ స్నేహితురాలు ఏంజెలికా. ఆ ప్రస్తావనను ఆనందంగా ఒప్పుకుంటాడు హెండ్రిక్. ఏ ఆదర్శాలూ అతడికి అడ్డురావు. 'ప్రవాసంలో వుంటూ నాజీ వ్యతిరేక పోరాటం చెయ్యి' అంటూ భార్య, స్నేహితులు చెప్పిన మాటల్ని పెడచెవిన పెట్టి బెర్లిన్‌కు బయల్దేరుతాడు. "నేనో నటుడ్ని. నా పని నటించడం వరకే. ప్రభుత్వాలు వస్తాయి, పోతాయి. నాకు జర్మనీ తప్ప మరో భాష రాదు. విదేశాల్లో అనామకుడిలా వుండేకంటే మాతృగడ్డపై మాతృభాషలో నటించాలనుకోవడం నేరమెలా అవుతుంది?" – అని సర్దిచెప్పు కుంటాడు. అది ఇతరుల కోసం విన్పించే వాదన మాత్రమే. అసలు విషయం బెర్లిన్‌లో చవిచూసిన లైమ్‌లైట్‌ను వదులుకోలేక పోవడం! 'కమ్యూనిస్టు కార్యకలాపాలు ఒకప్పటి దూకుడు తప్పిదాలు' అన్నంత సులువుగా ప్రైమ్ మినిస్టర్‌కి సర్దిచెప్పి తన గతాన్ని కడిగేసు కుంటాడు. లొట్టే సిఫారసుతో మళ్లీ 'మెఫిస్టో' పాత్రను దక్కించుకుంటాడు. తన అభినయంతో ప్రైమ్ మినిస్టర్ను మెప్పించి అతడి ముద్దుల 'మెఫిస్టో' అయిపోతాడు.

కమ్యూనిస్టులు, యూదుల ఊచకోత ఒకవైపు సాగుతూ వుంటే, నాజీల చేతి నెత్తుటి మెతుకులు తింటూ అంచెలంచెలుగా పైకెదుగుతాడు హెంగ్రిక్. సంస్కృతి గురించి అతడి అవగాహన వేరు, నాజీలు విధిస్తున్న షరతులు వేరు. అయినా తన ఆదర్శాన్నీ, అంతరాత్మనూ బలిపెట్టి జాతీయ రంగస్థల అధ్యక్షుడి హోదాకు చేరుతాడు. కాన్సెంట్రేషన్ క్యాంపులో పడివున్న పాత మిత్రుడు ఒట్టో ఉల్రిచ్స్‌ను ప్రైమ్ మినిస్టర్ మద్దతుతో విడిపించి, అతడికి స్టేట్ థియేటర్లో ఉద్యోగం ఇప్పిస్తాడు. ఇదిలావుంటే, ఒకప్పటి నాజీభక్తుడైన హన్స్ మిక్లాస్ కథ మరో విధంగా మలుపు తిరుగుతుంది. తను కోరిన 'అచ్ఛేదినాలు' ఇవి కావని కనువిప్పు కలుగుతుంది మిక్లాస్‌కు. నాజీ దురాగతాలకు వ్యతిరేకంగా థియేటర్ నటుల సంతకాల సేకరణ మొదలుపెడతాడు. హెంగ్రిక్ ఇచ్చిన చిన్న సమాచారం మిక్లాస్ చావుకి కారణమౌతుంది. తోటి నటులు అతడ్ని ముద్దాయిలా చూస్తారు. థియేటర్ మొత్తం గాలించి మరీ నాజీ వ్యతిరేక కరపత్రాలను ఏరి, వాటిని రహస్యంగా తగలబెట్టే దృశ్యం చూస్తే అతడు నాజీలకు ఎంత నమ్మకస్తుడిగా మసలుకోవాలనుకుంటున్నాడో మనకర్థమౌతుంది.

మొదటి భార్య బార్బరా అతడికి విడాకులు ఇచ్చేస్తుంది. జర్మన్ జాతి స్వచ్ఛత సిద్ధాంతానికి జూలియెట్ అడ్డుకావడంతో ఆమెను అరెస్టు చేయించి, మళ్లీ తనే ఆమెను కాపాడి పేరిస్‌కి పంపిస్తున్నట్టు నాటకమాడతాడు. తోటి నటితో జరిగిన రెండో పెళ్లికి స్వయానా ప్రైమ్ మినిస్టర్ రావడం అతడికి చాలా గర్వకారణంగా వుంటుంది. ఉల్రిచ్స్ మరోసారి రహస్య కమ్యూనిస్టు కార్యకలాపాల్లో పాల్గొని, మళ్లీ అరెస్టవుతాడు. అతడి ప్రాణభిక్ష కోసం రెండోసారి ప్రైమ్ మినిస్టర్ దగ్గరకు వెళతాడు హెంగ్రిక్. 'నువ్వీ విషయాల్లో తలదూర్చకు. ఒక విశ్వాసఘాతకుడి కోసం సిఫార్సు తీసుకొచ్చావా? నువ్వు కేవలం ఒక నటుడివన్న సంగతి గుర్తుంచుకో! గెటౌట్!' అని ప్రైమ్ మినిస్టర్ అతడ్ని కసిరేసి గెంటేయడంతో, హెంగ్రిక్‌కి తనేమిటో, ఆ సెటప్‌లో తన స్థానమేమిటో అర్థమౌతుంది. ఇంకా కొంత వివేకం మిగిలివున్న అతడికి తన తప్పు తెలుస్తుంది కానీ ఇక చేసేదేం లేదు. ఉల్రిచ్స్ మరణవార్త విన్న తర్వాత అతడి అంతర్మథనం మరింత పెరుగుతుంది. ప్రైమ్ మినిస్టర్ తనను 'మెఫిస్టో' అని ప్రేమగా పిలుస్తుంటే ముగ్ధుడయ్యేవాడు. కానీ తను కాదు 'మెఫిస్టో'! ఆ నాజీ ప్రభువే నిజమైన 'మెఫిస్టో'. తను ఆ 'మెఫిస్టో' దయ్యం దగ్గర ఆత్మను తాకట్టుపెట్టిన 'ఫౌస్ట్' మాత్రమే! అయినా – "తనేం చేయగలడు! తనో మామూలు నటుడు మాత్రమే."

అతడి తదుపరి ప్రదర్శన షేక్స్‌పియర్ 'హెమ్లెట్'. నిరాసక్తంగానే, నీరసంగానే అభినయం చేస్తాడు. కానీ అది కూడా తెగ నచ్చేస్తుంది ప్రైమ్ మినిస్టర్‌గారికి. అతడు ప్రశంసాపూర్వకంగా హెంగ్రిక్‌ను ఒక స్టేడియంకు తీసుకువెళతాడు. 'ఈ స్టేడియంలో నీ ప్రదర్శన ఏర్పాటు చేస్తాను. లక్షమంది జనాలు నీ నటన తిలకిస్తారు. వెళ్లు! నువ్వు నీ యోగ్యతకు తగ్గ స్థానంలోకి వెళ్లు!' – అంటూ హెంగ్రిక్‌ను స్టేడియం మధ్యకు పంపిస్తాడు. అతడికి సర్‌ప్రైజ్ ఇస్తూ, అతడిపై నలువైపుల నుండి ఫ్లాష్ లైట్లు వేయిస్తాడు. 'ఈ లైమ్‌లైటును నువ్వు ఎంజాయ్ చేస్తున్నావా?' అని ప్రైమ్ మినిస్టర్ అరుస్తుంటాడు. మిరుమిట్లు గొలిపే ఆ కాంతికి అతడి కళ్లు బైర్లు కమ్ముతాయి. ఏదీ కానరాక, అటూ, ఇటూ పరిగెడుతుంటాడు. ఆత్మను అమ్ముకున్నాక లభించిన లైమ్‌లైట్ అతడ్ని అంధుడ్ని చేసేసింది. కళ్లకు చేతులు అడ్డం పెట్టుకుంటూ, "వీరు నా నుంచి ఏం కోరుకుంటున్నారు? నేను కేవలం నటుడ్ని మాత్రమే!" – అంటూ తనలో తాను గొణుక్కుంటాడు.

ఈ సినిమాలో ప్రధాన పాత్రను వేసిన క్లాస్ మారియా బ్రాండవర్ చాలా అద్భుతంగా నటించాడు. అతని మనోభావాల మార్పులను చూపే క్లోజప్పులు ఈ సినిమాలో చాలా వున్నాయి. ఆస్కారు అవార్డు గెల్చుకున్న మొట్టమొదటి విదేశీ సినిమా ఇదే. వ్యాపారపరంగా కూడా ఆమెరికా కెనడాల్లో అత్యధిక కలెక్షన్లు సంపాదించిన హంగేరియన్ సినిమా. కాన్స్‌లో ఈ సినిమాకు ఉత్తమ స్క్రీన్‌ప్లే అవార్డు దొరికింది. ఫిల్మ్ సొసైటీలు ఈ సినిమాను చాలాసార్లు ప్రదర్శించాయి. నియంతృత్వాలు రాజ్యమేలే ప్రతిసారీ ఈ కథ ప్రాసంగికమౌతూ వుంటుంది. 'కళాకారుడా! నీవెటువైపో తేల్చుకో' అని ఘోషిస్తుంది ఈ కథ.

ఈ కథను బెంగాలీ నాటకంగా ప్రముఖ రంగస్థల, సినీ దర్శకుడు సుమన్ ముఖోపాధ్యాయ చాలా ఏళ్లుగా ప్రదర్శిస్తున్నాడు. 2002లో గుజరాత్ ఊచకోత సమయంలో ఒకసారి, 2012లో తృణమూల్ అత్యాచారాలకు వ్యతిరేకంగా మరోసారీ ప్రదర్శించారు. మతతత్త్వశక్తులు బెంగాలును కైవశం చేసుకోవాలని చూస్తున్న ఎలక్షన్ల సీజన్లో మూడోసారి ఈ నాటకం వేస్తున్నారు. ఎలక్షన్ల ముందు వేస్తున్న మూడు షోలూ హౌస్‌ఫుల్ అయ్యాయి. ఈ నాటకంలో యూదుల్ని గొర్రెల్లా కాన్సెంట్రేషన్ క్యాంపులకు తరలిస్తున్న విషయాన్ని సంభాషణల్లోనే కళ్లకు కట్టారు. "జైలులో ఒక కమ్యూనిస్టు రంగస్థల నటుడ్ని ఉరితీసినపుడు 6000 మంది తోటి ఖైదీలు అతడి కోసం ఒకేసారి గొంతెత్తి పాటపాడారు. ఆ క్షణంలో అతడెంత మహానటుడి స్థాయికి ఎదిగాడో అర్థమైందా?!" – అంటూ ఒక స్నేహితురాలు హెంగ్రిక్‌కు చెబుతున్న దృశ్యం ఒకటి ఈ నాటకంలో వుంది. ఆ మాట విన్నప్పుడు "ఆ అమరుడి ముందు తను మరుగుజ్జే, ప్రజల కోసం పోరాడి, మరణించినవాడే మహానటుడు" అని భావిస్తూ పశ్చాత్తాపపడతాడు హెంగ్రిక్. నాటకంలో ఈ పాత్రను సినీ నటుడు అనిర్బాన్ భట్టాచార్య చాలా అద్భుతంగా నటించాడు. ఈ నాటకం ఆఖర్లో 'బెల్లా చావ్' ఇటలీ పోరాటగానం నేపథ్యంలో బ్లాక్ లైవ్స్ మేటర్, అరబ్ స్ప్రింగ్, ఎన్ఆర్‌సీ – సిఏఏ వ్యతిరేక పోరాటం, రైతు ఉద్యమాలు, గౌరీ లంకేశ్ హత్య, రోహిత్ వేముల హత్య తదితర వీడియోల మాంతాజ్‌ను చూపించారు. దాదాపు 1500 మంది ప్రేక్షకులు పూనకం వచ్చినంతలా చైతన్యవంతులై హాలు నుంచి బయటకు వస్తారు. సినీ, నాటకరంగాల్లో ప్రసిద్ధులైన చాలా మంది నటులు కేవలం పది రోజుల రిహార్సల్స్‌తో ఈ నాటకాన్ని ప్రదర్శించారు.

ఎన్ని దాడులు జరిగినా, తమ ఆత్మను తాకట్టు పెట్టకుండా కొందరు కళాకారులు ప్రజానుకూల స్వరాలను వినిపిస్తున్నారు. వారికి సెల్యూట్ చేస్తుందీసినిమా. ✸

# అమరవీరులందరికీ విప్లవ అరుణారుణ వందనాలు

ఆంగ్లమూలం : **పంకజ్ ప్రసూన్**

తెలుగు : **కొత్తపల్లి రవిబాబు**

(స్వేచ్ఛ, సమానత్వం, దోపిడీరహిత ప్రపంచం కోసం ప్రాణత్యాగం చేసిన అమరులందరికీ మన విప్లవ అరుణారుణ వందనాలు)

**నిరంకుశులకు,** సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా
కవిత్వం ఒక ఆయుధంగా వుంటుంది.
టునీసియాలో, ఈజిప్టులో, సిరియాలో
యెమెన్‌లో, బహ్రైన్‌లో, మలేసియాలో
స్వాతంత్ర్య పతాకాన్ని ఎత్తిపట్టిన వారికి,
అన్యాయానికీ, దోపిడీకి వ్యతిరేకంగా
ఒక విభిన్నమైన బాణీలో
విప్లవ సంగీతాన్ని వినిపించినవారికి,
సత్యమే మరణిస్తుందని బుకాయించినవారికి
అది చెబుతోంది.
సత్యమే సదా సజీవంగా వుంటుందని!

హుందాగా జీవించాలనే
ఆశావసంతాన్ని కలగన్నవారికి
మత్తుగొలిపే ఆ ఆమని దగ్గరకు
స్వాగతం -
నేను నమస్కరిస్తున్నా
మేము నమస్కరిస్తున్నాం
సత్యం కోసం అమరులైనవారికి
వందనాలర్పిద్దాం!

**869**
జాంబ్ తిరుగుబాటుకు[1] దండాలు
ఐదు లక్షల బానిసలకు
నాయకత్వం వహించి
**ఆలీ ఇబ్న్ మహమ్మద్**
చిన్న చిన్న తిరుగుబాట్ల పరంపరతో
ఇరాన్ నుండి ఇరాక్ వరకు గల
శక్తిమంతమైన, నిరంకుశ, అవినీతిలేని
సామ్రాజ్యాలను
వణికించేసాడు 9వ శతాబ్దంలో

**1579**
**గాస్పర్ యంగా**[2]కు వందనం
ఆఫ్రికాలోని గాబన్ నుండి తెచ్చిన బానిస
**బింరా** రాజు పుత్రుడు
తన బానిస మిత్రులతో కలసి
స్పానియార్డ్స్‌కు వ్యతిరేకంగా
మెక్సికోలో బానిసల తిరుగుబాటుకు
నాయకత్వం వహించాడు!
శత్రువును ఓడించాడు
బానిసలకు సొంత పట్టణాలను నిర్మించాడు
**యంగా**కు వందలాది వందనాలు

**1712**
బానిసలైన ఆఫ్రికన్లపై అమానుష చిత్రహింసలు
వుంచారు వారిని దారుణమైన పరిస్థితుల్లో
కోపోద్రిక్తులైన ఇరవై ముగ్గురు బానిసలు
ధైర్యంగా ముందుకురికారు
బుల్లెట్ల వర్షం కురిపించారు
తొమ్మండుగురు తెల్లవారిని చంపేసారు
నేరస్తులైన తెల్ల వలసదారులు
తమ కిరాయి సైన్యంతో
డెబ్భైమంది నల్లవారిని పట్టుకొని
వారిలో 21 మంది తిరుగుబాటుదారులను
నిప్పుపై కాల్చిన కోళ్ళలాగా
సజీవ దహనం చేశారు.
అది మొట్టమొదటి బానిస తిరుగుబాటు!
సజీవ దహనమైన
ఆ 21 మందికి మా వందనం

**1757**
భయభ్రాంత పాలన సాగించింది
ఈస్ట్ ఇండియా కంపెనీ
వారి అమానుష, అనాగరిక పాలన
సహించలేక ఫకీర్లు, సన్యాసులు ఎదురు తిరిగారు
సాయుధులయ్యారు
దస్‌నామా నాగాలు, మదారి సూఫీలు,
హిందువులు, ముస్లిములు -
సాధువులందరూ
విదేశీ పాలన నుండి విముక్తి కొరకు
తొలి సమరానికి శ్రీకారం చుట్టారు
జల్పాయిగురికి చెందిన
బైకుంతపూర్ అడవుల్లో,
ముర్షిదాబాద్ పరిసరాల్లో
150 మంది ఫకీర్లు చనిపోయారు
సన్యాసి - ఫకీర్ తిరుగుబాటుకు వందనం
**మజ్నూషా**[3], **భవానీ పాథక్**[4], **దేవి చౌధురాణి**[5] లకు వందనం

**1798**
మిద్నపూర్, బింకూర, జంగల్ మహల్‌లోని
అటవీ భూముల్లో
ఆటవికులైన ఆదివాసులు, గిరిజనులు
సారించారు తమ విల్లంబులు
సంధించారు బాణాలను
బ్రిటీషు వలసదారులకు వ్యతిరేకంగా
దొంగలనీ, ఎలుకలు తినేవారని,
పందులనీ, అవమానించబడ్డ వారి తిరుగుబాటుకు
దొంగల తిరుగుబాటని పేరుపెట్టారు
ఆదివాసీలను ఘోరంగా చంపేసారు
వారి నాయకుడు **దుర్జాన్‌సింగ్**కు[6] ను హత్యచేశారు
ఆ తిరుగుబాటుదార్లకు మన వందనం

**1784**
**బాబాతిల్కా మంజీహ్**[7]
నీకు జోహార్,
నీకు వందనం!
భారతదేశ మొట్టమొదటి స్వాతంత్ర్య సమరయోధుడు
వలసదార్లను ఎదురించిన మొదటి యోధుడు
మొదటి పూర్తిస్థాయి యుద్ధాన్ని ప్రకటించినవాడు
మొదటి స్వాతంత్ర్యగేయాన్ని రచించినవాడు
విల్లు, బాణాలతో చంపారు
చెట్టుకు ఉరివేశారు
మనం మరచిపోయిన
ఆయనకు వందనం!

**1787**
మసాచుసెట్స్‌లో రాజభవనాల్లో కులుకుతున్న
దోపిడీదార్లయిన పిల్ల జమీందార్లకు
పీడకలగా మారిన
**షేయాస్**[8] తిరుగుబాటుకు వందనం
వేయిమంది షేయాస్‌లను అరెస్టు చేశారు
ఐదుగురిని చంపేశారు
తిరుగుబాటును అణచివేశారు
కాని 2011లో
మరల న్యూయార్క్‌లో మురికి సంపన్నుల ప్రాంతంలో
ఆక్యుపై వాల్‌స్ట్రీట్ ఉద్యమంగా
ప్రజల కోపాగ్నితో నూతన
అవతారంతో ప్రజ్వరిల్లింది.

**1806 - 1816**
విప్లవ జ్వాలలు
మిద్నపూర్ సాల్ అడవులను చుట్టుముట్టాయి
అవి ఒక దశాబ్దం వరకు మండుతూనే వున్నాయి
ఆ వీరుల్ని ప్రజా శత్రువులు చంపేశారు
**అచల్‌సిన్హా**[9] అతని 200 మంది అనుచరులు
అమరజీవులు -
వారందరికీ వందనం.

**1858**
జోహార్!
సెల్యూట్!
**వీరనారాయణసింగ్ బింజావర్**[10] కి
అది 1856
చత్తీస్‌గడ్ అటవీ ప్రాంతమంతా
గొప్ప కరవు వ్యాపించింది
ఆకలితో చనిపోయారు ప్రజలు
సోనాఖాన్ భూస్వాములు, వర్తకులు
పేదల నుండి కాజేసిన
ధాన్యం తమ గోదాముల్లో దాయగా,
ఆయన నాయకత్వంలో వాటిని లూటీ చేశారు
పేదవారికి ధాన్యాన్ని పంచి పెట్టాడు
భూస్వాములు, వలసదార్లు కుట్ర చేసారు
అతన్ని అరెస్టు చేశారు
బహిరంగంగా ఉరితీసారు!

**1862**
జోహార్!
**యు కియాంగ్ నాంగ్ బా**[11]
ఇంటిపన్నుతో పాటు ఆదాయపన్ను -
తమలపాకులు - వక్కలపై మరో పన్ను
విధించబోతున్న సమయాన
**జైన్‌టియాలు** భీకరంగా తిరగబడ్డారు.
వారి నాయకుడు, మార్గదర్శి
యువకుడైన యు కియాంగ్ నాంగ్ బా
అతనిలా అన్నాడు :
"మానవ జీవితంలో స్వేచ్ఛ
అత్యంత ముఖ్యమైన అంశం
స్వేచ్ఛలేని దేశం
బతికి వున్నట్లే కాదు"
వందలాది జైన్‌టియాలను చంపేశారు
యూకియాంగ్ నాంగ్‌బాను
మోసంతో ఖైదు చేసి
బహిరంగంగా ఉరితీశారు
ఉరికంబం నుంచి ఆయన ప్రవచించాడు
"ఉరికి వేలాడుతూ నా తల తూర్పు వైపు తిరిగితే
వందేళ్ళలోపే మనం విముక్తులవుతాం

పడమరకు తిరిగితే అనంత బానిసత్వమే"
వాస్తవమైంది ఆయన జ్యోతిష్యం
వందేళ్ళలోపే ఇండియా విముక్తిని సాధించుకొంది.

**1885**
జోహార్
ఒక కుగ్రామానికి చెందిన
నలుగురు ముర్మురు సోదరులకు
దుమ్‌కా జిల్లాలోని భగ్నాదిహ్[12] గ్రామంలో
విప్లవకారులే అందరూ
**సిద్ధూ, కన్హూ, చాంద్, భైరవ్‌లు –**
వారి భూమిని కబ్జా చేశారు
బ్రిటీష్ వలసదార్లు, వడ్డీ వ్యాపారులు, జమీందార్లు
వారి స్త్రీలనవమానించారు
అమాయక సంతాలులను బానిసలుగా మార్చారు
సంతాలులను
మోసం చేశారు
అవమానించారు
సిద్ధూ, కన్హూ, చాంద్, భైరవ్‌ల
నాయకత్వంలో
సంతాల్ తిరుగుబాటు ప్రారంభమైంది
సంతాల్ ప్రాంతమంతా వ్యాపించింది
నేరస్తులకు పీడకలగా పరిణమించింది
బ్రిటీషు పాలనా ఛాయలను నాశనం చేసింది
ఆ నేరస్తులు మోసం చేసి
సిద్ధూ, కన్హూ, చాంద్, భైరవ్‌లను
చంపేశారు.
పదివేలమంది సంతాలులను చంపేశారు
తిరుగుబాటును అణచివేశారు.
అదే హుల్ విప్లవం
... అయితేనేం –
సంతాల్ తిరుగుబాటు గాధ ఎన్నటికీ సజీవమే!

**1871**
అది కాంగోలోని న్యాన్‌గ్వే[13] మార్కెట్
1500 మంది ప్రజలు చేరారు అక్కడ
వారిలో అత్యధికులు స్త్రీలు
నల్గురు అరబ్ బానిస యజమానులు
ప్రవేశించారు ఆ మార్కెట్‌లోకి
భయభ్రాంతులై పారిపోతున్న
ఆ ప్రజలపై పేల్చారు తుపాకులు
చంపేశారు 600 మంది అమాయకులను
చనిపోయిన వారందరికీ వందనాలు.

**1900**
విప్లవ అగ్నిపర్వతం పేలింది
వేడివేడి లావా ప్రవహించింది
ఉల్గులాన్ అనే ముండా తిరుగుబాటుకు
**బిర్సాముండా**[14] శ్రీకారం చుట్టాడు
బిర్సాముండా – ధర్తీ అబా – జాతిపిత!
డిక్కులను (బయట నుంచి వచ్చినవారిని)
కాల్చివేస్తూ,
పోలీసు స్టేషన్లనూ, చర్చీలను తగలబెడుతూ
వడ్డీ వ్యాపారుల, జమీందారుల
ఆస్తులపై దాడులు చేస్తూ
బిర్సా రాజ్యపు శ్వేత పతాకాన్ని
సమున్నతంగా ఎగరేశాడు
వలస ప్రభుత్వం వణికిపోయింది
దంబరీ కొండలపై సమావేశమైన
ముండా యోధులపై
దాడిచేశారు బ్రిటీషు ముష్కరులు
వేలాది స్వాతంత్ర్య సమరయోధులను చంపేశారు
బిర్సాముండాను పట్టుకున్నారు
25వ ఏటనే
జైలులో చంపేశారు –
అతణ్ణి హతమార్చారు –
కాని –
ఉల్‌గులాన్ – విప్లవం
కొనసాగుతుంది –
వర్ధిల్లాలి ఉల్‌గులాన్
ధర్తీ అబా – జాతిపిత బిర్సాముండా వర్ధిల్లాలి!

**22 జనవరి 1905**
పుతిలోవ్ కర్మాగారపు
కార్మికుల దీన, విషాద పరిస్థితి చూసి
చలించిపోయిన మతాధికారి
**జార్జి గేపన్**[15] కు వందనం!
అది జార్ చక్రవర్తుల రష్యా
క్రూరుడు, నిరంకుశుడు, నియంత, అణచివేతదారుడు
రెండవ నికొలస్ జారీచేశాడు ఆజ్ఞ
కార్మికులు పన్నెండు గంటలు పనిచేయాలని
శనివారమైతే పదిగంటలే అని
అన్నిటి ధరలూ పెంచేశాడు
కార్మికుల కూలీ మాత్రం తగ్గించేశాడు
గేపన్ అనే అమాయకుడు
ఇదంతా జార్‌కు తెలియదనుకున్నాడు
ఇవన్నీ క్రింది అధికారుల ఆగడాలనుకున్నాడు

ఫాదర్ గేపన్
వేలాది కార్మికులను సమీకరించి
జార్‌గారి వింటర్ పాలెస్‌కు
విజ్ఞప్తి చేయడానికెళ్ళగా
వారికి బుల్లెట్ల వర్షం ఆహ్వానం పల్కింది
తూటాలు వేలమందిని బలిగొన్నాయి
కార్మికుల నోరు నొక్కేశారు
ఉద్యమం విఫలమైంది
కాని అది ఈ విషపు రాచరికాన్ని
బ్రద్దలు గొట్టిన విప్లవానికి
ఇంధనాన్ని సమకూర్చింది

**25 అక్టోబరు 1917**
20వ శతాబ్దపు మహావిప్లవం
కార్మిక, కర్షక విప్లవం
లెనిన్, స్టాలిన్ నేతృత్వంలో
అక్టోబరు విప్లవం
ఆ విప్లవానికి అరుణారుణ వందనం!
విప్లవ కవిత్వంలో కొత్త పుటలు చేరాయి
అవి అరుణారుణ పుటలు
రష్యా, చైనా, సగం యూరప్
క్యూబా, వియత్నాం, లావోస్
అన్నీ అరుణారుణం
వారందరికీ
ఎర్రెర్రని దండాలు!

**1921**
ఇస్తాంబుల్ వీధుల్లోకి వ్యాపించింది విప్లవం
విప్లవ సైన్యం కవాతు చేసింది
వారి నాయకుడు ముస్తఫా సూఫీ[16]
నియంత కిరాయి హంతకులు
కత్తితో పొడిచి అతన్ని చంపేశారు
శవాన్ని నల్ల సముద్రంలో పడేశారు
నల్ల సముద్రం ఎరుపెక్కింది
ముస్తఫా సూఫీకి సలాం!
మార్హబా! వందనం!

**1923**
స్వేచ్ఛాజ్వాల
ఆంధ్రప్రదేశ్‌లో దావానలమై చెలరేగింది
రంప విప్లవానికి వందనం
చింతపల్లి అల్లూరి సీతారామరాజుకు
వందనం!

**1950**
గుడ్ ఆఫ్టర్‌నూన్!
**సూడిస్‌మాన్**[17]కు వందనం
గొప్ప సమీకరణదారుడు!
ఓడిన 20 మిలియన్లను
చురుకైన విప్లవ సైన్యంగా సమీకరించాడు
కానీ ఇండోనీషియాలో
విప్లవం విఫలమైంది
వేలాదిమంది కామ్రేడ్లు
ఉచకోతకు గురయ్యారు
సూడిస్‌మాన్‌ను ఉరికంబం ఎక్కించారు.

**1952**
కెన్యా అడవుల నుండి
ఒక నినాదం ప్రతిధ్వనించింది
"మజ్నుగు విండే ఉలాయా
మాఫ్రికా అపాతే ఉహురు"
"ఐరోపా వారు ఐరోపాకు తిరిగిపోవాలి
ఆఫ్రికన్లు తమ స్వేచ్ఛను తిరిగి పొందాలి"
ముసలీ, ముతకా, పిల్లా, జెల్లా
పిడుగుల్లా గర్జించారు
యుమా! యుమా!
వెళ్లిపొండి! వెళ్ళిపొండి!
– హద్దులు లేని ఉద్రేక ప్రదర్శన
అణచివేతకు, అన్యాయానికి గురైన
జాతీయవాదుల స్పందన!
'మావ్, మావ్', స్వాతంత్ర్య సమరయోధులు
వలస సంకెళ్ళ నుండి
కెన్యాను విముక్తి చేస్తామని ప్రతినబూనారు
అది మావ్ మావ్ తిరుగుబాటు
హబాం!
వందనం
ఆరుగురు **కపెన్ గురియా**[18] లకు
బిల్దాద్ కగ్గియా, కుంగు కరంబూ,
జోమో కెన్యట్టా, ఫ్రెడ్ కుబాయ్,
పాల్‌నెడీ, అచియాంగ్ ఒనెకో!
మీకు మా సెల్యూట్!

**1961**
**పాట్రిస్ లుముంబా**[19]కు సెల్యూట్!
ప్రజాస్వామికంగా మొట్టమొదటిసారి
ఎన్నికైన కాంగో ప్రధానమంత్రి
ఆఫ్రికన్ల అస్తిత్వం కోసం పోరాడినవాడు
ఆయన ఇలా అన్నాడు :

"ఆఫ్రికన్ సోదరులారా!
వెయ్యేళ్ళపాటు జంతువుల్లా బాధలు పడ్డారు
మీ చితాభస్మం ఎడారుల్లో వీచే
గాలిలో కలసి పోయింది
మీ నియంతలు మాత్రం విలాసవంతమైన
మాయా దేవాలయాలు కట్టుకున్నారు
మీ ఆత్మ సంరక్షణ కోసం, మీ బాధలు తగ్గించడానికి
అనాగరికులకు పిడిగుద్దుల హక్కు
తెల్లవారికి కొరడాదెబ్బల హక్కు
మీకైతే చనిపోయే హక్కు
మీరు ఏడ్వగలరు కూడా
నేరస్థ వలస దేశం బెల్జియం
కాంగోలోని విలువైన కాపర్, బంగారం, యురేనియంలను
దోపిడీ చేసినవారు,
ప్రజాస్వామ్యమని జబ్బలు చరుచుకునే
అగ్రరాజ్యమైన అమెరికాతో కుట్ర చేశారు
లుముంబాను అరెస్టు చేశారు
చితకబాదారు
చిత్రహింసలు పెట్టారు
చెట్టు వద్ద నిలబెట్టి
అతనిపై కాల్పులు జరిపి చంపేసారు
అతని శవాన్ని ముక్కలుగా నరికి
యాసిడ్ పీపాలో పడేసి కరగించివేశారు
ఈ నేరస్థులు ఇంకా
ఇంకా ప్రజాస్వామ్య సూత్రాలు,
ప్రవచించడమూ,
ప్రజాస్వామ్య గేయాలు
ఆలపించడమూ
సిగ్గుచేటైన విషయం.

**11 సెప్టెంబరు 1973**
చిలీ స్టేడియంలో
చిత్రహింసలకు గురిచేస్తూ
అతని వ్రేళ్ళు నరుకుతూ వుంటే
అతని జీవితంలో ఆఖరిపాట రాశాడు
అది అసంపూర్తిగా మిగిలిపోయింది
నెత్తురోడుతున్న వ్రేళ్ళద్వారా
వచ్చిన అంతిమ గీతం అది –
బుల్లెట్ల వర్షం శరీరంపై కురుస్తుండగా
అతను రాశాడు
భయభ్రాంత వాతావరణం గురించి
నేను పాడి తీరాల్సిన పరిస్థితిలో
పాడటం ఎంత కష్టం!
మౌనమూ,
బాధామయ అరుపులూ
నా పాటకు ముగింపు
మహోన్నతుడు
**విక్టర్ జారా**[20]కు వందనం

**17 డిసెంబరు 2010**
**మహమ్మద్ బౌజిజి**[21]
వీధుల్లో తిరిగి అమ్ముకునేవాడు –
టునీసియాలో చిన్న పట్టణం సిదిబౌజిత్‌లో
అతి పేదలకు ఆయన పండ్లు, కూరగాయలు
ఉచితంగా ఇచ్చేవాడు
అతనిపై ఆప్యాయతతో ప్రజలు అతన్ని
తీపిహల్వా – బస్‌బూసా అని పిలిచేవారు
నిజానికి అతనే బీదవాడు
ఆర్గురు పిల్లల కుటుంబం
వ్యాపారం చేసుకునే అనుమతి లేదు
పోలీసులకు లంచం కావాలి
మున్సిపల్ ఉద్యోగులకు లంచం కావాలి
అతడి సామాను స్వాధీనం చేసుకున్నారు
వేధింపులు, అవమానాలతో విసిగి, వేసారిపోయాడు
ఒక గ్యాసు పీపా సంపాదించాడు
నట్టనడిరోడ్డు మధ్య నిలబడి
"నేనెలా బతకాలో చెప్పండి" అంటూ అరుస్తూ
తనకు తానే నిప్పంటించుకున్నాడు
చనిపోయాడు.
అతని అంతిమయాత్రకు వచ్చారు
ఐదువేలమంది ప్రజలు
కోపోద్రిక్త జనం నినదించారు
"నీ చావుకు ప్రతీకారం తీర్చుకుంటాం!
ప్రస్తుతం నీ మరణానికి విలపిస్తాం!
నీ మరణానికి కారణమైనవారు
విలపించేట్లు చేస్తాం"
ఆత్మగౌరవ విప్లవం – థవ్రాట్–అల్–కరా–మహ్
ప్రారంభమైంది
దానినే పిలిచారు జాస్మిన్ విప్లవం అని
టునీసియా జాతీయ పుష్పం – మల్లెపూవు
ఈ మల్లె విప్లవం
నియంత జివి ఎల్ అబిదిని బెన్ ఆలీని
కూలద్రోసిన
మహమ్మద్ బౌజిజి
'వా అలేకుం సలాం'!

**17 జూన్ 2011**
సలామ్!

మెరుగైన మారిటోనియా[22]కోసం
ప్రజలందరికీ సమానమైన న్యాయం అందాలని
అధ్యక్ష ప్రాసాదం ముందే, నౌక్‌ఛోట్[23]లో
సజీవ దహనమయ్యాడు
**యాకూబ్ దహేబ్**[24]
దానితో
ఈజిప్టులోనూ, అరబ్ ప్రపంచంలోనూ
విప్లవాలు ప్రారంభమయ్యాయి.
సలాం నీకు
ఈజిప్ట్‌కు చెందిన **ఆస్మా మహ్‌ఫౌజ్**[24]!
సలాం నీకు సిరియాకు చెందిన
**రజాన్ జైటోవా**[25]!
సలాం నీకు యెమెన్‌కు చెందిన
**తవాక్కుల్ కర్మాన్**![26]
ఇలా ఎందరెందరో

విప్లవ జ్వాల మండుతూనే వుంటుంది
ఎన్నటికీ ఆరిపోదు –
కొన్నాళ్ళు నివురుగప్పి వుండొచ్చు
కాని లోలోపల రాజుతూనే వుంటుంది
దాని ఏకైక మిత్రుడు కవిత్వమే
కవిత్వమూ ఎన్నటికీ తలవంచదు
అది సజీవంగా మండుతూనే వుంటుంది
విప్లవ జ్వాలలనెగదోస్తుంటుంది
ముందు వరుసలో నిలబడి
విప్లవ మహాకావ్యాన్ని కొనసాగిస్తుంటుంది.
అది ఇంకా అసంపూర్ణమే
ఎప్పటికి పూర్తవుతుందో ఎవరికీ అంతుబట్టదు
అప్పటివరకు ఎన్నో కొత్త పేర్లు
వచ్చి చేరుతుంటాయి
రక్త ప్లావితమైన అధ్యాయాలతో
వందనం వారందరికీ
అందరికీ సెల్యూట్!

## వివరణలు :

**1. జాంజ్ తిరుగుబాటు :** అబ్బాసిద్ కాలిఫేట్‌కు వ్యతిరేకంగా 869 నుండి 883 వరకు సాగిన నల్ల బానిసల తిరుగుబాటు.

ఆలీ ఇబ్న్ మహమ్మద్ నాయకత్వంలో బంటూ భాషీయులైన బానిసలు (జాంజి) సెప్టెంబరు 869 నుండి 14 ఏళ్లపాటు చేసిన తిరుగుబాటు.

ఈ బానిసలను తూర్పు ఆఫ్రికా తీరప్రాంతాల నుండి బంధించి మధ్య ఆసియాకు తెచ్చి చవుడు నేలల్లో చవుడు తీసేయడానికి ఉపయోగించేవారు. ఈ తిరుగుబాటులో వేలాదిమంది చనిపోయారు. వీరు గెరిల్లా యుద్ధం చేసి, ఆక్రమించిన ప్రాంతాల్లో పరిపాలించేవారు.

**2. గాస్పర్ యంగా :** (జననం 1545). ఆఫ్రికన్ మెక్సికోలో మరూన్ బానిసల కాలనీకి నాయకుడు. 1609లో కాలనీపై స్పానిష్ దాడిని ప్రతిఘటించాడు. 1618లో మరూన్ సెటిల్మెంట్ స్వపరిపాలనపై స్పానిష్ వలస ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. మెక్సికో జాతీయ వీరునిగా ప్రసిద్ధుడు.

**3. మజ్నూషా; 4. భవానీ పాథన్; 5. దేవి చౌధురాణి :** మజ్నూ షా మేవాట్‌కు చెందిన సూఫీసన్యాసి. మజ్నూఫకీర్‌గా ప్రసిద్ధుడు. సన్యాసుల – ఫకీర్‌ల తిరుగుబాటు బీహార్ – బెంగాల్ ప్రాంతాలకు వ్యాపించింది.

భవానీ పాథన్, దేవి చౌధురాణిలు, మజ్నూషా అనుచరులు ఈస్ట్ ఇండియా కంపెనీ కార్యాలయాలపై గెరిల్లా మరియు Positional యుద్ధ పద్ధతుల్లో సాగిన ఫకీర్ల – సన్యాసుల ప్రతిఘటన 1760లో ప్రారంభమై 1770 వరకు కొనసాగింది. 50 వేలమంది తిరుగుబాటుదార్లు పాల్గొన్నారు. భూస్వాములు, వడ్డీ వ్యాపారులను, బ్రిటిష్ వర్తకులు, సైనిక అధికారులపై ప్రధానంగా దాడులు చేశారు. భవాని పాథన్ భోజ్‌పురి బ్రాహ్మణుడు – మజ్నూషా మిత్రుడు – అనుచరుడు.

**6. దుర్జన్‌సింగ్ :** బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పన్నులు బాగా పెంచగా, పిల్ల జమీందార్లు, రైతులు, పేద రైతులు 1798లో చువార్ ఆదివాసులు దుర్జన్‌సింగ్ అనే జమీ పోగొట్టుకున్న మిద్నపూర్ జమీందార్లు నాయకత్వాన, 15 వందల మంది చేసిన తిరుగుబాటు దాడులు. మే 1798లో రాయపూర్‌లోని చువార్స్‌లో ఒక బజారు, ఒక కచేరి తగలబెట్టారు. దుర్జన్‌సింగ్ 30 గ్రామాలపై అదుపు సాధించాడు.

బెంగాల్‌లోని స్థానిక ఆదిమవాసీ తెగవారిని బ్రిటీషువారు నిందాపూర్వకమైన పదం చువార్ అని, అంటే పంది అని పిలిచేవారు. ఈ పోరాటాలలో బ్రిటీషువారు 200 మంది తిరుగుబాటుదారులకు మరణశిక్ష విధించారు. దీనిని జంగల్‌మహల్ స్వాతంత్ర్య పోరాటంగా పిల్చారు.

చువార్ తిరుగుబాటు 1798–99లో మిద్నపూర్ జిల్లాలోని బింకూరలో జరిగింది.

**7. బాబా తిల్కా మంజీహ్ :** (1 ఫిబ్రవరి 1750–1785)

ఈయన సంతాల్ కుటుంబంలో బీహార్‌లోని సుల్తాన్ గంజ్ ప్రాంతంలోని తిల్కపూర్ కుగ్రామంలో జన్మించారు. తండ్రి సుందర ముర్ము. తన కుటుంబంపైనా, ఆదివాసీలపైన బ్రిటీషువారి క్రూర పరిపాలనను బాల్యం నుండీ అనుభవించాడు. అగస్టస్ క్లీవ్‌లాండ్ అనే బ్రిటీష్ సూపరింటెండెంటు, కమీషనర్‌ను మాటువేసి, చంపేయడంతో బ్రిటీష్ ప్రభుత్వం వణికిపోయింది.

తిల్కా తన విప్లవ మిత్రులతో సమావేశం కాగా, ఒక ద్రోహి అందించిన సమాచారంతో బ్రిటీష్‌వారు దాడిచేయగా, తిల్కా తప్పించుకున్నాడు – పలువురు సంతాలులు అమరులయ్యారు. తిల్కా సుల్తాన్‌గంజ్, భగల్పూర్ పర్వత ప్రాంతాలకు తప్పించుకొని వెళ్ళాడు. ఒక గెరిల్లా యుద్ధంలో 1785లో పట్టుకొని చంపేసి రావి / మర్రి చెట్టుకి వేలాడదీశారు. గుర్రపు తోకకు కట్టేసి, లాక్కుని పోయి భగల్పూర్ కలక్టర్ ఇంటి వద్ద ఆ చెట్టుకి వేలాడేశారు. ఇప్పుడు ఆ ప్రదేశంలోనే అతని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భగల్పూర్ విశ్వవిద్యాలయానికి తిల్కామంజి విశ్వవిద్యాలయం అని పేరు పెట్టారు.

**8. షేయాస్ తిరుగుబాటు :** (31 అగస్టు 1786 – జూన్ 1787)

పశ్చిమ స్ప్రింగ్ ఫీల్డ్‌లోని మెసాచుసెట్స్‌తో ప్రభుత్వం పెంచిన పన్నులకు వ్యతిరేకంగా, ఆర్థిక సమస్యలపైనా, పౌరహక్కుల కోసం, అన్యాయాలకు వ్యతిరేకంగానూ నాలుగు వేలమంది డేనియల్ షేయాస్ నాయకత్వాన చేసిన తిరుగుబాటు.

**9. అచల్ సిన్హా :** 1806లో బోంగీర్ లాయక్స్‌ల భూమిని బ్రిటీషువారు స్వాధీనం చేసుకున్నారు. అచల్ సిన్హా నాయకత్వాన లాయక్‌లు తిరుగుబాటు చేశారు. ద్రోహం వలన అచల్ సిన్హా పట్టుబడ్డాడు. 200 మంది లాయక్‌లు ఈ ఘర్షణలో చనిపోయారు. అచల్ సిన్హాను కాల్చి చంపేశారు.

**10. వీరనారాయణసింగ్ బింజావర్ :** (1795–1857)

చత్తీస్‌ఘడ్ స్వాతంత్ర్య సమరయోధుడు, ధాన్యవ్యాపారి వద్ద ఉన్న ధాన్య నిల్వలను లూటీ చేసి కరువుతో బాధపడుతున్న పేదలకు పంచినందుకు 1856లో బ్రిటీషు సైన్యం అరెస్టు చేసింది. కాని జైలు నుంచి తప్పించుకొని పారిపోయాడు. 500 మంది సైనికదళం ఆయనది. ఆ తర్వాత మరల పట్టుపడగా 10 డిసెంబర్ 1857లో మరణశిక్షకు గురయ్యాడు.

చత్తీస్‌ఘడ్ ప్రభుత్వం అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంకు వీరి పేరు పెట్టింది.

**11. యు కియాంగ్ నాంగ్‌బా :** మేఘాలయ స్వాతంత్ర్య సమరయోధుడు. 30 డిసెంబరు 1862లో జొవాయి పట్టణంలో బ్రిటీషువారు ఈయన్ను బహిరంగంగా ఉరితీశారు. భారత ప్రభుత్వం 2001లో ఆయన జ్ఞాపకంగా తపాలా బిళ్ళను విడుదల చేసింది. జొవాయిలో 1967లో ఆయన పేరుతో ప్రభుత్వ కళాశాల స్థాపించారు.

**12. భగ్నాదిహ్ :** జార్ఖండ్‌లోని ఒక గ్రామం. సంతాలుల తిరుగుబాటుకు ప్రధాన కేంద్రం.

30 జూన్ 1885లో ఈ గ్రామపు పొలాల్లో సమావేశమై, సంతాలులు సిద్ధు, కన్హు ముర్ముల నాయకత్వంలో స్వతంత్రం ప్రకటించుకున్నారు. ఇప్పటికీ ప్రతి ఏడాదీ జూన్ 30న అక్కడ షహీద్ మేళా జరుగుతూ వుంది.

**13. న్యాన్‌గ్వే :** కాంగోలోని ఒక పట్టణం. ఇది 1860 ప్రాంతాల్లో ఏర్పడింది. 19వ శతాబ్దపు చివరి వరకు బానిస వ్యాపారం ఇక్కడ జరిగింది.

**14. బిర్సా ముండా :** (15.11.1875 – 9.6.1900) ముండా తెగకు చెందిన భారతీయ ఆదివాసీ పోరాట యోధుడు.

**15. జార్జి గేపన్ :** (17.2.1870 – 10.4.1906) రష్యన్ మతాధికారి, కార్మిక నాయకుడు.

1905 జనవరి 22న సార్వత్రిక సమ్మె జరిగిన తర్వాత రోజు, కార్మికులు గేపన్ నాయకత్వాన శాంతియుతంగా జార్‌కు విజ్ఞాపన పత్రం ఇవ్వడానికి వెళ్తున్న ప్రదర్శనపై కాల్పులతో రక్తప్లావితం కాగా దానిని చరిత్రకారులు Bloody Sunday అని పిలిచారు.

గేపన్ రష్యన్ ఫ్యాక్టరీ వర్కర్స్ అసెంబ్లీకి నాయకునిగా పనిచేశాడు. ఆ తర్వాత అతన్ని పోలీసు ఇన్‌ఫార్మర్‌గా తలచి, సోషలిస్టు రెవల్యూషన్ పార్టీవారు మరణశిక్ష విధించి చంపేశారు.

**16. ముస్తఫా సూఫీ :** (14.5.1883 – 28.1.1921) టర్కీ దేశస్థుడు. విద్యాభ్యాసం తర్వాత పారిస్‌లో టర్కిష్ వార్తాపత్రిక 'ఇఫామ్'కు సంపాదకునిగా పనిచేశారు.

1913లో మహమ్మద్ పాషా హత్యకేసులో నిందితునిగా 15 ఏళ్ళపాటు నల్ల సముద్ర తీర ప్రాంతంలో వున్న సినోప్‌లో ప్రవాసశిక్ష అనుభవిస్తున్న క్రమంలో అక్కడే అతని కమ్యూనిస్టు మిత్రులతో, భార్యతో సహా 1921 జనవరి 28న చంపబడ్డాడు.

**17. సూడిస్‌మాన్ :** (1920 – 1968) ఇండోనీసియా కమ్యూనిస్టు పార్టీ (PKI)కి 1958 – 65లో ప్రధాన కార్యదర్శి.

డచ్ వ్యతిరేక జాతీయ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. జపాన్ ఇండోనీసియాను ఆక్రమించిన కాలంలో సూడిస్‌మాన్ PKIలో చేరాడు. అప్పటికే అది ఫాసిజానికి వ్యతిరేకంగా పనిచేస్తోంది. ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం చేస్తున్నందుకు 1942 సెప్టెంబరులో జపాన్‌వారు అరెస్టు చేశారు. జైలులో 1945 వరకు తోటి ఖైదీలను సంఘటితపరిచారు. విడుదలైన తర్వాత ఇండోనీసియా సోషలిస్టు యూత్‌కు సెక్రటరీ జనరల్‌గా పనిచేశారు. 1948లో PKI పొలిట్‌బ్యూరో కేంద్రకమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. గెరిల్లా ప్రతిఘటనా దళానికి నాయకునిగా వున్నకాలంలో 1966 డిశంబరులో డచ్‌వారు అరెస్టు చేశారు. 9 నెలలు జైలు జీవితం గడిపారు.

**18. కపెన్ గురియాలు :** మావ్ మావ్ పార్టీ ద్వారా కెన్యాలోని తెల్లజాతివారినందరినీ హతమార్చడానికి కుట్ర చేశారనే ఆరోపణపై తరువాత పాదాల్లో పేర్కొన్న ఆర్గురినీ 1952లో అరెస్టు చేసి కపన్ గురియా అనే చోట 1952–53లో విచారించారు. కనుక వారిని కపన్ గురియాలు అన్నారు. విచారణ తర్వాత ఉత్తర కెన్యాలో జైలులో పెట్టారు.

**19. పాట్రిస్ లుముంబా :** (2.7.1925 – 17.6.1961) కాంగో మొదటి ప్రధానమంత్రిగా జూన్ 1960 నుండి సెప్టెంబరు 1960 వరకు పనిచేశారు.

1958 నుండి హత్యకు గురి అయ్యేంత వరకు కాంగో జాతీయ ఉద్యమ పార్టీ (MNC)కి నాయకత్వం వహించారు.

1960లో కాంగో స్వతంత్ర దేశమైన తర్వాత జరిగిన సైనిక తిరుగుబాటునణచడానికి అమెరికా, ఐక్యరాజ్యసమితులు సహాయం అర్థించి విఫలుడయ్యాడు. బెల్జియం సహకారంతో వేర్పాటువాదుల ఉద్యమం అణచాలనుకున్నాడు. కాని వారు సహాయపడకపోవడంతో సోవియట్ యూనియన్ సహాయం తీసుకున్నాడు. సైనిక తిరుగుబాటుతో ఏర్పడిన మొబుటు ప్రభుత్వ ఖైదీగా బెల్జియం అధికార కాల్పుల దళం చేతిలో మరణించాడు. 2002లో అలా కాల్చివేయడం తాము చేసిన తప్పేనని బెల్జియం క్షమాపణ ప్రకటించింది.

**20. విక్టర్ జారా :** (28.9.1932 – 16.9.1973) : చిలీకి చెందిన ఉపాధ్యాయుడు. రంగస్థల దర్శకుడు, కవి, గాయకుడు, కమ్యూనిస్టు, రాజకీయ క్రియాశీల కార్యకర్త. 11 సెప్టెంబర్ 1973లో చిలీలో అలెండీ ప్రభుత్వాన్ని కూలద్రోసిన అగస్టో పినోచెట్ నిరంకుశ పాలనలో ఈయన్ని చిత్రహింసలకు గురిచేశారు.

చిలీ స్టేడియంకు తీసుకుపోయి గిటారు వాయించే చేతివ్రేళ్ళను ఒక్కొక్కటి నరుకుతూ హేళన చేస్తూ గిటారు వాయించమని బెదిరిస్తూ

చిత్రహింసలు పెట్టారు. జారా గిటారు వాయించకపోయినా చిలియన్ నియంతలపై ఒక నిరసన గేయాన్ని ఆలపించాడు. దానితో ఇంకా రెచ్చిపోయిన శత్రు సైనికులు అతని తలలోకి బులెట్ పేల్చారు. శరీరమంతటా 40 బుల్లెట్లున్నాయి.

42 ఏళ్ళ తర్వాత ఆనాటి సైనికాధికారులపై హత్యానేరంపై విచారణ సాగింది.

**21. మహ్మద్ బౌజిజి :** (29.3.1984 – 4.1.2011) : అరబ్ వసంతం (Arab Spring) ఉద్యమానికి శ్రీకారం చుట్టిన సంఘటనకు కారకుడు బౌజిజి. ఆయన టునీసియాలో వీధి వీధి తిరిగి అమ్ముకునే వ్యాపారి. తాను అమ్మే వస్తువులను జప్తు చేసిన మునిసిపల్ అధికారిణిల వేధింపులకు, పోలీసుల బెదిరింపులకు విసిగి తనకు తాను నిప్పు అంటించుకున్నాడు. 17.12.2010న కాలిన గాయాలతో 4.1.2011న చనిపోయాడు. అతని మరణంతో చెలరేగిన ఉద్యమ ఫలితంగా 14 జనవరి 2011న టునీసియా అధ్యక్షుడు, 23 ఏళ్ళుగా అధికారంలో వున్న జైని ఎల్ అబ్దిన్‌బెన్ ఆలీ రాజీనామా చేయాల్సి వచ్చింది. నిరంకుశ ఏక వ్యక్తి పాలనకు వ్యతిరేకంగా సాగే పోరాటంలో అతని మరణం ఒక మూలమలుపుగా వుంది.

అతని జ్ఞాపకార్థం టునీసియా ప్రభుత్వం తపాలా బిళ్ళను విడుదల చేసింది.

**22. మారిటోనియా :** నార్త్‌వెస్ట్ ఆఫ్రికాలో ఇస్లామిక్ రిపబ్లిక్ దేశం.

**23. నౌక్ ఛోట్ :** మారిటోనియా దేశపు రాజధాని నగరం.

**24. యామాబ్ దహోబ్ :** మారిటోనియాలో ప్రజాస్వామిక సంస్కరణలు, ఖైదీల విడుదల, అవినీతి నిర్మూలన కోరుతూ బౌజిజి తరహాలోనే, ఆ దేశపు రాజధానిలో అధ్యక్ష భవనం ముందే 17 జనవరి 2011లో నిప్పంటించుకొని, కాలిన గాయాలతో జనవరి 23న చనిపోయాడు.

**24. ఆస్మా మహ్‌ఫౌజ్ :** (1.2.1985) 2011 ఈజిప్టు విప్లవానికి బీజారోపణ చేసిన మహిళ – ఈమె ఏప్రిల్ 6 యువజన ఉద్యమాన్ని ప్రారంభించిన కార్యకర్త.

**25. రజాన్ జైటోవా :** రాజకీయ ఖైదీల విడుదల కోసం సిరియాలో కృషిచేసిన మహిళా బృంద సభ్యురాలు.

దానా జవాబ్రా అనే మహిళా ఇంజనీరును, నిరంకుశ అధ్యక్షుడు బషాల్ అల్ అస్సాద్ 16 మార్చి 2011లో నిర్బంధానికి గురిచేశాడు. ఆమెను జైలులో చాల బాధలు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు వెల్లువెత్తాయి. దేరాలో 15 మంది విద్యార్థులని అరెస్టుచేసి చిత్రహింసలు పెట్టడాన్ని నిరసించారు. టునీసియా, ఈజిప్టుల్లోలాగ పాలకుల పతనాన్ని ప్రజలు కోరుతూ ప్రదర్శనలు చేశారు.

రజాన్ జైటోవా ప్రసిద్ధ మహిళా లాయరు. 36 మంది నిరసనకారులను సమర్థించారు. ఆమెను అరెస్టు చేసినా తప్పించుకుని పారిపోయింది.

**26. తవాక్కుల్ కర్మాల్ :** యెమెన్ నోబెల్ శాంతి బహుమతి గ్రహీత.

పాత్రికేయురాలు, రాజకీయవేత్త, మానవహక్కుల కార్యకర్త. 2011 యెమెన్ తిరుగుబాటులో అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు. 'ఉక్కు మహిళ'గా విప్లవమాతగా యెమన్ ప్రజలు ఆమెను సంబోధిస్తారు.

# జనసాహితి సభ్యుడు వంగరలక్ష్మీకాంత్‌కు జోహార్లు



**లక్ష్మీకాంత్** (53) జనసాహితి గుంటూరు జిల్లాశాఖలో క్రియాశీల సభ్యులు. ఏపిటిఎఫ్ గుంటూరు జిల్లా సబ్ కమిటీలోనూ సభ్యులు. ఎన్నికల విధులకు హాజరై వచ్చిన 9వ తేదీ నుండి ఆయనకు కరోనా సోకింది. కరోనాతో పోరాడుతూ 21-4-21 మధ్యాహ్నం ఆయన గుంటూరులోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో మరణించారు .

మంచి రచయితగా ఎదుగుతున్న లక్ష్మీకాంత్ అకాల మరణం ప్రగతిశీల ప్రజా సాహిత్య ఉద్యమాలకు తీరని లోటు.

లక్ష్మీకాంత్ గుంటూరు జల్లా భట్టిప్రోలు సమీపానగల ఐలవరం గ్రామానికి చెందినవారు. నగరం కళాశాలలో చదువుతున్నప్పటి నుండి ఆయన ప్రజాతంత్ర విద్యార్థి సంస్థ నిర్వహించిన ఉద్యమాలలో పాల్గొన్నారు. డిగ్రీ తర్వాత కొంతకాలం ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేశారు. ఆ తర్వాత చాలా కష్టపడి ఉపాధ్యాయునిగా స్థిరపడ్డారు. విద్యార్థి దశ నుండి కథలు, కవితలు రాసేవారు. పిల్లలకు అభ్యుదయకరమైన విషయాలతో పాఠాలు బోధించేవారు. ఆయన చేసిన రచనలు, కవితలు, కథలు 'ప్రజాసాహితి'లో ప్రచురితమయ్యాయి. ఆయన రాసిన కథల సంకలనం 'ఏరువాక' నాలుగేళ్ల క్రితం వెలువడింది. ఇటీవల కరోనా మీద 'మానవుడు అజేయుడు' అంటూ కవిత రాసారు. లక్ష్మీకాంత్ సాంప్రదాయ వ్యతిరేక ఆదర్శ వివాహం చేసుకున్నారు. అతని భార్య, కుమారుడు, కుమార్తె కూడా ప్రగతిశీల ఉద్యమాలకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. లక్ష్మీకాంత్ మరణం ఉపాధ్యాయ, సాహిత్య రంగాలతో పాటు ఇతర ప్రజాతంత్ర ఉద్యమాలకి కూడా తీరని లోటు. వారి మరణానికి జనసాహితి ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తూంది. వారి కుటుంబ సభ్యుల వేదనను పంచుకుంటున్నది.



# ప్రజాపక్షపాతి, సుప్రసిద్ధ బెంగాలీ కవి
# శంఖాఘోష్‌కు నివాళి

**రవీంద్రనాధ్** టాగోర్ తర్వాత బెంగాలీ సమాజాన్ని అంతగా ప్రభావితం చేసిన కవి, ఉద్యమకారుడు శంఖాఘోష్ 21.04.2021న తన 89వ ఏట మరణించారు. ఆయన ఫిబ్రవరి 5 లేక 6, 1932లో ఇప్పుడు బంగ్లాదేశ్‌లోని చాంద్‌పూర్‌లో జన్మించారు.

ఆయన ప్రెసిడెన్సీ కళాశాలలో డిగ్రీ, కలకత్తా విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ చదివి, వివిధ కళాశాలల్లో పనిచేసి జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయంలో స్థిరపడ్డారు. 1992లో ఉద్యోగ విరమణ చేశారు. అధ్యాపకునిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. ఇతర తరగతుల, ఇతర కళాశాలల విద్యార్థులు కూడా ఆయన క్లాసులకు హాజరయ్యేవారు. ఆయన రవీంద్రనాధ్ ఠాగూర్‌ను కొత్త పద్ధతిలో అధ్యయనం చేయడం ఎలాగో కొత్తతరం వారికి నేర్పించారు.

శంఖాఘోష్ ఏ రాజకీయ పార్టీ సభ్యుడు కాకపోయినా, ప్రజల సమస్యలపై జరిగే ఉద్యమాలన్నింటిలో పాల్గొనేవారు. 2002లో గుజరాత్‌లో జరిగిన ముస్లిముల ఊచకోతను శంఖా ఘోష్ నిర్ద్వంద్వంగా నిరసించాడు.

మార్చి 14, 2007లో సి.పి.ఎం. పాలనలో పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్, సింగూర్ గ్రామాలలో జరిగిన ఆందోళనలో 14 మంది గ్రామస్తులు పోలీసు కాల్పులలో మరణించిన సంఘటనకు తీవ్ర నిరసన తెలియచేసి బంగ్లా అకాడమీకి రాజీనామా చేశాడు.

2011లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై ఎవరో వేసిన వ్యంగ్య చిత్రం తనకు వస్తే దానిని మరికొందరికి పంపించినందుకు జాధవ్‌పూర్ విశ్వవిద్యాలయ ఫిజికల్ కెమిస్ట్రీ శాఖాధిపతి అంబికేష్ మహాపాత్రనూ, అలా ఇతరులకు ఫార్వర్డ్ చేసేటప్పుడు చూసిన ఆయన పొరుగింటివాడైన 75 ఏళ్ళ సుబ్రతాసేన్ గుప్తాలను అరెస్టు చేయడాన్ని పలు మేధావులు, రచయితలతోపాటు శంఖాఘోష్ ఖండిస్తూ ప్రకటించారు.

బెంగాల్‌ను బ్రిటీషువారు విభజించినపుడూ, జలియన్ వాలాబాగ్ కాల్పుల సంఘటన సందర్భంగా టాగోర్ బ్రిటీషువారికి వ్యతిరేకంగా జరిగిన నిరసన కార్యక్రమాలలో పాల్గొన్న విషయమూ, తన బిరుదును వాపసు ఇవ్వడమూ శంఖాఘోష్ వివిధ సందర్భాలలో ప్రస్తావించేవారు. ఏప్రిల్ 2018లో రామనవమి ఉత్సవాలలో మతపరమైన హింసాయుత చర్యల పట్ల ఇతర కవులు, కళాకారులతో గొంతు కలిపి నిరసన తెలియచేశారు.

2019లో పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఒక శక్తిమంతమైన కవిత రాశారు. తన చివరి రచనల్లో క్రమంగా ఫాసిజం వైపు సమాజాన్ని నడిపిస్తున్న పాలకవర్గంపై ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. వరవరరావు విడుదల కొరకు బెంగాలీ రచయితలు చేపట్టిన 'మన కవిని విడుదల చేయించుకుందాం' అనే ప్రచార కార్యక్రమాన్ని శంఖా ఘోష్ తన 88వ ఏట సంతకం పెట్టి ప్రారంభించారు.

ఆయన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు (1977, 1999), రవీంద్ర పురస్కార్ (1989) జ్ఞానపీఠ అవార్డు (2016)లే గాక, 2011లో పద్మభూషణ్ అందుకున్నారు. వారి మరణానికి జనసాహితి సంతాపం ప్రకటిస్తోంది. ✷

## ముప్పైఏళ్ళ క్రితం ప్రజాసాహితి
### 117వ సంచిక, మే 1991

**మేడే** పై మోహన్ వేసిన చిత్రం ముఖచిత్రంగా వెలువడిన ఈ సంచికలో మేడేపై రాసిన సంపాదకీయాన్ని "ప్రజారచయితలూ, కళాకారులూ కష్టజీవులకు అండదండలుగా నిలబడి వారి లక్ష్య సాధనకు ఆలంబనగా రూపొందాలి. మరొకసారి మేడే నిర్దేశిస్తున్న కర్తవ్యం ఇదే!" అంటూ ముగించారు. దాదా హయత్ రాసిన 'మసీదు పావురం' కథ; రామతీర్థ వ్యంగ్య రచన, 'బ్యాలటోపాఖ్యానం'; జాన్ వెస్లీ రచన 'సామ్రాజ్యవాదం – ప్రసార సాధనాలు'; 'మతతత్త్వం – మహిళల జీవితం'పై కాత్యాయని విద్మహే, జ్యోతిరాణి, శోభలు సంయుక్తంగా రాసిన వ్యాసం కాక కె. వెంకట్రామయ్య 'మొగ్గ మిరుగులు'పై సమీక్ష ఈ సంచికలో ప్రచురించారు.

జొన్నాదుల అప్పారావు, 'ఎన్నికలొస్తున్నాయి' శాంతికుమార్, 'మేడే'; అరణ్యకృష్ణ 'ద్వేష చైతన్యం', భాస్కర్ జాధవ్ మరాఠీ కవితకు సూర్యసాగర్ అనువాదం – కవితలు దీనిలో వున్నాయి. రాజశేఖర్ 'సిక్కోలు అమరవీరుల'పైనా, మతతత్త్వంపై రాజేంద్ర పాటలు రాశారు. మతతత్త్వవాదుల ఆంక్షలు – నిషేధాలుపై ఒక ప్రత్యేక వ్యాసం – ఆంక్షలు – నిషేధాలు శీర్షికలో ప్రచురించారు. ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన కవి మూసా జలీల్ గురించి ఛాయరాజ్ వ్యాసం రాశారు. బెజవాడలో గూండాల గుంపుల సంస్కృతినీ, వారి ఆగడాలనూ ఖండిస్తూ UCCRI(ML) నగరశాఖ వేసిన కరపత్రం 'మనిషిని మనిషి చంపుకునే ఆటవిక సంస్కృతి మనకొద్దు' అనే కరపత్రాన్ని 'కరపత్రాలు – కదిలేచరిత్ర' శీర్షికలో ప్రచురించారు. రాల్ఫ్‌ఫాక్స్ 'నవల – ప్రజలు'కు నాలుగో అధ్యాయం కొత్తపల్లి రవిబాబు అనువాదం కొనసాగింది. చైతన్యవాహినిలో వరంగల్లు, పొన్నెకల్లు, సభల వివరాలూ, కన్నడంలో 'అయోధ్యలో రావణకాష్టం' పుస్తకం విడుదల వార్తలూ వున్నాయి. 'స్వీకారం'లో 9 పుస్తకాల వివరాలిచ్చారు. 1/8 క్రౌన్‌లో 84 పుటలు. వెల : రూ. 4/– ✷

# ఖరగ్‌పూర్ ఐఐటీలో
# విద్యార్థులను కులవివక్షతో దూషించిన
# ప్రొఫెసర్ సీమాసింగ్‌ను విధుల నుండి తొలగించాలి!

**ఇండియన్** ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) కళాశాలలు మన దేశంలో ఉన్న ప్రసిద్ధ విద్యాసంస్థలు. అటువంటి విద్యాసంస్థలలోనే కులవివక్ష బహిరంగంగా, నిర్భీతితో ప్రదర్శించబడిందంటే – సమాజంలోనూ, సామాన్య విద్యాలయాలలో ఈ వివక్ష ఇంకెంత భయంకరంగా ఉంటుందో ఖరగ్‌పూర్ ఐఐటి సంఘటన తెలియచేస్తూంది. అసోసియేట్ ప్రొఫెసర్ సీమాసింగ్ ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థుల బ్రిడ్జి కోర్సులో భాగంగా ఆన్‌లైన్‌లో పాఠం చెప్పటం పూర్తయిన తర్వాత విద్యార్థులు జనగణమణ పాటపాడి, భారత్ మాతాకీ జై! అంటూ ముగించారు. ఆ విద్యార్థులు లేచి నుంచోకుండా పాట పాడారంటూ, బ్లడీ బాస్టర్డ్స్, షేమ్ లెస్ క్రీచర్స్, ఇడియాటిక్ పీపుల్ వంటి అనేక అవమానకరమైన, కులపరమైన పదాలతో అకారణంగా కులోన్మాదంతో ఊగిపోతూ దుర్భాషలాడింది. అంతేనా – వాళ్ళని తిట్టినందుకు తనకేం భయం లేదని, మీరు కావాలంటే ఎస్సీ, ఎస్టీ, మంత్రిత్వ శాఖకు లేదా స్త్రీ, శిశు మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేసుకోమని సవాల్ విసిరింది.

ఐఐటిలలో, సెంట్రల్ యూనివర్శిటీలలో అస్పృశ్యతా భావం అంటరానితనం రూపం మార్చుకుని ఆధిపత్య భావజాలంతో దళితులను ఆత్మన్యూనతా భావంలోకి నెట్టివేస్తూ వుంది. రోహిత్ వేముల సంఘటన అందుకు ఉదాహరణ. రోహిత్ వేముల ఆత్మహత్య మొదటిది కాదు, చివరిదీ కాదు. ఈ ఆత్మహత్యలన్నీ వ్యవస్థీకృత హత్యలే. ప్రస్తుత బిజెపి ప్రభుత్వ పాలనలో, మనుధర్మాన్ని, నిచ్చెనమెట్ల కులసమాజాన్ని పెంచి పోషిస్తూన్న కాలంలో సమాజంలోనూ, విద్యాసంస్థలలోనూ, అన్నిచోట్లా వివక్ష మరింతగా పెరిగిపోతూన్న దానికి నిదర్శనమే సీమాసింగ్ వంటి అధ్యాపకురాలు కులోన్మాదంతో దుర్భాషలాడటం.

దళితులు, ఆదివాసీలు, అణగారిన శ్రామిక ప్రజలంతా ఐక్యమై ఉద్యమించిననాడే ఈ వివక్షను ఎదుర్కోగలమని చరిత్ర మనకు తెలియచేస్తూంది. కుల వివక్షకు నిలువెత్తు నిదర్శనంగా వున్న సీమాసింగ్‌ను వెంటనే విధుల నుండి తొలగించాలి. ✸


ఈ నెల పుస్తకం

# మైత్రీ బుక్‌హౌస్, విజయవాడ
## అభ్యుదయ, విప్లవ సాహిత్యకేంద్రం



# నా జాతి ప్రజల కోసం నిలబడతా!
## Here I Stand

**పాల్ రోబ్సన్ స్వీయకథ. అనువాదం : కొత్తపల్లి రవిబాబు**

పాల్ రోబ్సన్ అద్భుతమైన అమెరికన్ సంగీతకారుడు, గాయకుడు, గొప్ప ఫుట్‌బాల్, బేస్‌బాల్, బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు. తన నల్లజాతివారి హక్కులకోసం జీవితాంతం కృషిచేసిన పోరాట యోధుడు. వివక్షకు గురి అవుతున్న జాతులవారు వివిధ దేశాలలో పోరాటాలు చేస్తూ వున్నారు. సామ్రాజ్యవాద దురాక్రమణల ఆధిపత్యశక్తులు వర్ణవివక్షల అసమాన ఆర్థిక, సాంఘిక వ్యవస్థలను పెంచి పోషిస్తున్నాయన్న దృక్పథంతో పాల్ రోబ్సన్ జీవితకాలం సామ్రాజ్యవాదాన్ని ధిక్కరిస్తూ సాగారు. పాల్ రోబ్సన్ స్వీయ అనుభవాల ఈ రచన వివక్షాయుత సమాజం ఎక్కడ వున్నా దానిని అంతం చేసే పోరాట చైతన్యాన్ని ప్రోత్సహిస్తుంది.

1/8 డెమ్మీలో 216 పుటలు. వెల : రూ. 150/– ప్రచురణ : జనసాహితి.

ప్రతులకు : **మైత్రీబుక్‌హౌస్, అరండల్‌పేట, కార్ల్‌మార్క్స్‌రోడ్డు, విజయవాడ – 520002. ఫోన్ : 86393 14662** ✸

# చైతన్యవాహిని

**29-03-2021**న తెనాలిలో జి. మోహనరావు (స్పార్టకస్) సంతాపసభలో 'ప్రజాసాహితి' ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు మాట్లాడుతూ మోహనరావు పోలీసు శాఖలో పనిచేస్తూ సాహిత్య ప్రపంచంలోకి ప్రవేశించడం, ఆయనపై రంగనాయకమ్మ రచనల ప్రభావం, 'ఖాకీ బతుకులు' నవల రాసిన తర్వాత పోలీసు శాఖ ఆయనపై చేబట్టిన వేధింపు చర్యలు మొదలైనవి వివరించారు. చెరబండరాజు రాసిన 'పోలీసు పాట' ద్వారా పోలీసులూ ప్రజల్లో భాగమని చెప్పారన్నారు. మోహనరావు మిత్రులు అడ్వకేట్ జి.యస్. నాగేశ్వరరావు, జనసాహితి సభ్యుడు రచయిత చందు నాగేశ్వరరావు, నందూరి నారాయణరావు, మోహనరావు సహచరి మేరీ, కొడుకు ప్రేమచంద్, కూతురు ప్రత్యూష మొదలైనవారు పాల్గొని మోహనరావుకు నివాళి తెలియచేశారు. 'ఖాకీ బతుకులు' పుస్తకం మరో ముద్రణకు సహకారం అందించమని కోరారు.

**01-04-2021**న గుంటూరులో అన్నమయ్య కళావేదికలో అశ్లీలతా ప్రతిఘటనా సంఘంవారు ప్రచురించిన 'తేనెటీగ కాదది విషపు తేలు' పుస్తకాన్ని గుంటూరు మున్సిపల్ కమీషనర్ చల్లా అనూరాధ ఆవిష్కరించారు. పెనుగొండ లక్ష్మీనారాయణ (అరసం) స్వాగతం పలికారు. నల్లూరి రుక్మిణి (విరసం) అధ్యక్షత వహించి గుంటూరులో అశ్లీలతా ప్రతిఘటనా వేదిక నిర్వహించిన కార్యక్రమాలు వివరించారు. 'ప్రజాసాహితి' ప్రధాన సంపాదకుడు 'తేనెటీగ' నవలపై వచ్చిన విమర్శలను, మల్లాది అసంబద్ధ వాదనలను, వేదిక చేసిన పోరాట వివరాలను తెలియచేశారు. ఈదర గోపీచంద్, 'కామోత్సవ్' నవల పైనా, గ్రంథాలయాల్లో చోటు చేసుకున్న అశ్లీల నవలలపైనా, కోటప్పకొండ తిరునాళ్ళలో అశ్లీల రికార్డు డాన్సులపైనా చేసిన ఉద్యమాలను వివరించారు. 'కామోత్సవ్' నవలపై సాగిన వాద వివాదాలు, కోర్టు తీర్పులతో మరోపుస్తకం ప్రచురించబోతున్నట్లు ప్రకటించారు. ✸

## 'ప్రజాసాహితి' అభిమాని ఎ.పి.టి.ఎఫ్. నాయకుడు మహమ్మద్ యాకూబ్‌కు నివాళి

**గుంటూరుజిల్లా** ఎ.పి.టి.ఎఫ్. నాయకుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు, 'ప్రజాసాహితి' శ్రేయోభిలాషి మహ్మద్ యాకూబ్ తన 80వ ఏట 27-4-2021న గుంటూరులో మరణించారు.

యాకూబ్ ఉపాధ్యాయ ఉద్యమంలో క్రియాశీలంగా పనిచేస్తూనే, ఉపాధ్యాయులతో ప్రగతిశీల సాహిత్య పఠనాన్ని ప్రోత్సహిస్తూ వుండేవారు. 'ప్రజాసాహితి'కి కొన్ని దశాబ్దాలుగా ఆయన మిత్రులు. పత్రికకు ఆర్థిక, హార్దిక సహకారాలు తాను అందించటమేగాక, ఎందరో ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిల్చినవారు.

వారి ఇద్దరి కొడుకులూ ఉపాధ్యాయ ఉద్యమంలో పనిచేస్తున్నారు. యాకూబ్ మరణానికి 'ప్రజాసాహితి' సంతాపాన్ని ప్రకటిస్తోంది. వారి కుటుంబ సభ్యుల బాధను పంచుకుంటోంది. ✸

## జనసాహితి సభ్యుడు, జలసాధన సమితి అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రామకృష్ణ మృతి

**జనసాహితి** సంస్థాపక సభ్యుడు, కవి, రచయిత ఎం. రామకృష్ణ అనంతపురంలో తన 69వ యేట కోవిడ్‌తో 1-5-2021న మరణించారు. ఆయన పేద కుటుంబంలో బుక్కపట్నం మండలం గూనిపల్లి గ్రామంలో జన్మించారు.

ఆయన వ్యవసాయశాఖలో వివిధ హోదాలలో పనిచేసి 2005లో వ్యవసాయ అధికారిగా ఏలూరులో రిటైరయ్యారు. జనసాహితి ప్రారంభించిన నాటి నుండీ సభ్యునిగా వున్నారు. 'ప్రజాసాహితి'లో ఎన్నో కవితలు రాశారు. 2015 నుండి జలసాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

వారి అకాల మరణానికి జనసాహితి సంతాపం తెలియచేస్తోంది. వారి సహచరి గంగాభవాని, కొడుకులు సృజన్, నవీన్‌ల దుఃఖంలో పాలు పంచుకుంటోంది. ✸




**కష్టాల కొలిమి – త్యాగాల శిఖరం సర్వదేవభట్ల రామనాథం జీవితం :**

పరిశోధకుడు : ఆర్. శివలింగం, రచన : డా॥ కె. ముత్యం.

1/8 డెమ్మీలో 312 పుటలు. వెల : రూ. 200/– ప్రథమ ముద్రణ : 9–3–2021. ప్రచురణ : రాయల సుభాష్‌చంద్రబోస్ మెమోరియల్ ట్రస్ట్. ప్రతులకు : గుర్రం అచ్చయ్య, ట్రస్ట్ చైర్మన్ ఆర్.ఎం.టి. భవన్, ఎం.వి.పాలెం (పోస్టు, గ్రామం) ఖమ్మం రూరల్ (మండలం), ఖమ్మం జిల్లా మరియు నవోదయ బుక్‌హౌస్, హైదరాబాదు. ఫోన్ : 7799558813.

**కలియుగ కృష్ణార్జునులు, ఇతర కథలు : కథల సంపుటి**

రచయిత : పులిగడ్డ విశ్వనాథరావు.

1/8 డెమ్మీలో 162 పుటలు. వెల : రూ. 80/– ప్రథమముద్రణ : ఆగస్టు 2009. ప్రచురణ : పాలపిట్ట బుక్స్, హైదరాబాద్. ప్రతులకు : పాలపిట్ట బుక్స్, 16–11–20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట, హైదరాబాద్ – 500036. మరియు అన్ని ప్రముఖ పుస్తకాల షాపులలో.

**ఆంధ్రీకవనం – శ్రీశ్రీ అనువాద కవిత్వం :**

శ్రీశ్రీ సాహిత్యనిధి రూపొందించిన శ్రీశ్రీపై నూరు పుస్తకాల హోరు ప్రణాళికలో నూరవ పుస్తకం ఇది. ఈ నూరు పుస్తకాలలో శ్రీశ్రీ రచనలతోపాటు, శ్రీశ్రీపై ఇతర సాహితీవేత్తలు రాసిన రచనలు కూడా వున్నాయి. జనవరి 2021లో విడుదలైన ఈ నూరవ పుస్తకం శ్రీశ్రీ అభిమానులకు ఒక విశిష్టమైన కానుక.

పాశ్చాత్య సాహిత్యమూ, ఒక కాలంనాటి బెంగాలీ, హిందీ సాహిత్యమూ తెలుగు పాఠకులకు అనువాద రూపంలో పరిచయమయ్యాయి. కొందరు ప్రఖ్యాత తెలుగు రచయితలు, కవులు ఇంగ్లీషు మూలం తెలియచేయకుండా వాటిని తమ రచనలుగా ప్రచురించుకున్న వారున్నారు. శ్రీశ్రీ అలాగాకుండా మూల రచయితల పేర్లు చెప్పి అనువాదాలను, అనుసరణలను చేశారు. వివిధ భాషల్లోని కవితల ఆంగ్లానువాదాల ఆధారంగా ఆయన తెలుగులోకి వాటిని అనువదించారు. ఫ్రెంచి కవుల కవితలను ఫ్రెంచి భాష నుంచే నేరుగా అనువదించినట్లు తెలుస్తోంది.

ఈ పుస్తకంలో వివిధ భాషలకు చెందిన 61 మంది కవుల 90 కవితల అనువాదాలు, 228 పుటల్లో విస్తరించాయి. తానే తన భాషలో సృజనాత్మక కవిగా వున్నా, ఇతర భాషల్లోని కవుల కవితలకు ఆకర్షితుడై వాటిని అనువదించి తెలుగు పాఠకులకు అందించిన కవితా పిపాసి శ్రీశ్రీ. కవులు తమ కవితలు తప్ప ఇతరులవి చదవరు అనే సూత్రం శ్రీశ్రీకి నప్పదు. ఆయన అటు ప్రాచీన సాహిత్యాన్నీ, ఇటు ఆధునిక సాహిత్యాన్నీ లోతుగా అధ్యయనం చేసిన ఉత్తమ పాఠకుడు. తనకు బాగా నచ్చిన కవి రాసిన కవిత్వాన్ని చదవడమే గాక, దానిని తెలుగు పాఠకులకు అనువాదమో, అనుసరణో చేసి అందించాడు. వాటన్నిటినీ ఒకేచోట చదువుకోగల అవకాశం కల్పించాడు వీటి కూర్పరి అయిన శ్రీశ్రీ సాహిత్యనిధి కన్వీనర్ సింగంపల్లి అశోక్‌కుమార్.

అంతేకాదు, స్వయంగా కవి ఐన అశోక్‌కుమార్ ఈ 61 మంది కవుల్లో 51 మంది కవుల గురించి తనదైన విలక్షణ శైలిలో నాలుగు పాదాల లఘు కవితల్లో పరిచయం చేశారు. ఆయా కవుల విశిష్టతను క్లుప్తంగా విశదీకరించారు. వారి జనన, మరణాలను నమోదు చేశారు.

ఒక కవి రాసిన ప్రతి కవితా రసస్ఫోరకంగా వుంటుందని చెప్పలేము. అలాగే శ్రీశ్రీ చేసిన అనువాదాలన్నీ చక్కగా వున్నాయని చెప్పలేము. కొన్నిటిని చూస్తే ఇంత పేలవంగా చేశారేమిటనిపిస్తుంది. ఉదాహరణకు – 1936–1967 మధ్య జీవించిన గ్వాటేమాలా దేశ కవి ఓటోరినీ కాస్టిల్లో రాసిన Un political Intellectualsకు శ్రీశ్రీ చేసిన అనువాదం (పుట 215) కన్నా వెల్చేరు నారాయణరావు 'నారా' పేరుతో చేసిన 'రాజకీయాతీతులైన మేధావులు', ఆకర్షణీయంగా వుంది. అలాగే 1907–1963 మధ్య జీవించిన బ్రిటీష్ కవి లూయీ మేక్‌నీస్ 'Prayer before Birth'కు శ్రీశ్రీయే చెప్పుకున్నట్లు ముక్కస్య ముక్కానువాదం కనుక బాగా లేదు.

ఈ 61 మంది కవుల్లో షేక్స్పియర్ (పుట 14), చార్లెస్ బాడ్లేర్ (పుట 36), స్టీఫెన్ ఫిలిప్ (పుట 56), జార్జి విలియం రస్సెల్ (ఎ.ఇ.) (పుట 60), డేవిస్ (పుట 64)లు రచనలకు శ్రీశ్రీ పద్యాల రూపంలో అనువదించారు.

ఈ అనువాదాలకు అశోక్‌కుమార్ తనదైన శైలిలో ఆంధ్రీకరణ, కవనం రెండూ కలిసివచ్చేట్లు 'ఆంధ్రీకవనం' అనే పదాన్ని సృష్టించి ఈ పుస్తకానికి శీర్షికగా పెట్టడం శ్రీశ్రీ వరవడిలో సాగిన ప్రయోగమే!

ఆంధ్రీకవనం (శ్రీశ్రీ అనువాద కవిత్వం) : 1/8 డెమ్మీ, 240 పుటలు. వెల : రూ. 200/– మొదటిముద్రణ : జనవరి 2021. ప్రతులకు : శ్రీశ్రీ సాహిత్యనిధి, 305 ప్రగతి టవర్స్, వీరయ్య వీధి, మారుతీనగర్, విజయవాడ – 520004. ఫోన్ : 92462 77378. srisrisahityanidhi@yahoo.com.

**తేనెటీగ కాదది విషపు తేలు :** మల్లాది వెంకట కృష్ణమూర్తి 'ఆంధ్రజ్యోతి' వారపత్రికలో రాసిన అసభ్యకరమైన అశ్లీలమైన 'తేనెటీగ' నవలపైనా, దాని ఆధారంగా తీసిన సినిమాపైనా మూడేళ్ళపాటు (1989–91) విమర్శకులు, ప్రజాసంఘాలు, పాఠక – ప్రేక్షకులు ముప్పేటగా సాగించిన ప్రతిఘటన పోరాట చరిత్ర, విలువైన విమర్శా వ్యాసాల సంకలనం ఈ పుస్తకం. 1/8 డెమ్మీలో 12+180 పుటల ఈ పుస్తకం వెల : రూ. 120/– ప్రథమముద్రణ : 2021 ఫిబ్రవరి 26. ప్రచురణ, ప్రతులకు : ఈదర గోపీచంద్, 11–7–17, నవోదయనగర్, నరసరావుపేట – 522601. ఫోన్ : 94403 45496. edaragopichand@gmail.com.

(ఇంకా వున్నాయి)

(2వ అట్ట తరువాయి....)

నిర్మాణాత్మక అంతరంగిక చర్చకు ప్రయత్నించారు. విప్లవ రచయితల సంఘాన్ని మార్క్సిస్టులకే పరిమితం చేసే ధోరణి సరియైనది కాదని, విప్లవమంటే వ్యక్తిగత హింసావాదం లేక అతివాద దుస్సాహసిక వాదం కాదని "సాంస్కృతిక విప్లవం – మన కర్తవ్యాలు" డాక్యుమెంట్ స్పష్టం చేసింది. ఆ పత్రం రూపకర్తే ఈనెల 16వ తేదీన విజయవాడలో తన 78వ ఏట మరణించిన సీనియర్ కామ్రేడ్ మధు.

ప్రజాసంఘాలనేవి వివిధ విప్లవవర్గాల, వారి భావజాలాల ఐక్య సంఘటనా నిర్మాణ రూపాలని, వాటిని మార్క్సిస్టులకే పరిమితం చేయడం సరియైన మార్క్సిస్టు పని విధానం కాదని, అలాగే వర్గ శత్రు నిర్మూలన అనే అతివాద దుస్సాహసిక ధోరణి ప్రజా విప్లవ పంథాకి విరుద్ధమైనదని, ఒకనాటి అభ్యుదయ రచయితల సంఘం సాగించిన కృషిలోని విప్లవాంశకు మాత్రమే కాక అంతకు పూర్వపు ప్రగతిశీల భావధారలకు కూడా మనం వారసులమని ఆ పత్రంలో పేర్కొన్నారు. అయితే ఆ పత్రంపై అవసరమైనంత లోతయిన చర్చ విరసంలో జరగలేదు. కానీ ప్రజాసంఘానికి పార్టీకి నడుమ వుండవలసిన స్పష్టమైన సిద్ధాంత నిర్మాణ విభజన రేఖల గురించిన ఆరోగ్యవంతమైన చర్చకు అది దారితీసింది. "సాంస్కృతిక విప్లవం – మన కర్తవ్యాలు" డాక్యుమెంట్‌కు సమాధానమా అన్నట్లు 'విరసంలో మార్క్సిస్టు వ్యతిరేక ధోరణులు ఖండించండి' అంటూ అతివాద కోణం నుండి విప్లవ రచయితలు పేరుతో మరొక డాక్యుమెంట్ కూడా ఆ కాలంలోనే వచ్చింది. 1974 జనవరిలో విరసం గుంటూరు జిల్లా శాఖ తరపున "సాంస్కృతిక విప్లవం – మన కర్తవ్యాలు" అనే పత్రాన్ని ప్రచురించారు. రాష్ట్రస్థాయిలో సరియైన ప్రజాసాంస్కృతికోద్యమ అవగాహనకై ఎదురుచూస్తున్న వారందరూ దానిని అందుకున్నారు. అలాగే కామ్రేడ్ మధు మార్గదర్శకత్వంలో హైదరాబాద్ లో నవోదయ సాహితీ సాంస్కృతిక సంస్థ, 'జీవనాడి' మాస పత్రిక రూపుదిద్దుకున్నాయి. 'జీవనాడి' పత్రిక, నవోదయ కళా ప్రదర్శనల ప్రభావం ఆనాడు హైదరాబాదులోనే కాక వివిధ జిల్లాలలో కూడా ఉండేది.

భూస్వామ్య వ్యతిరేక ప్రజాతంత్ర సంస్కృతిని, సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ సంస్కృతినీ, మత మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ సంస్కృతిని నిర్మించే లక్ష్యంతో, అనగా శాస్త్రీయమైన స్వతంత్రమైన ప్రజాతంత్ర సంస్కృతి నిర్మాణానికి సాహిత్య కళారూపాల ద్వారా సంఘటితకృషి చేసే ప్రయత్నం వాటితో తిరిగి మొదలైంది. ఆ విధంగా "సాంస్కృతిక విప్లవం – మన కర్తవ్యాలు" పత్రం ప్రజాసాహితీ సాంస్కృతికోద్యమ దృక్పథానికి దారులు సుగమం చేసింది. సంస్థాగతమైన సాహిత్య చరిత్ర లోతుపాతులు తెలియనివారు కొందరు, "సాంస్కృతిక విప్లవం – మన కర్తవ్యాలు" పత్రానికి ఓల్గా డాక్యుమెంట్ అని వ్యవహరించారు.

కామ్రేడ్ మధుగా పేరుగడించిన మరింగంటి శ్రీనివాసాచార్యులుది మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి దగ్గర వంగూరు మండలంలోని రంగాపురం గ్రామం. అది ఇప్పుడు నాగర్ కర్నూలు జిల్లాలో ఉంది. ఆయన కల్వకుర్తి హైస్కూలులో చదువుకునే రోజుల్లోనే వామపక్ష ఉద్యమాలకు ఆకర్షితులయ్యారు. ఆ తర్వాత హైదరాబాదు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుకునే రోజుల్లో విద్యార్థి సంఘాల కార్యకలాపాలలోను విశాఖ ఉక్కు ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నారు. కొద్దికాలం పాటు ఆప్కో సంస్థలో ఉద్యోగం చేసినప్పటికి త్వరలోనే దాన్ని వదులుకున్నారు. పూర్తికాలం విప్లవోద్యమ కార్యకర్తగా రూపుదిద్దుకున్నారు. కామ్రేడ్ మధుకి చిన్నతనం నుండి సాహిత్యాభిరుచి ఉండేది. వారిది సాంప్రదాయక సాహిత్య సాంస్కృతిక నేపథ్యం బలంగా ఉండిన కుటుంబం. అయినప్పటికీ ఆయనను చిన్నతనంలోనే వామపక్ష భావజాలం ఆకర్షించింది.

1960వ దశకం చివరి రోజుల్లో 'గల్పికలు' అనే కథాసంకలనాన్ని మహబూబ్‌నగర్ జిల్లా రచయితల వేదిక ప్రచురించిన కృషిలో కామ్రేడ్ మధు ఉన్నారు. వరంగల్ జిల్లా నుండి వెలువడిన "తిరగబడు" కవితాసంకలనంపై 'సృజన' పత్రికలో కృష్ణమూర్తి అనే పేరుతో విమర్శనాత్మక సమీక్ష రాసినది కామ్రేడ్ మధునే! అలాగే కామ్రేడ్ జ్వాలాముఖి విరసం వారి 'ఎరుపు' బులెటిన్లో రాసిన "రేపటి కవిత్వం" అనే వ్యాసంపై మోహనరావు అనే పేరుతో 'జ్వాలాముఖి గందరగోళం' అంటూ అతివాద కోణం నుండి విమర్శ ఒకటి రాగా, విప్లవ కవుల్లో అలీనవాదం సరైన దృక్పథం కాదంటూ ప్రకాశరావు పేరుతో కామ్రేడ్ మధు 'జనశక్తి' పత్రికలో విమర్శనాత్మక వ్యాసం రాశారు. అది ప్రకాశరావు పేరుతో అప్పుడే పుస్తకంగా కూడా వెలువడింది.

నూతన ప్రజాస్వామిక విప్లవదశలో సాంస్కృతికోద్యమ దృక్పథమూ, నిర్మాణమూ ఎలా ఉండాలో ఉండకూడదో వివరించే విప్లవ మార్క్సిస్టు కోణం కామ్రేడ్ మధు ద్వారా రచయితలకు సాంస్కృతికోద్యమ కార్యకర్తలకు అందింది. అలాగే ప్రకాశరావు పేరుతో 'ప్రజాసాహితీ సాంస్కృతికోద్యమం – కమ్యూనిస్టులు' అనే విశ్లేషణాత్మక పత్ర రచయిత కూడా కామ్రేడ్ మధే! అలాగే వివిధ రాష్ట్రాలలోని విప్లవ దృక్పథం గల ప్రగతిశీల రచయితలు, ప్రజాసాహితీ సాంస్కృతికోద్యమ వేదిక ద్వారా సంఘటిత కృషి చేయడానికి అవగాహనాపరమైన తోడ్పాటు, మార్గదర్శకత్వం అందించి సహకరించటంలో ఆయన పాత్ర చెప్పుకోదగినది. 78 సంవత్సరాల కామ్రేడ్ మధు సుమారు 60 ఏళ్ల పాటు రాజకీయ ఉద్యమాలలో వుంటూ 53 ఏళ్ల పాటు పూర్తికాలం విప్లవ కార్యకర్తగా వివిధ స్థాయిలలో బాధ్యతలు నిర్వహించారు.

నేటి నూతన ప్రజాస్వామిక విప్లవదశలో సాంస్కృతిక ఉద్యమం భూస్వామ్య వ్యతిరేక ప్రజాతంత్ర స్వభావాన్ని సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ స్వభావాన్ని సంతరించుకుని ఆధునిక కాలంలోని సమస్త వైజ్ఞానిక రంగాల ద్వారా అభివృద్ధి పొందిన శాస్త్రీయ చింతనను అలవర్చుకోవాలనే విస్పష్టమైన అవగాహనను సాహిత్య సాంస్కృతిక ఉద్యమ కార్యకర్తలకు అందించిన కామ్రేడ్ మధుకి జనసాహితి సంస్థ, 'ప్రజాసాహితి' పత్రిక హృదయ పూర్వక నివాళులు అర్పిస్తూ విప్లవ జోహార్లు చెబుతోంది. వారి కుటుంబ సభ్యుల బాధను పంచుకుంటూంది. వారందించిన అవగాహనలోని ప్రజాసంస్కృతికోద్యమ స్ఫూర్తిని నిలుపుకుంటూ ముందుకు తీసుకు వెళ్తామని కృతనిశ్చయంతో ప్రకటిస్తోంది.

– జనసాహితి ❖

PRAJAA SAAHITHI May, 2021 (TELUGU) Rs. 25/- RNI No.APTEL/1977/0571 Postal Regd. No. Vj/030/2021-2023

No. of Pages : 36 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month



ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.

Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada

A PUBLICATION OF JANASAAHITHI